www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 7 | సంచిక: 214 | గురువారం | 24 జనవరి, 2019

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00



దివ్యవేదోక్త మంత్ర పుష్పం, రాజశ్యామలదేవికి తొలిపూజ

రుద్రహవనం... పారాయణం

మన తెలంగాణ/హైదరాబాద్

రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఎర్రవల్లిలోని తన వ్యవసాయక్షేత్రంలో ఐదురోజులపాటు తలపెట్టిన మహారుద్ర సహిత సహస్ర మహా చండీయాగం మూడవరోజు వైభవంగా కొనసాగింది. బుధవారం ఉదయం 8 గంటలనుంచి యజ్ఞాయాగాదులు సహస్ర చండీయాగంతో ప్రారంభమయ్యాయి. శృంగేరి పీఠాధిపతి భారతీ తీర్థ స్వామి ఆశీస్సులతో విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర స్వామి పర్యవేక్షణలో ప్రారంభమైన యాగం మూడవరోజున ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు దంపతులు యాగస్థలికి చేరుకుని సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి యాగాన్ని ప్రారంభించారు. తొలుత కెసిఆర్ దంపతులు రాజశ్యామల మంటపానికి చేరుకుని అమ్మవారికి తొలిపూజచేశారు. మహాకాళి, మహాసరస్వతి, మహాలక్ష్మి అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. యాగస్థలిలో తరువాయి 3లో



రాజశ్యామల మంటపానికి చేరుకుని అమ్మవారికి తొలిపూజ చేసిన కెసిఆర్ దంపతులు

ఆంధ్రా మీడియా ఆధిపత్యం

ఇంకానా..?

వారిది తెలంగాణ అస్తిత్వ ధిక్కార ధోరణి

ఆంధ్రావార్తలు ఇక్కడ అవసరమా ?

ఇక్కడి సమాచారం అక్కడ ఇవ్వరేం ?

చంద్రబాబువి ఆపదమొక్కులు

మన విధానాలను కాపీ కొడుతున్నారు

- ఎంఎల్‌ఎగా ఎన్నికైన జర్నలిస్టు క్రాంతికిరణ్ సన్మాన సభలో కెటిఆర్



మన తెలంగాణ/హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడివి అన్నీ ఆపదమొక్కులేనని, తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను కాపీ కొట్టి 'కట్ అండ్ పేస్ట్' చేస్తున్నారని టిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ వ్యాఖ్యానించారు. తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ ఏంచేస్తే తాను కూడా అదే చేసి రానున్న ఎన్నికల్లో మళ్ళీ అధికారంలోకి రావచ్చని చంద్రబాబు కలలు కంటున్నారని, అయితే రాజకీయంగా చైతన్యవంతులైన ఆ రాష్ట్ర ప్రజలు ఈ ప్రలోభాలకు లోనుకారని, నేతల చిత్తశుద్ధిని గ్రహిస్తారని అన్నారు. ఆంధోల్ నియోజకవర్గం నుంచి శాసనసభ్యుడిగా ఎన్నికైన క్రాంతి కిరణ్‌కు జర్నలిస్టు యూనియన్ నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కెటిఆర్ బుధవారం ప్రసంగిస్తూ, చిత్తశుద్ధి లేని శివ పూజ తరహాలోనే ఆంధ్ర సిఎం వ్యవహరిస్తున్నారని, ఇంతకాలం అమలు చేయలేక ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రలోభ పర్వానికి తెర తీశారని ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వం ఏనాడో ఆటోరిక్షాలకు, ట్రాక్టర్లకు రవాణా పన్నును రద్దు చేస్తే చంద్రబాబు మాత్రం ఇప్పుడు రద్దు చేశారని, జర్నలిస్టుల ఇండ్ల స్థలాలకు సంబంధించి జివో జారీ చేశారని గుర్తుచేశారు. తెలంగాణ తరువాయి 6లో

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి హామీ

ప్రియాంకం

తూర్పు యుపి కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా ప్రత్యక్ష రాజకీయాల్లో ప్రవేశం



న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న క్షణం రానే వచ్చింది. ఎన్నో ఏళ్లుగా ఆమె రాజకీయ రంగ ప్రవేశంపై వెలువడుతున్న ఊహాగానాలకు బుధవారం నాడు తెరపడింది. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సోదరి, సోనియా గాంధీ కుమార్తె ప్రియాంక వాద్రా ఎట్టకేలకు ప్రత్యక్ష రాజకీయాల్లోకి ప్రవేశించారు. ప్రియాంకను తూర్పు ఉత్తర్ ప్రదేశ్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జిగా నియమించారు. గతంలో ఎన్నికల వ్యూహాలను రూపొందించడంలో, అభ్యర్థుల జాబితాలను ఖరారుచేయడంలో తనదైన శైలిలో పరోక్ష పా త్ర పోషించిన ప్రియాంక ఇక ఆ పాత్ర ను ప్రత్యక్షంగానే పోషించనున్నారు. "తూర్పు ఉత్తర్ ప్రదేశ్‌కు ఎఐసిసి ప్రధా న కార్యదర్శిగా ప్రియాంక గాంధీ వాద్రాను కాంగ్రెస్ అధ్యక్షుడు నియమించారు. ఆమె తన పదవీ బాధ్యతలను ఫిబ్రవరి తరువాయి 6లో

కాళేశ్వరానికి రూ. 7,785 కోట్ల రుణం

రెండు ప్యాకేజీలకు మంజూరు చేసిన పవర్ ఫైనాన్స్ సంస్థ

కాళేశ్వరం కార్పొరేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి

మన తెలంగాణ /హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా నిర్మిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టుకు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ రూ. 7,785 కోట్ల మేర రుణాన్ని సమకూర్చింది. ఇప్పటికే రూ. 12,067.36 కోట్ల మేర రుణాన్ని ఇవ్వగా ఇప్పుడు రెండు ప్యాకేజీలకు వేర్వేరుగా రూ. 7,784.95 కోట్లను మంజూరు చేసింది. ఈ రుణాన్ని తీసుకోవాల్సిందిగా కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. ఈ మొత్తంరుణానికి రాష్ట్ర తరువాయి 6లో



పంచాయతీకొక నర్సరీ



పట్టణాల్లో ప్రతి వార్డుకీ

వచ్చే హరితహారంలో కోటి మొక్కలు లక్ష్యం

అర్బన్ ఫారెస్టు పార్కులపై దృష్టి



మన తెలంగాణ/హైదరాబాద్

ప్రతీ గ్రామ పంచాయతీకి ఒకటి చొప్పున మొక్కలను పెంచే నర్సరీలను ఏర్పాటు చేయాలని, కొత్తగా ఏర్పడిన పంచాయతీల్లో వీటిని వీలైనంత త్వరగా ఏర్పాటుచేసి రానున్న ఐదవ విడత హరితహారం నాటికి మొక్కలను సిద్ధం చేయాల్సిందిగా పంచాయతీరాజ్, అటవీ శాఖల అధికారులకు ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి ఆదేశాలు జారీ చేశారు. పట్టణ ప్రాంతాల్లో సైతం ప్రతీ వార్డు, డివిజన్‌లలో ఒక్కో నర్సరీలు ఉండాలని, వాటిలో మొక్కలు పెంచి హరితహారం కోసం సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. వివిధ శాఖల కార్యదర్శులతో సిఎస్ సచివాలయంలో బుధవారం సమీక్ష నిర్వహించి ముఖ్యమంత్రి ఆదేశాలు, తరువాయి 6లో

కుంచెపోటు



నీ కోసం ఎవరొచ్చారో చూస్తే లేచి ఆనందంతో డాన్స్ చేస్తావ్ !

విరాళాల్లో దొంగ సొమ్ము

పార్టీలకు వచ్చిన విరాళాల్లో సగానికి పైగా గుప్తనిధులే 10

బాలుడు సహా 9 మంది ఐసిస్ తీవ్రవాదుల

అరెస్టు

పీయూష్‌కు ఆర్థికశాఖ అదనపు బాధ్యతలు

నేడే కలాంశాట్ ప్రయోగం

ఆశల వలతో రూ.100 కోట్లు

లక్ష పెట్టుబడి పెడితే నెలకు రూ. 10000 ఆదాయం !

- బట్టబయలైన ఘరానా మోసం
- పోలీసుల అదుపులో నిందితుడు కంపెనీ ఎండి శ్రీకాంత్

పల్లీ నూనెతో నాలుగు రాష్ట్రాల మధ్య తరగతి ప్రజలకు తలంటిన గ్రీన్‌గోల్డ్ బయోటెక్



మన తెలంగాణ/హైదరాబాద్

హైదరాబాద్ రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గ్రీన్‌గోల్డ్ పేరిట మరో మల్టీలెవల్ మోసం చోటుచేసుకుంది. నాగోల్‌లో గ్రీన్‌గోల్డ్ బయోటెక్ పేరుతో ఏర్పాటు చేసిన ఎంఎల్‌ఎం కంపెనీ మోసాన్ని పోలీసులు బట్టబయలు చేశారు. శనక్కాయల గింజల నుంచి ఆయిల్ బయటకు తీసే తరువాయి 6లో

మోడల్ టౌన్‌గా యాదగిరిగుట్ట

- త్వరలో బస్‌స్టేషన్ నిర్మాణానికి ప్రతిపాదనలు
- వైటిడిఎ అధికారులతో సిఎస్ భేటీ

మనతెలంగాణ/ హైదరాబాద్ : యాదగిరిగుట్టలో మోడల్ బస్ స్టేషన్ నిర్మాణానికి త్వరితగతిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలో జరిగిన వై.టీ.డీ.ఏ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ యాదగిరి గుట్ట బస్ స్టేషన్ నిర్మాణానికి కాలపరిమితిని నిర్ణయించుకుని పనులు ప్రారంభించాలన్నారు. పెద్దగుట్టలో 132/33 కెవి సబ్ స్టేషన్ నిర్మాణ పనులను ఏప్రిల్ 15 నాటికి పూర్తి చేయాలన్నారు. యాదగిరి గుట్టను మోడల్ టౌన్‌గా అభివృద్ధి చెయ్యడానికి అవెన్యూ ప్లాంటేషన్, స్మార్ట్ స్ట్రీట్ లైటింగ్, పార్కుల అభివృద్ధి, మార్కెట్లు, జంక్షన్ల అభివృద్ధి, రోడ్లు, డ్రైనేజీ, ఫుట్ పాత్‌ల నిర్మాణం, డంపింగ్ యార్డు పనులను చేపట్టే కార్యాచరణ అమలుకు చర్యలు తీసుకుంటామన్నారు. యాదగిరి గుట్టలో కమాండ్ కంట్రోల్ సెంటర్, ఫైర్ స్టేషన్, రోడ్ల వెడల్పు, గండి చెరువు అభివృద్ధి, మాస్టర్ ప్లాన్, మంచినీటి సరఫరా, వేద పాఠశాల, శ్రీ లక్ష్మీ నరసింహ శిల్పకళాశాల ఏర్పాటు గురించి ఆయన అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా, రెవన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్వర్ తివారి, రహదారులు, భవనాల శాఖ ముఖ్యకార్యదర్శి సునీల్ శర్మ, వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్ రావు, దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్, సీడీఎంఏ టి.కె. శ్రీదేవి, యాదాద్రి దేవాలయం ఈవో గీతతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



ఇస్టాకు వెయ్యిమంది రైతులు

మన తెలంగాణ/హైదరాబాద్: వచ్చే జూన్ 26వ తేదీ నుంచి జూలై 3వ తేదీ వరకు జరగనున్న అంతర్జాతీయ విత్తన సదస్సులో (ఇస్టా) వెయ్యి మంది రైతులు పాల్గొంటారని వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి సి.పార్థసారధి తెలిపారు. విత్తన ధ్రువీకరణ సంస్థలో ఇస్టా ఏర్పాట్లపై ఆయన అధికారులతో సమీక్షించారు. అంతర్జాతీయ విత్తన సదస్సు నిర్వహణ కోసం కావాల్సిన అన్ని కమిటీలను వేయాలని ఆదేశించారు. సదస్సులో పాల్గొనే రైతులకు రవాణా, ఇతర సదుపాయాలు కల్పించాలన్నారు.

డిండికి నీటి సరఫరాపై పునరాలోచన

మన తెలంగాణ/హైదరాబాద్: డిండి ఎత్తిపోతలకు నీటి సరఫరాపై అధికారులు పునరాలోచనలో పడ్డారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని రెండో రిజర్వాయర్ ఏదుల నుంచి డిండి ఎత్తిపోతలకు నీరిచ్చే యోచనలో యంత్రాంగం ఉంది. నేరుగా డిండి రిజర్వాయర్‌కు కాకుండా ఉల్పర రిజర్వాయర్‌కు నీటిని తరలించడంలోని సాధ్యాసాధ్యాలపై కసరత్తు మొదలుపెట్టారు. డిండి రిజర్వాయర్‌కు పది కిలోమీటర్ల ఎగువన ఉల్పర వద్ద రిజర్వాయర్‌ను ప్రతిపాదించారు. ఫ్లోరైడ్ పీడిత మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాలతో పాటు నల్లగొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలలోని 4 లక్షల ఎకరాలకు నీరిచ్చే ఉద్దేశంతో రోజుకు 0.5 టిఎంసిలతో డిండి ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం దుంధుభి నదిపై నుంచి నీటిని మళ్లించేలా డిజైన్ చేయగా, దుందుభి వరకు నీరెలా తెస్తారన్నది ఇంకా తేలాల్సి ఉంది. తొలుత ఏదుల నుంచి డిండికి అలైన్‌మెంట్ ఇవ్వగా, మహబూబ్‌నగర్ జిల్లాలో స్థానికంగా వ్యతిరేకత రావడం, ప్రజాప్రతినిధులు కూడా సిఎంకు ఫిర్యాదు చేయడం, కల్వకుర్తి ఆయకట్టు భారీగా దెబ్బతింటుండడంతో దాన్ని నార్లాపూర్‌కు మార్చారు. నార్లాపూర్ నుంచి కాకుండా నేరుగా కృష్ణా నది నుంచి తీసుకోవాలని మహబూబ్‌నగర్ జిల్లా వాసులు అదేపనిగా డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా కొనసాగుతుండగానే ఉల్పర రిజర్వాయర్ తెరపైకి వచ్చింది. ప్రతిపాదిత ఉల్పర రిజర్వాయర్ నుంచి నీటిని మళ్లించి, డిండి లిఫ్టు ప్యాకేజీ 1లో 10వ కిలోమీటర్ వద్ద కలుపాలన్నది ప్రతిపాదన. దీనికి సంబంధించి ప్రధాన కాలువ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. డిండికి నీటి మళ్లింపు కోసం మరోమారు ప్రత్యేక కాలువ, ఇంకో దశ పంపుహౌజ్ నిర్మాణంపై ముఖ్యమంత్రి కెసిఆర్ ఇటీవల నిర్వహించిన సమీక్షలో ప్రశ్నించినట్లు తెలిసింది. దీంతో పునరాలోచనలో పడ్డ యంత్రాంగం మళ్లీ ఏదులపై దృష్టిపెట్టింది. ఏదుల నుంచి నేరుగా డిండికి కాకుండా, ఉల్పర రిజర్వాయర్‌కే తరలించడంపై దృష్టిసారించారు. నార్లాపూర్, ఏదుల రిజర్వాయర్లలో ఎక్కడి నుంచి నీటిని మళ్లిస్తే, ఏ విధంగా ఉంటుందన్న దానిపై సర్వే చేసి, ఖర్చు, భూసేకరణ, తదితర అంశాలపై ఆధారపడి తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

గాలి గోపురం పనులకు శంకుస్థాపన

మనతెలంగాణ/యాదాద్రి : శ్రీలక్ష్మీ నరసింహ స్వామి యాదాద్రి క్షేత్రము ఆలయ అభివృద్ధి పనులో భాగంగా కొండ కింద పైకి వచ్చె మెట్ల ప్రారంభంలో గాలి గోపురం నిర్మాణ పనులకు శంకుస్థాపన పూజలను నిర్వహించారు. బుధవారం రోజున మెట్ల మార్గం వద్ద ప్రస్తూతం ఉన్న సింహద్వారం పక్కన నూతనంగా గాలి గోపూరం నిర్మాణం చేయుటకు గోపూర శిలకు శంకుస్థాపనలు పూజలను నిర్వహించారు. ఆలయ పనులు పూర్తి అయ్యే వరకు గోపూర పనులను పూర్తిచేసి మెట్ల మార్గంను కూడ ప్రారంభించే విధంగా పనులు చేయనున్నారు.



జర్నలిస్టులపై సేవ్ శబరిమల సభ్యుల దాడి

- అడ్డుకున్న తోటి జర్నలిస్టులపై దుర్భాష
- ధర్నాచౌక్‌లో ఉద్రిక్త వాతావరణం



మన తెలంగాణ / ముషీరాబాద్ : సేవ్ శబరిమల ఆధ్వర్యంలో శబరిమల ఆలయాన్ని కాపాడుకుందామని బుధవారం హైదరాబాద్ ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో జరిగిన మహా ఉపవాస దీక్ష ఉద్రిక్తంగా మారింది. ఈ ఉపవాస దీక్షకు శబరిమల అధికారి రవింతుల శశిధర్, శబరిమల అయ్యప్ప సేవా సమాజం కార్యనిర్వాహక కార్యదర్శి నాయిని బుచ్చిరెడ్డి, విహెచ్‌పి రాష్ట్ర అధ్యక్షుడు రామరాజు, బిజెపి నగర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, చిలుకూరి బాలాజీ దేవాలయం ఛైర్మన్ రంగరాజన్, భారతి మాతాజీ నిర్మలానంద, రాష్ట్రీయ దళిత సేన నాయకుడు హమారా ప్రసాద్ తదితరులు హాజరయ్యారు. ఈ ఉపవాస దీక్షను కవరేజ్ చేసేందుకు వచ్చిన ఓ మీడియా ఛానెల్ పై సేవ్ శబరిమల సభ్యులు, ఆయా సంఘాల నాయకులు సదరు ఛానెల్ రిపోర్టర్, కెమెరామెన్‌పై దాడి చేసారు. తోటీ జర్నలిస్టులు అడ్డుకోగా, వారి పట్ల సైతం దురుసుగా ప్రవర్తించారు. దీంతో విలేకర్లందరూ న్యూస్ కవరేజ్‌ను చేయమని తేల్చిచెప్పారు. సేవ్ శబరిమల కార్యనిర్వాహక కార్యదర్శి నాయిని బుచ్చిరెడ్డి తదితరులు క్షమాపణ చెప్పడంతో విలేకర్లు శాంతించారు. ఇదిలావుండగా, అక్కడి ప్రాంతమంతా ఘర్షణ వాతావరణం నెలనకొనడంతో చిక్కడపల్లి ఏసిపి నర్సింహారెడ్డి, గాంధీనగర్ సిఐ. శ్రీనివాస్‌రావు తదితర సిబ్బంది భారీగా మోహరించారు. తమ రిపోర్టర్, కెమెరామెన్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలని పోలీసులు సదరు ఛానెల్ జర్నలిస్టులు డిమాండ్ చేశారు. వారికి పలు జర్నలిస్టు సంఘాల నాయకులు వచ్చి మద్దతు పలికారు.

హత్యారాజకీయాలు చేయాల్సిన అవసరం నాకు లేదు

- నైతిక విలువలతో రాజకీయాల్లో కొనసాగుతున్నా
- నాపై వ్యక్తిగతంగా షుజా చేసిన ఆరోపణలను ఖండిస్తున్నా
- తెలంగాణ ప్రభుత్వం దీనిపై విచారణ జరిపించాలి
- బిజెపి నేత కిషన్‌రెడ్డి



మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల నంబర్‌గేమ్‌లో అంబర్‌పేట్ నుంచి తాను ఓడిపోయినా, ఇప్పటికీ ప్రజల మధ్యనే ఉంటున్నానని బిజెపి నాయకుడు, మాజీ ఎమ్మెల్యే జి. కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. సుమారు ముప్పై సంవత్సరాలుగా తాను రాజకీయాల్లో కొనసాగుతున్నప్పటికీ ఏనాడూ నైతిక విలువలకు తిలోదకాలు ఇవ్వలేదన్నారు. గత సార్వత్రిక ఎన్నికల సందర్భంగా తాను హత్యా రాజకీయాలకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలపై కిషన్‌రెడ్డి స్పందించారు. బుధవారం నాడిక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ, తనపై ఇలాంటి ఆరోపణలు రావడం బాధాకరమని అన్నారు. సైబర్ ఎక్స్‌పర్టుగా చెప్పుకుంటున్న సయ్యద్ షుజా అనే వ్యక్తి అమెరికాలో నివాసం ఉంటూ, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన మీడియా సమావేశం (లండన్)లో మాట్లాడుతూ, బిజెపి, ఈసీ, వ్యక్తిగతంగా తనపై అనేక ఆరోపణలు చేశారన్నారు. 2014 పార్లమెంట్ ఎన్నికల్లో ఈవీఎంల ట్యాంపరింగ్ ద్వారా బిజెపి గెలిచిందని సైబర్ ఎక్స్‌పర్ట్‌గా చెప్పుకుంటూ షుజా చేసిన ఆరోపణలను ఆయన ఖండించారు. కాంగ్రెస్ కుట్రలో భాగంగానే తనపై సుజు ఆరోపణలు చేశారని కిషన్‌రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ నేత కపిల్ సిబల్ సమక్షంలోనే షుజా మాట్లాడారని, ఈవీఎంలో లోపాలు ఉంటే రుజువు చేయాలని ఆయన సవాల్ చేశారు. కాకిరెడ్డి అనే వ్యక్తి తనకు తెలియదని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. 11 మందిని హత్య చేయిస్తే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తనపై ఎందుకు కేసు పెట్టలేదని ప్రశ్నించారు. షుజా ఆరోపణలపై తెలంగాణ ప్రభుత్వం విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. పైగా దీనికి మతకలహాల రంగు కూడా పులిమారని ఆయన విమర్శించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి ఖాయమైందని, అందుకే ఆ పార్టీ ఇప్పటి నుంచే సాకులు వెతుక్కుంటోందని మండిపడ్డారు. అసలు సయ్యద్ షుజా అనే వ్యక్తి ఎవరో కూడా తనకు తెలియదన్నారు. వారి కుటుంబం ఎక్కడి నుంచి వచ్చింది...ఎక్కడ స్థిరపడ్డారో తెలియదన్నారు. అసలు కాకిరెడ్డి ఎవరు...అలాంటి పేరుతో తనకు ఎవరు తెలియదన్నారు. ఈ విషయంపై తెలంగాణ రాష్ట్ర డిజిపితో పాటు అవసరమైతే సిబిఐతో విచారణ జరిపించాలని కూడా తాను కోరనున్నట్లు కిషన్‌రెడ్డి తెలిపారు.



(మొదటిపేజీ తరువాయి)

ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన బ్రహ్మస్వరూపిణి మంటపంలో పూజలు నిర్వహించారు. దివ్యవేదోక్త మంత్రపుష్పం సమర్పయామి అని చతుర్వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ముఖ్యమంత్రి కెసిఆర్ దంపతులు అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. ఆతర్వాత నవగ్రహాలకు ప్రత్యేకపూజలు జరిపి వేదపారాయణ చతుర్వేద పారాయణం మంటపంలో ప్రార్థనలు చేశారు. సహస్ర మహాచండీపారాయణ మంటపంలో చండీమాత పూజలు నిర్వహించారు. అతర్వాత మహారుద్ర మంటపంలో రుద్ర హవనం, రుద్రపారాయణ నిర్వహించారు. ముఖ్యమంత్రి దంపతులు మహారుద్రమంటపంలో రుద్రహవనం సుమారు రెండుగంటలపాటు నిర్వహించారు. వేదపండితులు మంత్రోచ్ఛరణలు సాగిస్తుండగా పండితుల సూచనల మేరకు సిఎం దంపతులు వైదిక సాంప్రదాయాలను అనుసరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులతోపాటుగా మాజీ మంత్రులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, పార్టీ ప్రముఖులు, ముఖ్యమంత్రి రాజకీయసలహాదారులు పలువురు పాల్గొన్నారు.

ప్రాంతంలోకి వచ్చేభక్తులు, నిర్వాహకులు తప్పనిసరిగా నియమాలు పాటిస్తున్నారు. యజ్ఞంలో పాల్గొనే ప్రముఖులు దంపతులుగానే ఆసీనులు అవుతున్నారు. బుధవారం మాజీ హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి దంపతులు, వేముల ప్రశాంత్ రెడ్డి దంపతులతోపాటు పలువురు ప్రముఖులు కుటుంబసభ్యులతో కలిసి యాగస్థలిలో పూజలు నిర్వహించారు.

విశ్రాంతి గృహాలు

యాగస్థలికి సమీపంలో రుత్విక్కులకు, యాగ నిర్వాహక పండితులకు ప్రత్యేక విశ్రాంతి గృహాలను నిర్మించారు. రుత్విక్కుల విశ్రాంతి మందిరాలవైపు ఇతరులను అనుమతించడంలేదు. వేదపండితులు నిత్యారాధన చేసేందుకు అనువుగా విశ్రాంతి గదులను నిర్మించారు. ప్రత్యేక భోజనశాలలను ఏర్పాటు చేసి వారికి సౌకర్యాలను కల్పించారు. యాగం శాస్త్రీయంగా వేదాలసారానికి అనువుగా నియమ నిబంధనలతో ఎంతో పవిత్రంగా కొనసాగుతోంది. 200మంది రుత్విక్కులు పారాయణల్లో పాల్గొనగా మరో వందమంది వేదపండితులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

రుద్రహవనం... పారాయణం











రుత్విక్కుల పారాయణం

రాజశ్యామల యాగంలో పూజావిధానాలకు అనుగుణంగా యాగ నిర్వహకులు, రుత్వికులు దుస్తులు ధరిస్తున్నారు. తొలిరోజు పసుపు వర్ణం వస్త్రాలతో వేదపారాయణం చేసిన రుత్విక్కులు, రెండవరోజు గులాబీ రంగు వస్త్రాలను ధరించారు. మూడవరోజు దవళవస్త్రాలను ధరించి కార్యక్రమాలు నిర్వహించారు. చతుర్వేదంలో నిష్ణాతులైన రెండువందల మంది రుత్విక్కులు వేదపారాయణం చేస్తూండగా నిర్వాహకులు హోమగుండం వద్ద క్రతువు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని వేదపండితులతో పాటు కర్ణాటక, ఆంధ్ర ప్రాంత పండితులు యాగం నిర్వహణలో రుత్విక్కులుగా వ్యవహరిస్తున్నారు. శృంగేరి పీఠాధిపతి భారతీతీర్థస్వామి ఆశీస్సులతో ఈ పీఠానికి చెందిన మాణిక్య సోమయాజులు, తంగిరాల సీతారామ శాస్త్రి, రుగ్వేద పండితులు నరేంద్ర కాప్రే యాగానికి వైదిక సార థ్యం వహిస్తుండగా రుత్విక్కులు వేదపారాయణం చేస్తున్నారు. ఏకోత్తర విధానంతో పారాయణం కొనసాగుతోంది. సహస్ర చండీయాగంలో 200 మంది రుత్విక్కులు పారాయణంచేస్తూ వేదమంత్రోచ్ఛరణలతో యాగ స్థలిని పునీతం చేస్తున్నారు. ఐదురోజుల ఈ యాగానికి అష్టకాల రామ్మోహనరావు సమన్వయకర్తగా వ్యవహరిస్తున్నారు. బుధవారం రాష్ట్ర మాజీ హోంశాఖ మంత్రి నాయిని నరసింహారెడ్డి పాల్గొనగా పలువురు యాగ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

పటిష్టమైన ఏర్పాట్లు

ప్రజల సంక్షేమాన్ని ఆశిస్తూ రాష్ట్రముఖ్యమంత్రి తలపెట్టిన రాజశ్యామల చండీయాగంకు పటిష్టమైన ఏర్పాట్లు చేశారు. సందర్శకులకు అనుమతి లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో యాగాలు నిర్వహిస్తున్నారు. యాగశాలను శాస్త్ర యుక్తం నిర్మించారు. హోమగుండంలోని అగ్నిజ్వాలలకు అనువుగా నిర్మాణాలు చేశారు. యాగ

ప్రజాసంక్షేమమే యాగలక్ష్యం

ప్రజాసంక్షేమాన్ని, రాజ్యాభివృద్ధిని అకాంక్షిస్తూ పాలకులు నిర్వహించే యాగమే రాజశ్యామల యాగమని యాగనిర్వాహకుల్లో ఒకరైన పురాణం మహేశ్వర శర్మ చెప్పారు. చరిత్రకాలంలో రాజులు, చక్రవర్తులు యాగాలు, యజ్ఞాలు, హోమాలుచేసి ప్రజల సంక్షేమానికి దేవుడి ఆశీస్సులను కోరేవారని చెప్పారు. ఆయితే గడిచిన 60 ఏళ్లలో తెలుగు ప్రాంతాల్లో పాలకులు ప్రజల క్షేమంకోరి యాగాలుచేసిన చరిత్రలేదని చెప్పారు. తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ తలపెట్టిన రాజశ్యామల యాగంతో తెలంగాణ ధరణి పులకరిస్తుందన్నారు. ప్రజలక్షేమమే పరమావధిగా నిర్వహిస్తున్న యాగఫలం అమోఘమైందని చెప్పారు. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు చతుర్వేద పండితులతో నిర్వహిస్తున్న రాజశ్యామల, మహారుద్ర సహిత సహస్రచండీయాగం ఎంతో పవిత్రమైందనీ ప్రజలు సుఖశాంతులతో జీవించేందుకు యాగఫలముంటుందని చెప్పారు.

ఏర్పాట్లలో నిమగ్నమైన రాజ్యసభ సభ్యుడు సంతోష్‌రావు

ముఖ్యమంత్రి కెసిఆర్ యాగంలో పాల్గొని పూజలు నిర్వహిస్తుండగా బుధవారం రాజ్యసభ సభ్యుడు సంతోష్ కుమార్ రావు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ప్రముఖులను ఆహ్వానిస్తూ వారికి కావల్సిన సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ఆహ్వానితులకు కావల్సిన సౌకర్యాలను సమకూరుస్తూ యాగనిర్వహణలో ఆయన చేదోడు వాదోడుగా నిలిచారు. అలాగే రుత్విక్కులకు కావల్సిన సౌకర్యాలు ఏర్పాటు చేస్తూ వేదపండితుల సూచనలు తీసుకుంటూ నిర్వహణలో నిమగ్నమయ్యారు. బుధవారం ప్రముఖుల తాకిడి అధికంగా ఉండటంతో ప్రత్యేక ఏర్పాట్లు శాస్తయుక్తంగా చేశారు. తాజా మాజీ మంత్రి ఈటల రాజేందర్ దంపతులు, నాయిని నర్సింహారెడ్డి దంపతులతో పాటు పార్లమెంట్ సభ్యుడు వినోద్, శాసనసభ్యులు మర్రి జనార్థన్ రెడ్డి, శేరి సుభాష్ రెడ్డి, శాసనమండలి సభ్యుడు పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఇటీవల టిఆర్ఎస్‌లో చేరిన వంటేరు ప్రతాపరెడ్డి, టిఆర్ఎస్ సెక్రటరీ జనరల్ కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక శాకాహార వంటకాలు

యాగానికి వచ్చిన ప్రముఖులకు, వేదపండితులకు, నిర్వాహకులకు, రుత్విక్కులకు ప్రత్యేక భోజన శాలలను ఏర్పాటు చేశారు. అనేక రకాల శాకాహార వంటలు ఆహ్వానితులను అమితంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యమంత్రి కెసిఆర్ ఆహ్వానితుల భోజనశాలకు వచ్చి అందరిని పలకరించారు, పేరుపేరున ప్రముఖులను పలకరిస్తూ భోజనాలు చేసేంతవరకు వారితోనే ఉన్నారు.

సిఎం కెసిఆర్‌కు అర్చక సమాఖ్య డైరీ



మన తెలంగాణ/హైదరాబాద్ : బ్రాహ్మణ సంక్షేమం, అర్చక సమాఖ్య అభ్యున్నతికి పాటుపడతున్న సిఎం కెసిఆర్‌కు కృతజ్ఞతాభావంగా ముద్రించిన నూతన డైరీని ముఖ్యమంత్రి దంపతులకు తెలంగాణ ఆర్చక సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ గంగు ఉపేంద్ర శర్మ అందజేశారు. ఎర్రవల్లిలో జరిగే మహారుద్ర, రాజశ్యామల హోమంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆర్చక సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ గంగు ఉపేంద్ర శర్మ మాట్లాడుతూ రాష్ట్రంలోని 5,626 దేవాలయాల్లో పనిచేస్తున్న అర్చకులకు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా వేతనాలు అందించిన ఘనత సిఎం కెసిఆర్‌కే దక్కిందన్నారు. హిందు ధర్మాన్ని పాటించే కెసిఆర్ రాష్ట్రంలోని బ్రాహ్మణులకు పెద్దపీట వేశారన్నారు. రాష్ట్రం సుభీక్షంగా ఉండేందుకు కెసిఆర్ చండీయాగం, రాజశ్యామల యాగం, బగళాముఖి హోమం తదితర పూజలు రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ఉపకరిస్తాయన్నారు. సుమారు 3,300 మంది రుత్వికులతో అష్టకాల రామంమోహన్, సోమయాజి, భద్రకాళి శేషు, గంట సత్యనారాయణ శర్మ తదితరులు ఆధ్వర్యంలో యజ్ఞ కార్యక్రమాల వల్ల వైదిక ధర్మం నిలబడుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో దేశపతి శ్రీనివాస్, బోయినపల్లి వినోద్, ఈటెల రాజేందర్, మరుమాముల రాంచంద్ర మూర్తి తదితరులు పాల్గొన్నారు.

జగన్ కేసులో ఎన్ఐఎ చార్జిషీట్ దాఖలు

మనతెలంగాణ/హైదరాబాద్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హత్యాయత్నం కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఎ) బుధవారం చార్జిషీట్ దాఖలు చేసింది. ఎన్ఎఐ కోర్టు న్యాయమూర్తికి చార్జిషీట్ సమర్పించింది. నిందితుడు శ్రీనివాసరావు జైల్లో రాసుకున్న 22 పేజీటల పుస్తకాన్ని చార్జిషీట్‌లో జతపర్చింది. చార్జిషీట్ కాపీని ఎవరి అందకుండా చూడాలని గోప్యంగా ఉంచాలని కోర్టు సిబ్బందిని ఈ సందర్భంగా న్యాయమూర్తి ఆదేశించారు. ఈ కేసులో విచారణ ఎదుర్కొంటున్న జునుమిల్లి శ్రీనివాసరావును ఏ1 నిందితునిగా పేర్కొన్నట్లు సమాచారం. కుట్రకోణంపై విచారణ సాగిస్తామని కోర్టుకు ఎన్ఐఎ అధికారులు తెలిపారు. చార్జిషీట్‌లో ఏముందో ఈ నెల 25న తెలిసే అవకాశాలున్నాయి. ఈ కేసులో పలు పిటిషన్లు పెండింగ్‌లో ఉండగా అత్యవసరంగా చార్జిషీట్ దాఖలు చేయాల్సిన అవసరం ఏ మొచ్చిందని నిందితుని తరపు న్యాయవాది మట్టా జయకర్ ప్రశ్నించారు.

రైతులకు నాలుగు నెలల శిక్షణ

మన తెలంగాణ/హైదరాబాద్: భూమి, నీటి యాజమాన్యంతో సుస్థిర లాభసాటి వ్యవసాయంలో శిక్షణ కోసం వాలంతరీ ప్రత్యేక కోర్సును రూపొందించింది. ఇన్నాళ్లుగా అధికారులు, ఇంజనీర్లకే పరిమితమైన శిక్షణను తొలిసారిగా రైతులకు ఇస్తున్నారు. వాటర్ రిసోర్సెస్ కార్పోరేషన్ చైర్మన్ వి.ప్రకాష్ ప్రత్యేకంగా చొరవ తీసుకోవడంతో రైతులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కోర్సును జనవరి 25వ తేదీ నుంచి మొదలవుతుంది. గ్రామీణ యువతను వ్యవసాయం వైపు ఆకర్శించడమే ప్రధాన ఉద్దేశంతో ఈ నాలుగు నెలల కోర్సును రూపొందించారు. యువ రైతులకు, గ్రామీణ యువతకు వినూత్న వ్యవసాయ విధానాల పట్ల అవగాహన కల్పించి, వ్యవసాయానికి సాధికారత సాధించడం ద్వారా, పర్యావరణాన్ని పరిరక్షించుకుంటూనే లాభసాటి వృత్తిగా మలుచుకోవడానికి పనికొచ్చేలా కోర్సును రూపొందించారు. ఇందులో మృత్తిక, భూమి యాజమాన్యం, ఆహార పంటల యాజమాన్యం, పండ్ల తోటలు, కూరగాయల యాజమాన్య పద్ధతులు, వర్షపు నీటి సంరక్షణ, క్షేత్రస్థాయిలో నీటి యాజమాన్యం తదితర అంశాల్లో శిక్షణ ఇస్తారు.

ఎరువు...ధరల దరువు



- ఇష్టారీతిన పెంచుతున్న కంపెనీలు
- యాసంగి రైతులపై వందల కోట్ల రూపాయల అదనపు భారం
- 9 నెలల కాలంలో ఒక్క డిఎపినే క్వింటాకు రూ.700 పెరుగుదల
- మిగతా ఎరువులదీ అదే పరిస్థితి

మన తెలంగాణ/హైదరాబాద్ : రబీ సీజన్‌లో రైతులకు దెబ్బ మీద దెబ్బ తగులుతోంది. ఒకవైపు వర్షాభావ పరిస్థితులు, సాగుచేసిన పంటలనూ నీటికొరతతో వదిలేయడం లాంటి సమస్యలతో బాధ పడుతున్న రైతులకు రబీలో ఎరువుల ధరలు అశనిపాతంలా తయారయ్యాయి. నెలల వ్యవధిలో ఎరువుల ధరలు గణనీయంగా పెరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రబీ సీజన్‌లో 13.38 లక్షల హెక్టార్లలో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ ప్రణాళిక తయారు చేసింది. ఈ పంటలకు 6.50 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా, 1.20 లక్షల మెట్రిక్ టన్నుల డిఎపి, 5 లక్షల టన్నుల ఎన్‌పికె, 1.10 లక్షల ఎమ్ఒపి ఎరువులు తదితరాలు కలిపి 14.40 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను కేంద్రం రాష్ట్రానికి కేటాయించింది. ఇందులో ఇప్పటికే 6.86 లక్షల మెట్రిక్ టన్నులను రైతులు తీసుకున్నారు. అయితే ఖరీఫ్ సీజన్‌తో పోలిస్తే రబీకిఎరువుల ధరలు గణనీయంగా పెరిగాయి. ఇప్పుడు యాసంగి నాట్లు పడుతున్న సమయంలో ధర మరింతగా పెరగడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పెరిగిన ఎరువుల ధరలతో రాష్ట్ర రైతులపై దాదాపు వందల కోట్ల కోట్ల అదనపు భారం పడనున్నట్లు అంచనా. డిఎపి క్వింటాకు గత మార్చిలో రూ. రూ.2152 ధర ఉంటే అది ఖరీఫ్ ప్రారంభం జూలై నాటికి రూ. 2580కి పెరిగింది. ప్రస్తుత ధర క్వింటాకు రూ. 2850గా ఉంది. అంటే మూడు నెలల్లో రూ.428 పెరగగా, ఆ తరువాత ఐదు నెలల కాలంలో మరో రూ.270 పెరిగింది. ఒక్క ఏడాది కాలం ముగియక ముందే క్వింటా డిఎపి ధర ఏకంగా రూ. 700 వరకు పెరగడం గమనార్హం. అలాగే ఎన్‌పికె కాంప్లెక్స్ ధరలు కూడా పెరిగాయి. ప్రస్తుతం 50 కిలోల ఎన్‌పికె బస్తా రూ.1100 కాగా గతంలో ఇది రూ, 1000 వరకు లభించింది. ఇక యూరియా 45 కిలోలు రూ. 266.50 ఉంది. ఈ రేటు కూడా గత మార్చిలో రూ.242గా ఉంది. 10–26–26 గత మార్చిలో క్వింటాకు రూ. 2168 ఉంటే ఇప్పుడు రూ.2800కు పెరిగింది.

ఎరువుల ధరల పెరుగుదల ఇలా (క్వింటాకు రూపాయాల్లో)

ఎరువు పేరు	2018మార్చిలో	జూలై	ప్రస్తుతం(2019)
డిఎపి	2152	2580	2850
10–26–26	2168	2330	2800
12–32–16	2078	2350	2600-2720
10–20–0–3	1700	1920	2050

ముడి సరకు కొంత పెరిగినా..

యూరియా తప్ప మిగతా ఎరువులపై కేంద్రానికి నియంత్రణ లేకపోవడంతో దేశీ కంపెనీలు డిఎపి, కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెంచడం మొదలుపెట్టాయి. ఏటా ఒకటి, రెండు సార్లు ఎరువుల ధరలు పెరగడం మామూలే! ఈసారి మాత్రం ఎరువుల కంపెనీలు ఒక్క సీజన్‌లోనే మూడు సార్లు ధరలను పెంచడం ఆందోళన కలిగిస్తోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిసరుకు ధరలు తగ్గినప్పుడు కంపెనీలు కొంత ధర తగ్గిస్తుంటాయి. ముడిసరుకుల ధరలు కాస్త పెరగ్గానే ఒక్కో బస్తాకు వందల రూపాయలు పెంచడం శోచనీయం. కేంద్రం ఎరువుల కంపెనీలకు సబ్సిడీ కూడా గణనీయంగా ఇస్తోంది. ఒకవైపు సబ్సిడీని పొందుతూనే మరోవైపు రైతుల నుంచి ముక్కు పిండి మరీ అధిక ధరలు వసూలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా పెట్టుబడి ఖర్చుల నిమిత్తం ఎకరానికి రూ.4 వేల చొప్పున రైతులకు పంపిణీ చేస్తోంది. రైతుబంధు పథకాన్ని అమలుచేస్తున్నా ఎరువుల ధరలు, పెట్టుబడి ఖర్చులు పెరుగుతుండడంతో ప్రయోజనం లేకుండా పోతోందని రైతులు వాపోతున్నారు. రబీలో రాష్ట్రానికి సరఫరా అయ్యే ఎరువులపై మొత్తం మీద రూ.700 కోట్లకు పైగా అదనంగా దండుకునే పరిస్థితి నెలకొంది.



పుంజుకున్న వరినాట్లు

రాష్ట్రవ్యాప్తంగా 10.20 లక్షల ఎకరాల్లో నమోదు

మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలో వరినాట్లు పుంజుకుంటున్నాయి. వ్యవసాయ శాఖ విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం 59 శాతం వరినాట్లు పడ్డాయి. రబీ సీజన్లో పంటల సాధారణ సాగు విస్తీర్ణం 33.45 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటి వరకు కేవలం 20.26 లక్షల (61%) ఎకరాల్లో పంటలు సాగు చేశారు. అందులో ఆహార పంటల సాధారణ సాగు విస్తీర్ణం 26.12 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 16.08 లక్షల (62%) ఎకరాల్లోనే సాగయ్యాయి. ఆహారధాన్యాల్లో కీలకమైన వరి రబీ సాధారణ సాగు విస్తీర్ణం 17.62 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు కేవలం 10.20 లక్షల (59%) ఎకరాల్లో నాట్లు వేశారు. అలాగే మొక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం 4.15 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 2.47 లక్షల (60%) ఎకరాల్లో సాగైంది. ఇక నూనె గింజల సాగులో కీలకమైన వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణం 3.54 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 2.61 లక్షల (74%) ఎకరాల్లో సాగైంది. ప్రధానంగా వరి నాట్లు పుంజుకోని ప్రాంతాల్లో, సాగునీటి వనరులు లేనిచోట వరికి బదులు ప్రత్యామ్నాయ వర్షాధార పంటలు వేయాలని రైతులకు విన్నవించింది.

8 జిల్లాల్లో అంతంతే

రబీ సీజన్‌లో ఆదిలాబాద్ జిల్లాలో రైతులు రికార్డు స్థాయిలో పంటలు సాగు చేశారు. మెదక్‌లో 30% , సంగారెడి25%, సిద్దిపేట 23%, రంగారెడ్డి 30%, జనగాం 37%, జయశంకర్ 47%, వరంగల్ రూరల్ 47%, మహబూబ్‌నగర్ జిల్లాల్లో 53% శాతం తక్కువగా సాగు నమోదైంది. నిజామాబాద్, మేడ్చల్, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల, సూర్యాపేట, మహబూబాబాద్, కొత్తగూడెం, కరీంనగర్, పెద్దపల్లి, ఆసిఫాబాద్ జిల్లాల్లో 70 శాతం పైన రైతులు పంటలు సాగు చేశారు. ఇక 18 జిల్లాల్లో తీవ్ర వర్షాభావం నెలకొని ఉంది.

స్కాలర్‌షిప్‌ల మంజూరులో జాప్యం వద్దు

- వెంటవెంటనే నిధుల్ని విడుదల చేయండి
- మైనారిటీ, గిరిజన సంక్షేమ శాఖల అధికారులతో హోం మంత్రి సమీక్ష



మన తెలంగాణ/ హైదరాబాద్ : ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ తదితర స్కాలర్‌షిప్‌లలో జాప్యం వద్దని హోం మంత్రి మహమూద్ ఆలీ వ్యాఖ్యానించారు. మైనారిటీ, గిరిజన సంక్షేమ శాఖల ఉన్నతాధికారులతో సచివాలయంలోని తన ఛాంబర్‌లో బుధవారం సమీక్ష నిర్వహించిన హోంమంత్రి స్కాలర్‌షిప్‌లతో పాటు విదేశీ విద్య కోసం వచ్చిన దరఖాస్తులు, వాటి పరిష్కారం, అందుబాటులో ఉన్ననిధులు తదితర పలు అంశాలపై సమీక్ష జరిపారు. ప్రస్తుతం విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల మంజూరు ఏ స్థాయిలో ఉంది, బకాయిలేమైనా ఉన్నాయా, జాప్యం ఎక్కడ జరుగుతోంది, విదేశీ విద్య కోసం స్కాలర్‌షిప్‌ల కోసం ఎంత మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు, ఎంతమందికి మంజూరైంది, పెండింగ్‌లో ఉన్నవాటి ప్రస్తుత పరిస్థితి ఏంటి తదితర అంశాలపై మైనారిటీ, గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి మహేశ్‌దత్ ఎక్కా, మైనారిటీ సంక్షేమ శాఖ డైరెక్టర్ ఖాసిం, జాయింట్ డైరెక్టర్ బాలసుబ్రమణ్యం రెడ్డి తదితరులతో హోం మంత్రి చర్చించారు. ప్రీ మెట్రిక్, పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్‌లతో పాటు ట్యూషన్ ఫీజుల రీఇంబర్స్‌మెంట్ విడుదల అంశాలపై కూడా చర్చించారు. విద్యార్థుల నుంచి దరఖాస్తు వచ్చిన వెంటనే వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించాలని, సమయం వృథా కావద్దని అధికారులకు స్పష్టం చేశారు.

కాంగ్రెస్ పార్టీ తీవ్ర అన్యాయం చేసింది..

నేతాజీని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి : మాజీ సిఎం నాదెండ్ల



మన తెలంగాణ/ సిటీబ్యూరో: దేశం కోం వీరోచిత పోరాటంచేసిన నేతాజీ సుభాస్ చంద్రబోస్‌కి కాంగ్రెస్ పార్టీ తీవ్ర అన్యాయం చేసిందని ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర రావు అన్నారు. ఆంగ్లేయుల అరాచక పాలనను తుదముట్టించేందుకు నేతాజీ తన ఉద్యోగాన్ని వదిలేసి ఉద్యమబాట పట్టారని శ్లాఘించారు. బుధవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆల్ ఇండియా జైహింద్ పార్టీ అధ్వర్యంలో నేతాజీ 122వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. జై హింద్ పార్టీ అధ్యక్షుడు దశరథరామిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన నాదెండ్లతో పాటు ఉమ్మది ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి చంద్రకుమార్‌లు సుభాస్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంగ్లేయుల పాలన అంతానికి నేతాజీ కృషిని కొనియాడారు. జైహింద్ నినాదాన్ని దేశానికి అందించిన వ్యక్తి నేతాజీ అని అన్నారు. కార్యక్రమంలో పాలడుగు పోతు రాజు, ఆవుల నగేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ తురుపు ముక్క!


సంపాదకీయం

చిరకాలంగా గృహిణిగా, రాజకీయాలకు దూరంగా, తెర వెనుకనే ఉంటూ వచ్చిన ప్రియాంక గాంధీని లోక్‌సభ ఎన్నికలు చేరువైన తరుణంలో ముందుకు తేవడం వెనుక కాంగ్రెస్ పార్టీ ఉద్దేశం, వ్యూహం ఏమిటనే ప్రశ్నకు సమాధానం కష్టసాధ్యమైనదేమీ కాదు. ఆమెకు గల రాజకీయ అయస్కాంత శక్తి గొప్పది, బలమైనది అనే అభిప్రాయం చాలా కాలంగా ఉన్నది. నిజానికి రాహుల్ గాంధీ కంటే ఆమే ప్రభావవంతమైన నాయకురాలని భావించేవారు అనేక మంది ఉన్నారు. అటువంటి తురుపు ముక్కను ఇంతకాలంగా ఎందుకు దాచి ఉంచారు? ప్రియాంకను రాజకీయాల్లోకి రప్పించడం తల్లి సోనియా గాంధీకి బొత్తిగా ఇష్టంలేదనే వారున్నారు. ప్రియాంక రాకవల్ల రాహుల్ భవిష్యత్తు దెబ్బతినకూడదనే దృష్టితోనే సోనియా ఆమెను రాజకీయాలకు దూరంగా ఉంచారనేది దాదాపు అందరూ అంగీకరించే విషయం. అదే నిజమైతే ఇప్పుడు అందుకు విరుద్ధంగా ఆమెను రాజకీయాల్లోకి ఎందుకు తీసుకు వచ్చారు? ఆమెకు తూర్పు యుపిలో కాంగ్రెస్‌ను గెలిపించే బాధ్యత ఇస్తూ ఆ ప్రాంతపు ఎఐసిసి ప్రధాన కార్యదర్శిగా చేశారు. అలాగే మిగతా యుపిలో పార్టీ గెలుపు బాధ్యతను మరో యువనేత జ్యోతిరాదిత్య సింధియాకు అప్పగించారు.

ప్రియాంకకు యుపిలో పార్టీ బాధ్యతలు అప్పగించడం అనే దానికంటే ఆ నిర్ణయం తీసుకున్న సమయమే ప్రధానమైనది. రాహుల్ గాంధీ సారథ్య పటిమపై నమ్మకంలేకనే ప్రియాంకను తెచ్చారని భారతీయ జనతా పార్టీ అప్పుడే విమర్శనాస్త్రం సంధించింది. కాంగ్రెస్ ముక్త భారత్‌ను సాధిస్తానని ప్రధాని మోడీ చేసిన శపథం రానురానూ శక్తిహీనమవుతున్నది. అందుకు భిన్నంగా ఇప్పుడు బిజెపియే తన కాంతిని కోల్పోతూ ఆమేరకు కాంగ్రెస్ పుంజుకుంటున్న సూచనలున్నాయి. ఇటీవలి చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ ఎన్నికలలో బిజెపి ప్రభుత్వాలు కుప్పకూలి అక్కడ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఈ పరిణామం రాహుల్ గాంధీ పరిణతిని, ప్రతిభను చాటినట్టు అనిపించింది. ఆయన మాట తీరులో వచ్చిన మెరుగైన మార్పు, రాఫెల్ యుద్ధ విమానాల కుంభకోణంపై ప్రజలను ఆకట్టుకుంటున్న రీతిలో సాగించిన ఆయన విమర్శలు ఆయనపై అంచనాలను పెంచాయి. ఈ నేపథ్యంలో ఉన్నట్టుండి ప్రియాంక గాంధీని ఎందుకు ప్రవేశపెట్టవలసి వచ్చింది, ఈ పని 2014 ఎన్నికల్లోనే చేసి ఉండవలసింది కదా అనే అభిప్రాయం కలగడం సహజం. హిందీలో ధారాళంగా మాట్లాడగల ప్రియాంకకు మరో ప్లస్ పాయింట్ ఇందిరా గాంధీ పోలికలుండడం. ఈ విలువైన అస్త్రాన్ని ఇంతకాలం అమ్ములపొదిలోనే ఉంచి ఇప్పుడు సంధించాలనుకోవడమే సోనియా గాంధీ రాజకీయ వ్యూహ పటిమను చాటుతున్నదని భావించక తప్పదు.

ఉత్తరప్రదేశ్ ఒకప్పుడు కాంగ్రెస్ కంచుకోటగా ఉండేది. జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ అక్కడ నుంచే లోక్‌సభకు ఎన్నికై ప్రధానులయ్యారు. అటువంటి ఉత్తర ప్రదేశ్‌లో మండల్ – కమండల్ రాజకీయాలు తల ఎత్తి అక్కడ రాజకీయ ఆవరణాన్ని ఎస్‌సి, బిసిలు కైవసం చేసుకున్న తర్వాత, అయోధ్య ఆయుధంగా భారతీయ జనతా పార్టీ అసాధారణ శక్తిగా ఎదిగిన మీదట ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ పని పూర్తిగా ఖాళీ అయిపోయింది. దీనికి తోడు ఇటీవల కుదిరిన ఎస్‌పి, బిఎస్‌పిల పొత్తు నుంచి కాంగ్రెస్‌ను వెలివేసి కేవలం అమేథీ, రాయ్‌బరేలీ లోక్‌సభ స్థానాలు రెండింటిని మాత్రం దానికి వదిలిపెట్టదలిచినట్టు ఆ రెండు పార్టీలు ప్రకటించడం ప్రియాంక గాంధీ రంగ ప్రవేశాన్ని తొందరపరిచిందనుకోవాలి. అలాగే, ప్రధాని మోడీ ప్రభుత్వం అగ్ర వర్ణాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించడం ద్వారా ప్రయోగించిన అస్త్రం వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో గెలుపు మీద కాంగ్రెస్‌లో ఆశలను దెబ్బతీసి ఉండాలి. 80 లోక్‌సభ స్థానాలున్న యుపిని కైవసం చేసుకోలేకపోతే కేంద్రంలో అధికారాన్ని గురించి కలగనడం వ్యర్థమనే అభిప్రాయానికి వచ్చి ప్రియాంక గాంధీ అనే చివరి సునిశితాస్త్రాన్ని కాంగ్రెస్ బయటకు తీసిందని బోధపడుతున్నది. దీనితో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా ప్రియాంక గాంధీ సారథ్యంలోకి వెళ్లిపోతుందని అనుకోడానికి వీల్లేదు. వచ్చే ఎన్నికల్లో పార్టీకి విజయాలను చేకూర్చడానికి, తద్వారా రాహుల్ గాంధీని ప్రధానిని చేసుకోగలగడానికి ప్రియాంక అవసరం ఎంతైనా ఉందని భావించి కాంగ్రెస్ నాయకత్వం ఆమెకు యుపిలో పార్టీ బాధ్యతలు అప్పగించినట్టు స్పష్టపడుతున్నది. ఆమె రాక ఉత్తరప్రదేశ్‌లోనే గాక దేశం మొత్తం మీద రాజకీయాలను ప్రభావితం చేసే అవకాశాలు లేకపోలేదు. అయితే ఆలస్యంగా తనకు అప్పగించిన ఈ బాధ్యతను ఆమె ఏమేరకు నెరవేర్చుగలుగుతారనేది వేచి చూడవలసిన అంశం.

తరుగుతున్న భూగర్భ జలాలు



చలికాలం అయిపోవచ్చింది. ఫిబ్రవరి తర్వాతి నుంచి వేసవి మొదలవుతుంది. దేశవ్యాప్తంగా హ్యాండ్ పంపులతో నీరుతోడడం ప్రారంభమవుతుంది. కాని వాటి నుంచి నీరు రావడం అనేది గగనమైపోతుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో నీటి ఎద్దడి ప్రారంభమవుతుంది. చిన్న చిన్నపట్టణాల్లో ఉన్నవారికి కూడా నీరు దొరకడం గగనమవుతుంది. ప్రభుత్వం ఎప్పటిలా మరోసారి టాంకర్ల సరఫరా మొదలెడుతుంది. ఇది చాలా కాలంగా కొనసాగుతూ వస్తున్న వ్యవహారం. శాశ్వత పరిష్కారానికి ప్రయత్నించింది లేదు. దేశంలోని అనేక నగరాల్లో 2020 నాటికి భూగర్భ జలాలు అడుగంటిపోతాయని నీతిఆయోగ్ తెలియజేసింది. నగరాలతో పాటు ఊళ్ళల్లో నీటి కోసం సుదూర ప్రాంతాలకు వెళ్ళక తప్పదు. కేంద్ర భూగర్భ జలాల బోర్డు గణాంకాల ప్రకారం భూగర్భ జలాల మట్టం పడిపోతోంది. 2014 నుంచి 2017 మధ్య కాలంలో కరువు పరిస్థితులు వచ్చాయి. 2018లో వర్షపాతం సగటు కన్నా 9.4 శాతం తక్కువ కురిసింది. అందువల్ల భూగర్భ జలాలా మరింత తగ్గిపోయాయి. 2007 నుంచి 2017 మధ్య కాలంలో, అంటే ఈ దశాబ్ద కాలంలో బావుల్లో కేవలం 34 శాతం బావుల్లో మాత్రమే నీటి మట్టం రెండు మీటర్ల కన్నా ఎక్కువ పెరిగింది. 43 శాతం బావుల్లో నీటిమట్టం రెండు మీటర్ల కన్నా ఎక్కువ పడిపోయింది. రెండు నుంచి నాలుగు మీటర్ల వరకు నీటి మట్టం పెరిగిన బావులు కేవలం 6 శాతం మాత్రమే ఉన్నాయి. దాదాపు పన్నెండు శాతం బావుల్లో నీటిమట్టం ఈ మేరకు తగ్గిపోయినట్లు తెలుస్తోంది. 7 శాతం బావుల్లో నీటి మట్టం 7 మీటర్ల కన్నా ఎక్కువ పడిపోయింది.

ఈ గణాంకాల వల్ల తెలుస్తున్నదేమంటే, చాలా బావుల్లో నీటి మట్టం తగ్గిపోతోంది. 2007 నుంచి 2017 మధ్య కాలంలో 61 శాతం బావుల్లో 2 నుంచి 4 మీటర్ల వరకు నీటి మట్టం పడిపోయింది. అంటే అర్థం ఈ బావులను మరింత లోతుగా తవ్వవలసి వస్తుంది. నేల స్వభావం, బావులున్న ప్రాంతం వగైరాలపై ఆధారపడి ఖర్చు కూడా ఉంటుంది.

చూపు

కనీసం యాభై వేల రూపాయల వరకు బావి లోతు పెంచడానికి ఖర్చు కావచ్చు. 2011 నుంచి 2017 మధ్య కాలంలోని ఆరు సంవత్సరాలలో తక్కువ లోతున్న బావులు అంటే రెండుమీటర్ల లోతు బావుల శాతం తగ్గిపోయింది. అంతకు ముందు 6 శాతం ఉండేది. 4 శాతానికి తగ్గిపోయింది. 5 మీటర్ల కన్నా ఎక్కువ లోతున్న బావులు 66 శాతం నుంచి 77 శాతానికి పెరిగాయి. భూగర్భ జలాలపై ఆధారపడిన రైతులకు దీనివల్ల సమస్యలు ఎదురవుతాయి. అంతేకాదు గ్రామీణ ప్రాంతాల్లో నీటి సరఫరా, పరిశ్రమలకు నీటి సరఫరాపై దీని ప్రభావం ఉంటుంది.

పంజాబ్, రాజస్థాన్, హర్యానా, ఢిల్లీలలో భూగర్భ జలాలు చాలా తగ్గిపోయాయి. సహజంగా భూమిలోకి ఇంకే నీటి కన్నా ఎక్కువ నీటిని ఈ రాష్ట్రాల్లో తోడేస్తుండడం వల్లనే ఈ పరిస్థితి తలెత్తింది. భూగర్భ జలాలను ఎలా తోడుతున్నారన్నది నాసా అధ్యయనం చేసింది. 2003 నుంచి 2014 మధ్య కాలంలో భూగర్భ జలాలను తోడే క్రమాన్ని అధ్యయనం చేసింది. దీనికి గ్రేస్ శాటిలైట్లు అంటే గ్రావిటీ రికవరి అండ్ క్లయిమేట్ ఎక్స్ పెరిమెంట్ ఉపగ్రహాలను ఉపయోగించారు. ఈ అధ్యయనం ప్రకారం పైన చెప్పిన రాష్ట్రాలతో పాటు ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో ఏటా ఆరు సెంటీమీటర్ల వరకు భూగర్భ జలాల తరుగుదల ఉన్నట్లు తెలిసింది.

నదులు, వర్షపాతం వల్ల భూగర్భ జలాలను తోడినా తిరిగి నీరు నేలలోకి సహజంగా వెళుతుంది. కాని ఇలా సహజంగా నేలలోకి నీరు ఇంకడం నెమ్మదిగా జరుగుతుంది. వర్షపాతంలో 5 శాతం నీరు నేలలోకి ఇంకుతుంది. ఉత్తరాఖండ్, హిమాచల్ తప్ప మిగిలిన రాష్ట్రాల్లో ఏటా 500 నుంచి 1000 మి.మీ. వర్షపాతం మాత్రమే కురుస్తుంది. ఇందులో 25 నుంచి 50 మి.మీ వర్షం మాత్రమే నేలలోకి ఇంకుతుంది. నదుల్లో పుష్కలంగా నీరుంటే ఆ నీరు నేలలోకి కూడా ఇంకుతుంది. కాని రుతుపవనాల తర్వాత చాలా నదుల్లో నీరు ఎండిపోతుంది. నీటివనరుల్లో 80 శాతం వ్యవసాయానికే ఉపయోగపడతాయి. భూగర్భ జలాలను కూడా ఎక్కువగా వ్యవసాయానికే ఉపయోగిస్తున్నారు. వ్యవసాయానికి ఉపయోగించే నీటిలో 70 శాతం భూగర్భజల వనరుల నుంచే లభిస్తుంది. మిగిలిన 30 శాతం మాత్రమే కాలువలు, వర్షపాతంపై ఆధారపడి జరుగుతుంది. అలాగే మంచి నీటి కోసం ఇతర మానవ అవసరాల కోసం ఉపయోగించే నీటిలో కూడా 80 శాతం భూగర్భజలాలే ఉన్నాయి. గత దశాబ్ద కాలంగా ఢిల్లీ నగరం చాలా విస్తరించింది. ప్రజలు నగరాలకు తరలి వస్తున్నారు. 2000 నుంచి 2016 మధ్య కాలంలో ఢిల్లీ జనాభా ఏటా 3.2 శాతం చొప్పున పెరుగుతోంది. మొత్తం జనాభా రెండు కోట్ల 40 లక్షలకు చేరుకుంది. ముంబయి జనాభా 2 కోట్ల 10 లక్షలు. కోల్‌కతా జనాభా కోటి యాభై లక్షలు. ఈ నగరాల్లో జనాభా ఏటా 1.9 శాతం చొప్పున పెరుగుతోంది. బెంగుళూరు, హైదరాబాద్ నగరాల్లో కూడా జనాభా తీవ్రమైన వేగంతో పెరుగుతోంది. బెంగుళూరు జనాభా 2.5 శాతం చొప్పున, హైదరాబాద్ జనాభా 2.3 శాతం చొప్పున పెరుగుతోంది.

ప్రభుత్వ లెక్కల ప్రకారం తలసరి రోజుకు 135 లీటర్ల నీరు అవసరం. ఢిల్లీలో రోజుకు 3240 మిలియన్ లీటర్లు కావాలి. ముంబయిలో 2835 మిలియన్ లీటర్లు కావాలి. కోల్‌కతాలో 2025 మిలియన్ లీటర్లు, బెంగుళూరులో 1417 మిలియన్ లీటర్లు, హైదరాబాదులో మిలియన్ 1242 లీటర్లు అవసరమవుతాయి. ఇప్పుడు సరఫరా చాలా బాగుంది. ఢిల్లీ జల్ బోర్డు రోజుకు 5000 మిలియన్ లీటర్లు సరఫరా చేస్తోంది. ఇందులో సగం భూగర్భ జలాలే. భూగర్భ జలాలను ఒకవైపు తోడేస్తుంటే, మరోవైపు భూమిలోకి నీరు ఇంకడం ద్వారా భూగర్భ జలాలు రీచార్జ్ అయ్యే నేల తగ్గిపోతోంది. పట్టణ ప్రాంతాల్లో కాంక్రీటు అడవులు పెరిగిపోతున్నాయి. అందువల్ల నీరు ఇంకే చిత్తడి నేలలు, మైదాన ప్రాంతాలు లేకుండా పోయాయి. ఇంకుడు గుంతల ద్వారా వర్షపు నీటిని పొదుపు చేయడం, నీరు ఇంకేలా చేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేయడం వగైరా నియమాలు భవన నిర్మాణంలో భాగంగా చేసినా అవి అమలుకు నోచుకోవడం లేదు. అందువల్ల భూగర్భ జలామట్టం పెరిగే అవకాశాలు తగ్గిపోయాయి. చాలా మంది రైతులకు సాగునీరంటే బోరునీరే.వర్షాధారంగా లేదా కాలువల క్రింద వ్యవసాయం చాలా తగ్గిపోయింది. పరిశ్రమలు కూడా భారీగా నీటిని ఉపయోగించుకుంటున్నాయి. సాగునీటి కోసం కట్టిన బిలాస్ పూర్ డ్యాం ఇప్పుడు జైపూర్‌కు నీరు సరఫరా చేస్తోంది. సాగునీటి కోసం కట్టిన హిరాకుడ్ డ్యాం నీటిని కూడా పరిశ్రమలకు మళ్ళిస్తున్నారు. అందువల్ల వ్యవసాయరంగం భూగర్భ జలాలపైనే ఆధారపడుతోంది. దేశంలో మూడు కోట్ల కన్నా ఎక్కువగా బావులున్నాయని అంచనా. ఇందులో చాలా భాగం వ్యవసాయానికి ఉద్దేశించినవే. ఇప్పుడు భూగర్భ జలాలకు కరువు వచ్చే పరిస్థితి ఏర్పడింది.

ఈ నేపథ్యంలో భూగర్భ జలాల సంక్షోభం తలెత్తక ముందే మేల్కోవలసి ఉంది. ఆదర్శ భూగర్భ జలాల బిల్లు చాలా కాలంగా పెండింగులో ఉంది. ఆ బిల్లుపై వెంటనే చర్చలు జరగాలి. నిపుణులు పరిశీలించాలి. అవసరమైన సలహా సూచనలతో భూగర్భ జలాల పరిరక్షణకు వెంటనే ఈ బిల్లును చట్టంగా చేసి తగిన చర్యలు చేపట్టవలసి ఉంది.

✻ నిత్య జాకబ్ (ది వైర్)

స్వాతంత్ర్యోద్యమంలో ముస్లింల త్యాగాలు



డా. దేవరాజు మహారాజు
9573706806

'భారత స్వాతంత్ర్య పోరాట గాథ ముస్లింల రక్తంతో రాయబడింద' ని ప్రఖ్యాత జర్నలిస్టు, రచయిత కుష్వంత్ సింగ్ ఒక చోట రాశారు. దేశంలో వారి జనాభా అతి తక్కువ శాతమే అయినా వారి కృషి, ఔదార్యం, త్యాగనిరతి ప్రధానంగా చెప్పుకోవాల్సి ఉందని ఆయన భావన. దానికి బలమైన సాక్ష్యం కూడా చూపించారు. ఢిల్లీలోని ఇండియా గేట్‌పై రాయబడ్డ అమరులైన 95,000 మంది స్వాతంత్ర్య సమరవీరుల పేర్లలో ముస్లింల పేర్లు 61,945 – అంటే స్వాతంత్ర్య సమర వీరుల్లో అరవై అయిదు శాతం మంది ముస్లింలని కదా అర్థం? నిజాల్ని దాచేసి, చరిత్రను వక్రీకరించి రాసిన వారి కుట్ర బట్టబయలు చేయాలంటే మనం తప్పక కొన్ని వాస్తవాలు తెలుసుకోవాలి. అంతేకాదు, భావి తరాలకు నిజాలు తెలియజేయాల్సిన బాధ్యతను కూడా చేపట్టాలి.

స్వాతంత్ర్య సంగ్రామంలో ఎంతో మంది సమిధలయ్యారు. మరెంతో మంది త్యాగాలు చేశారు. అవన్నీ ఇప్పటి తరాల వారికి తెలియదు. వారికి వారి ప్రమేయం లేకుండానే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు అందుబాటులోకి వచ్చాయి. అందువల్ల వారికి ''స్వాతంత్ర్యానికి'' ఉన్న విలువ తెలియడం లేదు. తొలిసారిగా స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా 1780లో పోరాడింది మైసూరు రాజు హైదర్ ఆలీ. ఒక దశాబ్దం తర్వాత 1790లో పోట్లాడింది ఆయన కొడుకు టిప్పుసుల్తాన్. తొలిసారి ఇనుప రాకెట్లు, కానన్లు బ్రిటీష్ చొరబాటుదారుల మీద ప్రయోగించింది వీరిద్దరే.

బ్రిటీష్ వారితో ఝాన్సీరాణి చేసిన యుద్ధం చరిత్రలో ప్రాచుర్యం సంతరించుకుంది. అది అందరికీ బాగా తెలిసిన విషయం. ఆమె తన పెంపుడు కొడుకు కోసం రాజ్యాన్ని కాపాడాలనుకున్నారు. కానీ, చాలా మందికి తెలియని విషయం, చరిత్రలో మరుగున పడిన విషయం ఒకటుంది. బేగం హజ్రత్ మహల్ గురించి ఎంత మందికి తెలుసూ? తొలి దశలో జరిగిన స్వాతంత్ర్య సమరంలో ఆమె వీరోచితంగా పోరాడి బ్రిటీష్ పాలకుడైన సర్ హెన్రీ లారెన్స్‌ను చంపేశారు. 1857 జూన్ 30న చిన్‌హట్‌లో వ్యూహాత్మకంగా బ్రిటీష్ పాలకుల్ని ఆమె ఓడించారు. ఈ విషయం చరిత్ర పుటల్లో అసలే చోటు చేసుకోలేదని కాదు. కాని, ఎందుకోగాని ప్రాముఖ్యతను సంతరించుకోలేదు. కారణాలు అందరికీ తెలిసినవే.

చివరి మొగల్ చక్రవర్తి బహద్దూర్ షా జఫర్ కూడా 1957లో స్వాతంత్ర్యం కోసం పోరాడిన వాడే. ఆయన పోరాటాన్ని ఎవరూ పెద్దగా శ్లాఘించలేకపోయినా భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ఆయన సమాధి దగ్గర నివాళులర్పిస్తూ తన సంతాపాన్ని ఇలా తెలియజేశారు. ''భారతదేశంలో మీ కింత చోటు దక్కకపోయినా, అక్కడ మీ పేరు సజీవంగా ఉంది. తొలి దశలో స్వాతంత్ర్యం కోసం పోరు సల్పిన ఆ మహోన్నత స్మృతికి నా హృదయ పూర్వక శ్రద్ధాంజలి'' అని. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో మరణించిన వారు తొంభై శాతం మంది ముస్లింలే. అందులో ఆనాటి గొప్ప నాయకుడు, కార్యకర్త మౌలవీ అహ్మదుల్లా షా





చంపబడ్డాడు. బ్రిటీష్ ప్రభుత్వాన్ని పడగొట్టడానికి కుట్ర చేశాడన్న నేరంపై తొలిసారి ఉరి తీయబడింది ఇరవై ఏడేళ్ల యువకుడు అశ్వాఖుల్లా ఖాన్! ఎందుకో మరి ఇలాంటి విషయాలు బయటికి రాకుండా, చర్చించకుండా, ప్రాముఖ్యాన్ని సంతరించుకోకుండా అణచి పెట్టారూ? ఆలోచించాల్సిన విషయం కాదా?

యం.కె.యం. అమీర్ హంజా ఇండియన్ నేషనల్ ఆర్మీ (INA) కి కొన్ని మిలియన్ల డబ్బు విరాళమిచ్చారు. ఐఎన్ఎకి సంబంధించిన వివరాలు గ్రంథాలయాల్లో చదివి, స్ఫూర్తిని పొంది దాదాపు తన సర్వస్వం త్యాగం చేశారు. ఆయన తర్వాత, ఆయన కుటుంబం వీధిన పడింది. నిరుపేద కుటుంబంగా తమిళనాడులోని రామనాథపురంలో అద్దె ఇంట్లో పూట గడవడమే కష్టమైన దశలో బతికింది. ఆ కుటుంబాన్ని ఎవరూ ఆదుకోలేదు. మీమొన్ అబ్దుల్ హబీబ్ యూసుఫ్ మర్ఫానీ – దాదాపు ఆరోజుల్లోనే తన యావదాస్తీ దాదాపు ఒక కోటి ఇండియన్ నేషనల్ ఆర్మీకి ధారాదత్తం చేశారు. ఆ ఆర్మీలో అతి ముఖ్యమైన పాత్ర పోషించిన షా నవాజ్ ఖాన్ నేతాజీ సైన్యంలో కమాండర్‌గా ఉండేవారు. ఒక సైనికుడిగా, ఒక రాజకీయ నాయకుడిగా ఆయన చాలా కీలకమైన పాత్ర పోషించారు.

నేతాజీ సైన్యంలో ఉన్న ముఖ్యమైన పందొమ్మిది మంది అధికారుల్లో ఏడుగురు ముస్లింలేనన్నది గమనించాలి. అలాగే బీవమ్మ అనే ఒక ముస్లిం మాతృమూర్తి తన దగ్గరున్న ముప్పయి లక్షల్ని స్వాతంత్ర్యోద్యమానికి ఖర్చు పెట్టారు. మన జాతీయ జెండా రూపొందుతున్న దశలో సురయ్యా తియాబ్జి అనే ముస్లిం మహిళ అందుకు కొంత కృషి చేశారని చెపుతారు.

తమిళనాడుకు చెందిన ఇస్మాయిల్ సాహిబ్ మరుద నయగం వరుసగా ఏడేళ్లు బ్రిటీష్ వారితో పోరాడి బ్రిటీష్ ప్రభుత్వానికి చెమటలు పట్టించారు. స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా వెస్ట్ ఇండియన్ కంపెనీపై దాడి చేసినవాడు కప్పలోటియా తమిల్జన్ వి.ఒ.సి అనే నావికుడు. అయితే అతను నడిపిన నౌకను దేశానికి విరాళమిచ్చిన మహనీయుడు ఫకీర్ మహ్మద్ రాథర్. ఒక మహోన్నతమైన ఆశయ సాధన కోసం ఒక 'నౌక'ను విరాళమివ్వడం అంటే మాటలా? ఎంతటి నిబద్ధత కావాలి? విఒసి తమిల్జన్‌ను అరెస్టు చేసినప్పుడు ఆయనను విడుదల చేయాలని ప్రదర్శన చేపట్టిన మహ్మద్ యాసీన్‌ను బ్రిటీష్ పోలీసులు కాల్చి చంపారు. తిరుప్పూర్ కుమారన్ (కోడి కాట కుమారన్) స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. అతనితో పాటు మరో ఏడుగురు అరెస్టయ్యారు. వారు అబ్దుల్ లతీఫ్; అక్బర్ అలీ; మొహిదీన్ ఖాన్; అబ్దుల్ రహీమ్; వావూ సాహెబ్; అబ్దుల్ లతీఫ్; షేక్ బాబా సాహెబ్ మొదలైన వారు.

మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ విద్యావేత్త. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు. గాంధీ జీ పిలుపు విని స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న దేశ భక్తుడు. మద్యం షాపులకు వ్యతిరేకంగా గాంధీజీ సాగించిన పికెటింగ్‌లో పాల్గొని అరెస్టయిన వారు. ఆనాడు అరెస్టయిన పందొమ్మిది మందిలో పది మంది ముస్లింలే. అబ్దుల్ కలాం ఆజాద్, జిన్నా, బీహార్ నవాబు – ఈ ముగ్గురూ కలిసి స్వాతంత్ర్యోద్యమానికి ముఖ్యమైన పథకాలు, ప్రణాళికలు రూపొందించిన వారు.

ముస్లింలు ఈ దేశాన్ని సుమారు ఎనిమిది వందల ఏళ్లు పరిపాలించారు. అయినా వారు బ్రిటీష్, డచ్, ఫ్రెంచ్ వారిలాగా ఈ దేశాన్ని కొల్లగొట్టుకుని పోలేదు. వారిలాగా ఈ దేశం పరాయిదని అనుకోలేదు. ఈ దేశం తమదని భావించారు. అందులో భాగమైపోయారు. సంస్కృతిలో అంతర్భాగమైపోయారు. ఇది వారు పుట్టి పెరిగిన గడ్డ అని అనుకున్నారు గనక, అభివృద్ధి కూడా చేశారు. సాహిత్య కళా రంగాల్ని ప్రోత్సహించారు. ఆ కాలంలోనే ఆర్కిటెక్చర్ (నిర్మాణ కళ) మహోన్నత స్థాయికి చేరుకుందని చెప్పడానికి అనేకానేక కట్టడాలున్నాయి. న్యాయ, రాజకీయ వ్యవస్థల్ని సమర్థవంతంగా నిర్వహించారు. వీటన్నిటి కన్నా ముఖ్యంగా చెప్పుకోవాల్సిందేమంటే.. ఈ దేశంలో సిక్కులు, ముస్లింలు, క్రిస్టియన్లు ఈ దేశ మూల వాసులైన ఒకప్పటి హిందువులే! కాలక్రమంలో వచ్చిన మార్పుల వల్ల చేకూరిన లాభాలూ వసతుల వల్ల కొందరు ఇతర మతాల్లోకి మారారు. హిందూ మతంలో ఎదురైన నిరాదరణను తప్పించుకోవడానికి కూడా వారు ఇతర మతాల్లో చేరారన్నది వాస్తవం! అందువల్ల వీరికి ఈ దేశం మీద ప్రేమ ఉండకుండా ఎలా ఉంటుందీ? మత సామరస్యానికి, స్నేహ బాంధవ్యానికి ఈ దేశంలో గొప్ప ఉదాహరణలున్నాయి.

స్వాతంత్ర్య సాధనలో భారతదేశంలోని ముస్లింల నిబద్ధతను ఎవరూ శంకించాల్సిన అవసరం లేదు. రికార్డయి ఉన్న వాస్తవాలలో ఇవి కొన్ని మాత్రమే! హిందూమతతత్త్వవాదులు రాసుకున్న చరిత్ర గ్రంథాలలో ఇలాంటి నిజాలు సరిగా నమోదు కాలేదేమో గాని, నిజాలు నిజాలు కదా? విదేశీ చరిత్రకారులు రాసిన రచనల్లో ఇవన్నీ ఉన్నాయి. కొన్ని విషయాలు దాచిపెట్టాలన్న దురుద్దేశం వారికి ఉండదు. అయినా నిజాలు దాచేస్తే దాగవు కదా? కొంత కాలం దాగినా, ఎల్లకాలం దాగలేవు కదా? మనుషుల్ని విడగొట్టి ఓట్లు రాబట్టుకునే నికృష్టపు రాజకీయంలో కొంతమంది వాస్తవాల్ని వక్రీకరిస్తూ ఉంటారు. ప్రజాస్వామ్యం పేరుతో మనుషుల మధ్య విద్వేషాలు సృష్టించి, వాటిని సజీవంగా ఉంచే దుర్మార్గమైన ధోరణి నశిస్తేగాని ఈ దేశం బాగుపడదు.

వివక్షలు లేకుండా అందరూ సమానంగా, గౌరవంగా బతికే సమాజాన్ని రూపుదిద్దాల్సిన ప్రభుత్వాలు అతిఘోరంగా విఫలమవుతూ వచ్చాయి. అందువల్ల దేశ ప్రజలే ఆలోచించుకోవాలి. మనుషులం గనక మనుషుల్లాగా బతుకదాం అని నిర్ణయించుకోవాలి. కుట్రలు చేసేది ఎవరైనా సరే ఎండగట్టడమే పనిగా పెట్టుకోవాలి. భారతదేశం ఇతర దేశాల వంటిది కాదు. వివిధ మతాల, భాషా సంస్కృతుల సమ్మేళనం. అందరి కృషిని అందరూ గుర్తించాలి. గౌరవించాలి. చారిత్రక, ఆర్థిక, సామాజిక కారణాలు ఏవైనా కావొచ్చు. అందరం మనుషులమేనన్నది మరువకూడదు. న్యాయమూ, అన్యాయమూ మాత్రమే ఉంటాయి. వాటి గూర్చి నిర్భయంగా, నిస్సంకోచంగా మాట్లాడగలగాలి.

ఈ పేజీకి రచనలు పంపవలసిన మెయిల్ :
editor@manatelangana.org

బాలికల పురోగతిపట్ల చిత్తశుద్ధి ఏది?

ఎడిటర్‌కు లేఖ

'మహిళల పురోగమనాన్ని చూసే నేను దేశ పురోగమనాన్ని అంచనా వేస్తాను' అని డా.బి.ఆర్.అంబేద్కర్ అన్నా రు. మహిళల పురోభివృద్ధి బాలికలకు సరైన విద్య అందించడం ద్వారా సాధ్యమవుతుంది. బాలికల విద్యా ప్రమాణాలు ఎక్కడైతే పెరుగుతాయో ఆయా సమాజాలలో మహిళల హోదా, గౌరవం మెరుగుపడుతుంది. గర్భంలో ఉండగానే మన దేశంలో బాలికలకు కష్టాలు ప్రారంభమౌతున్నాయి. భ్రూణ హత్యలతో గర్భస్థ దశలోనే బాలికలను చిదిమేస్తున్నారు. చదువు కోవాలన్నా, ఉద్యోగాలు చేయాలన్నా అడుగడుగునా అనేక అడ్డంకులు ఎదురవుతున్నాయి, వరకట్నం పేరుతో గృహ హింసలకు లోను చేసి పెళ్లి అనంతరం కూడా హత్యకు గురిచేస్తున్నారు.

భారతీయ సమాజం మూలమూలాల్లో స్థిరపడిన పురుషస్వామ్య సంస్కృతి ఆడపిల్లల అణచివేతకు కారణం అవుతోంది. సామాజిక ఆర్థిక వెనుకబాటుతనం, తల్లిదండ్రుల వలసలు, ఇంటిపని కారణంగా ఇప్పటికీ మన దేశంలో పేద కుటుంబాలు బాలికలు బడి మానేస్తున్నారు. కొడుకుల చదువులపై ఉన్నంత శ్రద్ధ తల్లిదండ్రులు తమ కూతుళ్ల చదువులపై చూపించడం లేదు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో ఆడపిల్ల చదువులు అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఆడపిల్లలు పాఠశాలల్లో నమోదు కావడం మగ పిల్లలతో సమానంగా ఉన్నప్పటికీ ఉన్నత విద్యకు చేరేనాటికి 10 నుంచి 30 శాతం మాత్రమే మిగులుతున్నారు. దీనికి కారణం ఆడపిల్లలను కుటుంబ అవసరాల కోసం, ఆర్థిక అవసరాల కోసం చదువులకు దూరం చేయడమే.ఆడపిల్లలకు రక్షణ కల్పించాలి. ఆత్మవిశ్వాసంతో పెరిగేలా చూడాలి.

లింగ వివక్షత లేని సమాజం తీసుకురావాలి. అనే లక్ష్యాలతో 2008 లో భారత ప్రభుత్వం స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ గరల్స్ డెవలప్మెంట్ మిషన్ పేరుతో జాతీయ బాలికా దినోత్సవాన్ని ప్రారంభించింది. ఈ సందర్భంగా బాలికల విద్య, ఆరోగ్యం, పోషకాహారం, బాల్యవివాహాల నియంత్రణ, అక్రమ రవాణా, మొదలైన అంశాలపై అవగాహన కల్పించాలని నిర్ణయించింది. నేడు మనకు కావలసింది బాలికల కంటూ ఒకరోజు ప్రభుత్వం జరపడం కాదు. ప్రభుత్వం ఆడపిల్లల నిజమైన అభివృద్ధి జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలి. ఆడపిల్లలకు అన్ని రంగాలలో సమాన అవకాశాలు కల్పించాలి. వివక్ష లేని సమాజాన్ని ఏర్పాటు చేయాలి.

ఆడవారిపై ఎటువంటి పైశాచిక దాడులు, అఘాయిత్యాలు లేనటువంటి సమాజాన్ని ఏర్పరచాలి, స్త్రీల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు ప్రాధాన్యతనిచ్చి వారి భద్రతకు భరోసా నివ్వా లి. సమాజంలో బాలికలు ఎదుర్కొనే సమస్యల గురించి ప్రజల్లో అవగాహన పెంచాలి, లింగ వివక్ష, విద్యలో అసమానత, పోషకాహార లోపం, అనారోగ్య సమస్యలు, బాల్యవివాహాలు నివారణ, అక్రమ రవాణా మొదలైన అంశాలమీద అవగాహన కార్యక్రమాలు ఏర్పరచాలి, సమాజంలో మహిళల పట్ల గౌరవం హోదా పెంచే కార్యక్రమాలు చేపట్టాలి.

– వాసిలి సురేష్

సకుటుంబం

క్రేజీ డెనిమ్



బట్టల్లో ఎన్ని వెరైటీలు వచ్చినా డెనిమ్‌కున్న క్రేజే వేరు. చూడచక్కగా ఉండటమే కాదు, ఎన్నిసార్లు వేసినా కొత్తదానిలా ఉండడం, ఎలా పెట్టినా నలగకపోవడం, ఇస్త్రీ అవసరం లేకపోవడం వీటి ప్రత్యేకత.. అయితే సంప్రదాయ దుస్తుల్ని ఇష్టపడే అమ్మాయిలకు డెనిమ్‌ని వేసుకునే అవకాశం ఎక్కువగా ఉండేది కాదు. ఫ్యాషన్ డిజైనర్లు తలచుకోవాలేగానీ జీన్స్ సల్వార్ కమీజ్ అవడం, అనార్కలీగా మారడం ఎంతసేపూ..అలా రూపుదిద్దుకున్న డెనిమ్ కుర్తీలు రావడం కొత్త ట్రెండ్ అయిపోయాయి.





ఉపవాసం చేయడంతో....!

మన దేశంలో విభిన్న వర్గాల వారు జీవిస్తున్నారు. అయితే వాళ్లు తాము పూజించే దైవం కోసం ఉపవాసం ఉంటుంటారు. అలా చేస్తే పుణ్యం వస్తుందని భావిస్తారు. అలాగే కొందరు ఆరోగ్యం బాగుండాలని కూడా ఉపవాసం చేస్తుంటారు. అయితే ఉపవాసం చేయడం వెనుక ఉన్న కారణం ఏదైనప్పటికీ.. ఉపవాసం చేయడం వల్ల మనకు చాలా లాభాలు కలుగుతాయి. అవేమిటో ఇప్పుడు తెలుసుకుందాం.



* ఉపవాసం చేయడం వల్ల వృద్ధాప్య ఛాయలు అంత త్వరగా రావట. ఎందుకంటే ఉపవాసంలో ఉన్నప్పుడు మన శరీరం కొత్త కణాలను నిర్మించుకోవడంతోపాటు, పాత కణాలకు మరమ్మత్తులు చేసుకుంటుందట. దీంతో కణాలు నూతనోత్తేజాన్ని పొందుతాయి. ఇది యాంటీ ఏజింగ్ ప్రభావాన్ని కలిగిస్తుంది. దీంతో వృద్ధాప్య ఛాయలు అంత త్వరగా రావు.
* ఉపవాసం వల్ల మెదడు పనితీరు బాగా పెరుగుతుందట. జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరుగుతాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అలాగే ఎల్లప్పుడూ ఉత్సాహంగా ఉంటారట.
* ఉపవాసం చేస్తే శరీర రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. దగ్గు, జలుబు లాంటి స్వల్ప అనారోగ్య సమస్యలు నయమవుతాయి.
* అప్పుడప్పుడు ఉపవాసం చేస్తే క్యాన్సర్ కూడా నయమవుతుందని సైంటిస్టులు చెబుతున్నారు. ఉపవాసం వల్ల క్యాన్సర్ కణాలు వృద్ధి చెందకుండా ఉంటాయి.

ఆస్తమా నుంచి ఉపశమనం పొందేందుకు..



ఆస్తమా అనేది జన్యుపరంగా, పర్యావరణ పరమైన కారణాల వల్ల వస్తుంది. ఆస్తమా వచ్చిన వారి ఊపిరితిత్తుల్లో గాలి ప్రవాహంలో అడ్డంకులు ఏర్పడుతాయి. దీంతో దగ్గు, గురక వస్తుంటాయి. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతాయి. అయితే డాక్టర్‌ను సంప్రదించవచ్చు. దీంతోపాటు కింద సూచించిన పలు చిట్కాలను పాటిస్తే ఆస్తమా నుంచి ఉపశమనం పొందవచ్చు. మరి ఆస్తమాను తగ్గించే ఆ చిట్కాలు ఏమిటో తెలుసుకుందామా ..!

* ఒక గ్లాస్ పాలలో ఒకటి, రెండు వెల్లుల్లి రెబ్బలను వేసి బాగా మరిగించి అనంతరం ఆ పాలను తాగాలి. దీంతో ఆస్తమా నుంచి ఉపశమనం లభిస్తుంది.
* రోజూ తాగే టీలో అల్లం, వెల్లుల్లి రసాలను సమానంగా వేసి టీ తాగితే ఆస్తమా నుంచి బయట పడొచ్చు.
* నిత్యం ఉదయాన్నే ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో ఒక టీస్పూన్ తేనెను కలిపి తాగినా ఉపశమనం పొందవచ్చు.
* రాత్రి పూట ఒక గిన్నెలో కొన్ని నీళ్లు పోసి అందులో కొన్ని మెంతులను వేసి నానబెట్టాలి. వాటిని మరుసటి రోజు ఉదయాన్నే పరగడుపున తినాలి. అనంతరం ఆ నీటిని తాగాలి. ఇలా రోజూ చేస్తే ఆస్తమా నుంచి బయట పడవచ్చు. ముఖ్యంగా శ్వాస సరిగ్గా అందుతుంది. అలాగే మరేఇతర ఇన్‌ఫెక్షన్లు కూడా దరిచేరవు.
* తులసి ఆకులను కొన్నింటిని ప్రతిరోజూ ఉదయాన్నే పరగడుపునే తిన్నా, లేదంటే తులసి ఆకులతో చేసిన టీని తాగినా, ఆస్తమా నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే రోజూ క్రమం తప్పకుండా కాఫీ తాగితే అందులో ఉండే ఔషధ గుణాలు శ్వాస కోశ సమస్యలను తగ్గిస్తాయి. ఆస్తమా నుంచి బయట పడవచ్చు.

చిట్కాలు

*** పొట్లకాయ గుజ్జును ముఖానికి రాసి 15 నిమిషాల తర్వాత చల్లని నీటితో కడిగేయాలి. ఇలా చేస్తే మొటిమలు, బ్లాక్ హెడ్స్ రాకుండా ఉంటాయి.**



*** ఆకుకూరల్ని ఆకులు తెంచాక వెంటనే ఫ్రిజ్ నుంచి తీసి చన్నీటిని నింపిన గిన్నెలో వేయండి దీంతో ఆకుకూరల రంగు అలాగే నిలిచి ఉంటుంది.**

ఇన్నాళ్లకు గ్రీన్ సిగ్నల్



''భారత రాజకీయాల్లోనే అత్యంత సుదీర్ఘకాలంగా ఎదురుచూసిన సందర్భం ఎట్టకేలకు వాస్తవరూపం దాల్చింది. ప్రియాంకా గాంధీ జాతీయ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమించబడటంపై సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉత్తరప్రదేశ్ తూర్పు ప్రాంత ఇన్‌చార్జ్‌గా కూడా నియమిస్తూ ఉత్తర్వులు అందుకుంది. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ రూపురేఖలతో ఉన్న ప్రియాంకను రాజకీయాలలోకి రావాలని పార్టీ పెద్దలు, కార్యకర్తలు ఎప్పటినుంచో కోరుకుంటున్న విషయం తెలిసిందే. నాయనమ్మ తరువాత ఆ కుటుంబంలో ప్రియాంకకు ప్రజల్లో అంతటి క్రేజ్ ఉంది. ఆమె వచ్చిన సమయం, కచ్చితమైన పాత్ర, స్థానంపై సర్వత్రా చర్చిస్తున్నారు ఇన్నాళ్లకు ఈ కల ఫలించబోతోందన్నమాట. అలాగే నాయనమ్మలాగా ఆమె కూడా మరింత ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరుకుందాం.

రాగి, ఇత్తడి పాత్రల్లో..!



పూర్వం మన పెద్దవాళ్లు రాగి, ఇత్తడి వస్తువులనే ఎక్కువగా వాడేవారు. కానీ, ఇప్పుడయితే అంతా ప్లాస్టిక్‌మయం. దీంతో వారు ఇప్పటికీ అనారోగ్యాల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉన్నారని చెప్పొచ్చు. అందువల్ల మనం కూడా రాగి, ఇత్తడి పాత్రలను వాడితే ఆరోగ్యంగా ఉండవచ్చు.

రాగి పాత్రలో కేవలం 3 గంటల పాటు నీటిని నిల్వ ఉంచితే చాలు. ఆ నీటిలో ఉండే క్రిములు నశిస్తాయి. దీంతో ఆ నీరు పరిశుభ్రంగా మారుతుంది. రాగి పాత్రలతో నీటిని నిల్వ ఉంచడం వల్ల ప్రమాదకరమైన ఈ కొలి బ్యాక్టీరియా కూడా అంతమవుతుంది. దీని వల్ల అనారోగ్యాలు రాకుండా ఉంటాయి. ఇత్తడి పాత్రలను జింక్, అలాయ్ మిశ్రమంతో తయారు చేస్తారు. జింక్ వల్ల మన శరీర రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. అందుకని ఇత్తడి పాత్రల్లో అయినా నీటిని తాగవచ్చు. లేదా ఆ పాత్రల్లో వంట చేసుకుని తినవచ్చు.

రాగి పాత్రల్లో నిల్వ ఉంచిన నీటిని తాగడం వల్ల అసిడిటీ, అజీర్ణం, డయేరియా, కామెర్లు, కీళ్ల నొప్పులు తగ్గుతాయి. అధిక బరువు తగ్గుతారు. గుండె సమస్యలు రావు. క్యాన్సర్ కణాలు నశిస్తాయి. థైరాయిడ్ గ్రంథి పనితీరు మెరుగవుతుంది. రక్తహీనత సమస్య ఉండదు. హైబీపీ తగ్గుతుంది.

డాక్టర్ ఎ.ఎస్ రావు ఒలంపియాడ్‌లో శ్రీచైతన్య ప్రథమ స్థానం

మనతెలంగాణ/హైదరాబాద్ : డాక్టర్ ఎ.ఎస్ రావు అవార్డ్ కౌన్సిల్ వారు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన 31వ సైన్స్ టాలెంట్ సెర్చ్ (9,10 తరగతుల) ఫైనల్ పరీక్షలలో ఆలిండియా ఫస్ట్ ర్యాంకులను శ్రీ చైతన్యస్కూల్ విద్యార్థులు కైవసం చేసుకున్నారని చైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సీమ తెలిపారు. టాప్ 10లో 13 ర్యాంకులు, టాప్ 20లో 24 ర్యాంకులను తమ సంస్థ విద్యార్థులకే దక్కాయని ఆమె వివరించారు. ఈ క్రమంలో 9వ తరగతి నుంచి 40 ర్యాంకులు ప్రకటించగా అందులో 26 ర్యాంకులు చైతన్య విద్యార్థులవేనని తెలిపారు. అలాగే 10 వ తరగతి నుంచి 48 ర్యాంకులు ప్రకటించగా వారిలో 31 మందికి ర్యాంకులు దక్కాయన్నారు. మొత్తం 88 ర్యాంకులకు గాను 57 ర్యాంకులు చైతన్యకే దక్కాయన్నారు. ఏడు సంవత్సరాలుగా డాక్టర్ ఎ.ఎస్ రావు ఒలింపియాడ్‌లో అత్యుత్తమైన ర్యాంకులు సాధించడం ద్వారా శ్రీ చైతన్య తన ఆధిపత్యాన్ని చాటుతూ నెం.1 స్థానంలో నిలిచిందని శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్. బి.ఎస్ రావు తెలిపారు. అలాగే ఇటీవల కాలంలో విడుదలైన ఐఎంఒ పరీక్ష ఫలితాలలో రెండు అంతర్జాతీయ ర్యాంకులు వచ్చాయన్నారు. ఈక్రమంలో టాప్10లో 92 ర్యాంకులు, టాప్ 100లో 442 ర్యాంకులు మొత్తం 2541 మెడల్స్ చైతన్య విద్యాసంస్థల విద్యార్థులు కైవసం చేసుకున్నారన్నారు. స్కూల్ స్థాయి నుంచే విద్యార్థులకందించే సిబ్బాక్, మెడికాన్, ఐకాన్, సి.బి.పియల్, యమ్.పి.ఎల్ వంటి అకాడమిక్ ప్రోగ్రామ్స్‌తో పాటు అంకిత భావంతో పనిచేసే అధ్యాపకులు వల్లే ఇంతటి ఘన విజయాలను సాధించామని స్కూల్ అకడమిక్ డైరెక్టర్ సీమ ఒక ప్రకటనలో తెలిపారు.

ఎఎంటిఐ ఫలితాలలో నారాయణ ప్రభంజనం

మనతెలంగాణ/హైదరాబాద్ : అసోసియేషన్ ఆఫ్ మ్యాథ్స్ టీచర్స్ ఆఫ్ ఇండియా(ఎఎంటిఐ) పోటీపరీక్షల్లో నారాయణ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్.పి.సింధూర నారాయణ తెలిపారు. జాతీయ స్థాయిలో టాప్ 10 ర్యాంకుల్లో 2,5,6,7,8,,10 ర్యాంకులు నారాయణకే దక్కాయన్నారు. టాప్ 10 ర్యాంకుల్లో 37శాతం సెలక్షన్స్‌తో నారాయణ అగ్రస్థానంలో నిలిచిందన్నారు. అన్ని కేటగిరీల్లో మొత్తం ప్రకటించిన 156 ఫలితాలలో 57 ర్యాంకులను కైవసం చేసుకున్నామన్నారు. 5వ తరగతి నుంచి 10 వ తరగతి వరకు నిర్వహించే ఈ పరీక్ష మూడు కేటగిరీలలో జరుగుతుందన్నారు. ప్రైమరీ కేటగిరిలో(5 నుంచి 6వ తరగతులు) జాతీయ స్థాయిలో 48 సెలక్షన్ ప్రకటించగా అందులో 22, సబ్‌జూనియర్ కేటగిరీ(7,8తరగతులు)లో 54 సెలక్షన్స్‌లో 10 నారాయణ విద్యార్థులు కైవసం చేసుకున్నారన్నారు. ఈ రికార్డు స్థాయి ఫలితాలు మరే ఇతర విద్యాసంస్థలు సాధించలేదని ఆమె పేర్కొన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ పోటీ పరీక్ష నిర్వహించినా అన్నింటా నారాయణ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరుస్తున్నారని ఆమె వివరించారు. ప్రపంచీకరణలో భాగంగా విద్యావ్యవస్థ పరిధి విస్తృతం అవుతోందని, విద్యార్థులకు అవకాశాలతోపాటు పోటీ తీవ్రత పెరిగిందన్నారు. పోటీని తట్టుకుని విజేతగా నిలిచేందుకు అవసరమైన విద్యను అందించడంలో బాధ్యత స్కూల్స్‌పైనే ఉంటుందన్నారు. ఈక్రమంలో సైంటిఫిక్ రిసెర్చ్‌తోపాటు న్యూమరికల్ స్కిల్స్‌ను పెంపొందించడంతో పాటు ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్‌పై ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నట్లు ఆమె ఒక ప్రకటనలో వివరించారు. ఈ సందర్భంగా పోటీ పరీక్షలలో విజయకేతనం ఎగురవేసిన విద్యార్థులను నారాయణ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.పునీత్ ప్రత్యేకంగా అభినందించారు.

సిద్ధగంగ యోగి అంత్యక్రియలకు మోడీ గైర్హాజరుపై ఎద్దేవా

బెంగళూరు : ఆధ్యాత్మిక గురువు, సిద్ధ గంగ మఠానికి చెందిన శివకుమార స్వామి అంత్యక్రియలకు ప్రధాని మోడీ హాజరు కాకపోవడం పట్ల బుధవారం కర్నాటక ఉప ముఖ్యమంత్రి జి పరమేశ్వర విమర్శించారు. సెలబ్రిటీల వివాహాలకు వెళ్లారు, బాలీవుడ్ నటులను కలుస్తూ ఉంటారు, కాని, పేద ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన స్వామి అంత్యక్రియలకు మోడీ గైర్హాజరయ్యారని ట్వీట్ చేశారు. ఆధ్యాత్మిక గురువును మంగళవారం లింగాయత్ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు.

వరంగల్ వ్యక్తికి థాయ్‌లాండ్ టూర్ అవకాశం

విజేతలను ప్రకటించిన బిఎస్ఎన్ఎల్

మన తెలంగాణ / హైదరాబాద్ : భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బిఎస్ఎన్ఎల్) గతేడాది ఆగస్టులో ప్రారంభించిన 'విన్ కే సాయిర్' అనే ఆఫర్‌లో వరంగల్‌కు చెందిన రిటైలర్‌కు థాయ్‌లాండ్‌లో పర్యటించే అవకాశం లభించగా, నిజామాబాద్‌కు చెందిన రిటైలర్‌కు గోవా ట్రిప్ అవకాశం లభించింది. తెలంగాణ సర్కిల్ పరిధిలోని బిఎస్ఎన్ఎల్ రిటైలర్లకు మాత్రమే పరిమితమైన ఈ అవకాశంతో వరంగల్‌కు చెందిన రాపల్లె సునీల్ థాయ్‌లాండ్‌లో నాలుగు రోజుల పాటు (నాలుగు పగళ్ళు, నాలుగు రాత్రులు) పర్యటించే అవకాశం లభించింది. ప్రయాణ ఖర్చులతో పాటు అక్కడ బసచేసే హోటల్ ఖర్చులను కూడా బిఎస్ఎన్ఎల్ భరిస్తుంది. మూడు రోజుల గోవా ట్రిప్ అవకాశం నిజామాబాద్ జిల్లాకు చెందిన వి. సంతోష్‌కు లభించింది. గతేడాది ఆగస్టు నుంచి డిసెంబరు వరకు బిఎస్ఎన్ఎల్ వినియోగదారులను పెంచే ఉద్దేశంతో రిటెయిల్ వ్యాపారుల కోసం ఈ ఆఫర్‌ను ప్రకటించగా వచ్చిన కూపన్లలో తెలంగాణ చీఫ్ జనరల్ మేనేజర్ వి.సుందర్ తీసిన లక్కీ డ్రాలో ఈ ఇద్దరు ఎంపికైనట్లు ఆ సంస్థ విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది.

ప్రియాంకం

(మొదటిపేజీ తరువాయి)

మొదటి వారంలో 'చేపడతారు'' అంటూ రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ సంతకంతో ఒక అధికారిక ప్రకటన విడుదలైంది. ప్రకటన వెలువడిన క్షణాల్లోనే దేశవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు సంబరాల్లో మునిగిపోయాయి. ఆమె క్రియాశీల రాజకీయ రంగ ప్రవేశాన్ని సర్వత్రా స్వాగతించారు. అదే విధంగా, పశ్చిమ ఉత్తర ప్రదేశ్ ఏఐసిసి ప్రధాన కార్యదర్శిగా పార్టీ సీనియర్ నాయకుడు జ్యోతిరాదిత్య సింధియా నియమితులయ్యారు. అక్కడి నుంచి గులాం నబీ ఆజాద్‌ను హర్యానాకు ఎన్నికల ఇన్‌ఛార్జిగా బదిలీ చేశారు. ఇక మరో నేత కెసి వేణుగోపాల్‌కు పదోన్నతి లభించింది. ఆయనను పార్టీ ప్రధాన కార్యదర్శి(ఆర్గనైజేషన్)గా నియమించారు. ఇప్పటి వరకు ఈ పదవిలో రాజస్థాన్ సిఎం అశోక్ గెహ్లాట్ ఉన్నారు. అదే సమయంలో వేణుగోపాల్ కర్నాటకకు ఏఐసిసి జనరల్ సెక్రెటరీగా కొనసాగుతారని ప్రకటనలో వివరించారు. పార్టీకి ఇప్పటి వరకు గెహ్లాట్ అందించిన సేవలను కాంగ్రెస్ ఆ ప్రకటనలో ప్రశంసించింది. ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ప్రియాంక తెరవెనుక పాత్ర పోషించారు. మూడు రాష్ట్రాల సిఎంల ఎంపికలో ఆమె అభిప్రాయాలు కూడా తీసుకున్నారని కాంగ్రెస్ వర్గాలు చెప్పుకుంటాయి. ఉత్తర్ ప్రదేశ్‌లో ఒకపక్క బిజెపి, మరో పక్క ఎస్‌పి–బిఎస్‌పి కూటమి నుంచి ద్విముఖ సవాళ్లను దీటుగా ఎదుర్కోనేందుకు, పార్టీ కార్యకర్తలను ఎన్నికల సమరానికి కార్యోన్ముఖులను చేసేందుకు ప్రియాంక గాంధీ ప్రత్యక్ష ఎన్నికలలోకి ప్రవేశించారని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. మాయావతి, అఖిలేష్ యాదవ్ నుంచి ఎదురైన పరాభవాన్ని తిప్పికొట్టేందుకు, యుపిలో త్రిముఖ పోటీ అనివార్యంగా మార్చేందుకు 47 సంవత్సరాల ప్రియాంక గాంధీని రంగంలోకి దింపి రానున్న లోక్‌సభ ఎన్నికలు తమకు ప్రతిష్టాకరమని కాంగ్రెస్ పార్టీ విస్పష్టం చేసింది. అదీ గాక, 80 లోక్‌సభ స్థానాలున్న యుపిలో ఒక్క ఎన్నికల ఇన్‌చార్జిను ఉంచడం వల్ల ఆశించిన ప్రయోజనం నెరవేరదని కూడా కాంగ్రెస్ గుర్తించింది. ఇద్దరిని నియమించింది. ఇప్పుడు ఇక ఆమె ఎన్నికల బరిలో దిగుతారా? లేక గతంలో మాదిరిగానే తన తల్లి, సోదరుడి నియోజకవర్గాలలో ప్రచార బాధ్యతలు కూడా చేపడతారా అన్నదానిపై స్పష్టత లేకపోయినప్పటికీ సోనియా నియోజకవర్గం రాయ్‌బరేలీ నుంచి ఆమె ఎన్నికల బరిలో నిలుస్తారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇదిలావుండగా ప్రియాంక రాజకీయ రంగ ప్రవేశాన్ని దేశవ్యాప్తంగా ఆ పార్టీ నేతలు స్వాగతించారు. బిజెపికి ఇక రాబోయేవి గడ్డురోజులేనని పలువురు వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ మరింత బలోపేతమయ్యేందుకు రాహుల్ తీసుకున్న ఈ చర్య దోహదపడుతుందన్నారు.

ప్రియాంకకు రాబర్ట్ అభినందనలు

ఉత్తర్‌ప్రదేశ్ ఇంచార్జిగా ప్రియాంకను నియమించిన వెంటనే ఆమె భర్త రాబర్ట్ వాద్రా అభినందనలు తెలిపారు. 'కంగ్రాచ్యులేషన్స్ 'పి'.. నీ జీవితంలో ప్రతిక్షణం అండగా ఉంటా. అత్యుత్తమంగా పనిచేయాలని ఆకాంక్షిస్తున్నా' అని ఫేస్‌బుక్‌లో రాబర్ట్ వాద్రా పోస్ట్ చేశారు.

100 కోట్లు



(మొదటిపేజీ తరువాయి)

యంత్రాలను సరఫరా చేస్తామని, ఆయిల్‌ను తామే కొనుగోలు చేస్తామని నమ్మించి మోసం చేసిన గ్రీన్‌గోల్డ్ బయోటెక్ ఎండి శ్రీకాంత్‌ను ఉప్పల్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు రూ. లక్ష రూపాయలు పెట్టుబడి పెడితే నెలకు రూ. 20 వేలు ఇంట్లో నుంచే సంపాదించవచ్చని నమ్మబలికారు. రూ. లక్ష రూపాయలు డిపాజిట్ చేసే పల్లీల నుంచి నూనెను బయటకు తీసే యంత్రాన్ని ఇంటికి చేరుస్తామని వందలాది మందిని సభ్యులుగా చేర్చుకున్నారు. ఈక్రమంలో మార్కెట్ ఎజెంట్లును ఏర్పాటు చేసుకుని ఇంటింటికి తిరిగి సభ్యులను ఆకర్షించారు. ఈక్రమంలో వేరుశనగ గింజలను నుంచి ఆయిల్ తీసే యంత్రాల పేరిట శ్రీకాంత్ వేలాది మంది వద్ద నుంచి డబ్బులు వసూలు చేశాడు. బాధితులలో నాలుగు రాష్ట్రాలకు చెందినవారున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో వెలుగుచూసింది. గీన్‌గోల్డ్ బయోటెక్ ఎండి శ్రీకాంత్ గతంలో మహాలైఫ్ పేరుతో మల్టీ లెవల్ మార్కెటింగ్‌ను శ్రీకాంత్ నిర్వహించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో నాలుగు రాష్ట్రాలలో వెరసి వేలాది మంది బాధితులు ఉన్నట్లు పోలీసులు అంచనా వేస్తున్నారు. గీన్‌గోల్డ్ బయోటెక్ ఎండి శ్రీకాంత్ వేరుశనక్కాయల యంత్రాల పేరిట రూ. 75 కోట్ల నుంచి రూ.100 కోట్లకు పైగా వసూళ్లకు పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. గతంలో సైబరాబాద్ పరిధిలో కరక్కాయ, మునక్కాయల పొడి తరహాలోనే వేరు శనగ గింజల నుంచి నూనె తీసే యంత్రాలను ఇస్తామంటూ నమ్మించి మోసం చేసినట్లుగా తెలుస్తోంది. తెలుగు రాష్ట్రాలలో పాటు కర్నాటక, తమిళనాడు ఈ మోసాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. బాధితురాలు ఇందిర ఫిర్యాదు మేరకు పోలీసులు గీన్‌గోల్డ్ బయోటెక్ ఎండి శ్రీకాంత్, భాస్కర్ యాదవ్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

బాధితులంతా మధ్యతరగతి వారే

గీన్‌గోల్డ్ బయోటెక్ ఎండి శ్రీకాంత్ చేతిలో మోసపోయిన వారిలో అత్యధికులు మధ్య తరగతి వారే ఉన్నారని, అందులో మహిళలు అధికంగా ఉన్నారని పోలీసు ఉన్నతాధికారులు వివరిస్తున్నారు. హైదరాబాద్ నగరంలోని ఉప్పల్, వనస్థలిపురం, నాగోల్, కుషాయిగూడ, హయత్‌నగర్, ఇబ్రహీం పట్నం తదితర ప్రాంతాలకు చెందిన వారు అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. కేవలం మధ్య తరగతి వారికి ఆశ చూపి వారి నుంచి పెద్ద ఎత్తున దోచుకున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెలుగు చూసింది. ఆంధ్రప్రదేశలోని నెల్లూరు, గుంటూరు, విజయవాడ కేంద్రంగా చేసుకుని గీన్‌గోల్డ్ బయోటెక్ పేరిట అక్రమంగా వసూళ్లు చేసినట్లు పోలీసులు వివరిస్తున్నారు. గతంలో మహాలైఫ్ పేరిట గీన్‌గోల్డ్ బయోటెక్ ఎండి శ్రీకాంత్ కోట్లాది రూపాయలు వసూలు చేసినట్లు తెలుస్తోంది. రూ. లక్ష పేరిట ఒక్కక్కరి దగ్గర నుంచి వసూలు చేసిన గీన్‌గోల్డ్ బయోటెక్ ఎండి శ్రీకాంత్ నెలలు గడుస్తున్నా వేరుశనగ గింజల నుంచి ఆయిల్ తీసే యంత్రాలను సరఫరా చేయకపోవడంతో ఆనుమానం వచ్చిన కొందరు బాధితులు ఉప్పల్ పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి గీన్‌గోల్డ్ బయోటెక్ ఎండి శ్రీకాంత్ అనుచరులను ఆదుపులోకి తీసుకుని తమదైన శైలిలో ప్రశ్నించడంతో గీన్‌గోల్డ్ బయోటెక్ గుట్టు రట్టయ్యింది.

ఇంకానా..?



(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రం ఏర్పడి ఐదేళ్లు అవుతున్నప్పటికీ ఇక్కడ ఉన్న కొన్ని పత్రిక, మీడియా సంస్థలు ఇంకా భావజాల అధిపత్యాన్ని ప్రదర్శిస్తున్నాయని, తాము ఏం చేసినా అదే కరెక్ట్, ఏది చెప్తే అదే వేదం అనే తరహాలో ఇంకా తెలంగాణపై అధిపత్యాన్ని ప్రదర్శించే ధోరణిని కొనసాగిస్తున్నాయన్నారు. ఇకనైనా అలా ంటి అధిపత్య భావనలను వీడడం మంచిదని సూచించారు. తాము ఎలాంటి వివాదాలనూ కోరుకోవడం లేదని, అధిపత్యా న్ని చెలాయించాలని అంతకన్నా కోరుకోవడం లేదని స్పష్టంచేశారు. తెలంగాణ తన అస్థిత్వాన్ని చాటుకునే దిశగా పోరా టం చేసి రాష్ట్రాన్ని సాధించుకున్నామని, తెలంగాణవాదాన్ని, తెలంగాణ అస్థిత్వాన్ని తొక్కిపెట్టే ధిక్కార ధోరణి పోవాల్సిన అవసరం ఉందని అన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా తామే అధిపత్యం చేస్తాం, తాము చెప్పిందే వినాలి అనే డ్రామాలు ఇక నుంచి నడవవు అని స్పష్టం చేశారు. తెలంగాణ పత్రికలు, మాధ్యమాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, ఇటీవల ముఖ్యమంత్రి కెసిఆర్ సైతం ఇదే అంశాన్ని నొక్కిచెప్పారని కెటిఆర్ ఉదహరించారు.

అక్కడొక న్యాయం.. ఇక్కడొక న్యాయమా?

తెలంగాణలోని చాలా పత్రికల్లో ఆంధ్రకు సంబంధించిన వార్తలు కనిపిస్తుంటాయని, కానీ ఆంధ్రప్రదేశ్‌లోని పత్రికల్లో మాత్రం తెలంగాణ వార్తలు కనిపించవని, ఇలాంటి వివక్ష ఎందుకని మీడియా సంస్థలను కెటిఆర్ ప్రశ్నించారు. తెలంగాణలోని పత్రికల్లో అమరావతి వార్తలు రావడంపై తమకు ఎలాంటి అభ్యంతరమూ లేదని, కానీ అమరావతిలో కూడా తెలంగాణ వార్తల్ని ప్రచురించాలనే సంస్కారం ఆ పత్రికల పెద్దలకు ఉండాలి కదా అని ప్రశ్నించారు. ఆ రాష్ట్రంలోని పత్రికల్లో తెలంగాణ వార్తలే కనబడనప్పుడు మనకు మాత్రం ఆ రాష్ట్రానికి సంబంధించిన వార్తలతో ఏం సంబంధమనే విషయాన్ని ఎందుకు ఆలోచించరని ప్రశ్నించారు. ఢిల్లీలో సైతం ఇది ప్రతిబింబిస్తోందని గుర్తుచేశారు. తాను ఢిల్లీ పోయినప్పుడల్లా అక్కడి తెలుగు పత్రికలను చూస్తే తెలంగాణకు సంబంధించిన వార్తలే కనబడవని, తెలంగాణలో ఒక ప్రభుత్వం ఉన్నట్లుగానీ, ఒక ముఖ్యమంత్రి ఉన్నట్లుగానీ వార్తలే ఉండవని అన్నారు. దీని గురించి ఆరా తీస్తే, ఢిల్లీలోని తెలుగు పత్రికలన్నీ ఆంధ్రప్రదేశ్ ఎడిషన్ అంటూ వివరణ వచ్చిందని, ఆంధ్ర ఎడిషన్‌లో తెలంగాణ వార్తలకు స్థానం లేనప్పుడు తెలంగాణలో మాత్రం ఎందుకు భిన్న ధోరణి అని వ్యాఖ్యానించారు. ఆంధ్రా ఎడిషన్‌లో తెలంగాణ వార్తలు రాయనప్పుడు, తెలంగాణ ఎడిషన్‌లో ఆంధ్రా వార్తలు ఎందుకు అని ప్రశ్నించారు.

పాత్రికేయులు ఆలోచించాలి

తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా కొనసాగుతున్న వివక్ష, ఆంధ్ర మీడియా ఆధిపత్యం, తెలంగాణవాదాన్ని ధిక్కరించే ధోరణిపై తెలంగాణ జర్నలిస్టులు ఆలోచించాల్సిన అవసరం ఉందని కెటిఆర్ పేర్కొన్నారు. ఇలాంటి విషయాలను ముఖ్యమంత్రి కెసిఆర్ మాట్లాడితే కొందరికి కోపం వస్తుందని, దానిపై రకరకాల రాద్ధాంతాలు, విమర్శలు వస్తాయని, వాస్తవం మాత్రం ఇలా కనిపిస్తోందన్నారు. తెలంగాణ భావజాలాన్ని అణువణువునా నింపుకున్న తెలంగాణ పత్రికలను ప్రభుత్వం ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, ముఖ్యమంత్రి సైతం దీన్నే ఇటీవల నొక్కి చెప్పారని కెటిఆర్ గుర్తుచేశారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారం బాధ్యత నాది

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జర్నలిస్టులకు పెద్ద పీట వేసి సంస్థాగతంగా గౌరవించిన పార్టీ టిఆర్ఎస్ అని, దేశంలో ఏ రాష్ట్రమూ చేయని విధంగా జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో శ్రీకారం చుట్టిందని కెటిఆర్ వివరించారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి బాధ్యత తనదని స్పష్టంచేశారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ఓ సంక్షేమ నిధిని ఏర్పాటు చేశామని, జర్నలిస్టులకు కూడా ఎన్నికల్లో నిలబడే అవకాశాన్ని కెసిఆర్ కల్పించారని, గతంలో దుబ్బాక శాసనసభ్యుడు రామలింగారెడ్డి అయితే ఇప్పుడు క్రాంతికిరణ్ అని గుర్తుచేశారు. జర్నలిస్టులతో పాటు తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్న న్యాయవాదులు, కళాకారులకు కూడా కెసిఆర్ రాజకీయ అవకాశం కల్పించారని అన్నారు. అంబర్‌పేట నియోజకవర్గం నుంచి న్యాయవాది వెంకటేశ్‌ను గెలిపించుకున్నారని, కళాకారుల నుంచి రసమయిని గెలిపించుకున్నారని గుర్తుచేశారు. జర్నలిస్టుల సంక్షేమంలో మరే రాష్ట్రం కంటే తెలంగాణ ముందు వరుసలో ఉన్నదని, ఆంధ్రప్రదేశ్ ఇటీవల జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలను ఇచ్చిన జివోను కెటిఆర్ ఉదహరిస్తూ, ఆ రాష్ట్రంలో ఎలాంటి పోటీ లేదని, చిత్తశుద్ధితో త్వరలోనే ఇళ్ళ స్థలాలను ఇప్పించే బాధ్యతను తాను తీసుకుంటానని స్పష్టం చేశారు. కోర్టు వివాదాలకు ఆస్కారం లేకుండా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, హెల్త్‌కార్డుల పంపిణీ చిత్తశుద్ధితో ఉంటుందని భరోసా ఇచ్చారు. తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల భవనానికి ప్రభుత్వం తరపున స్థలాన్ని కేటాయించేందుకు ముఖ్యమంత్రితో మాట్లాడి ప్రయత్నం చేస్తానని కెటిఆర్ హామీ ఇచ్చారు.

కాళేశ్వరానికి రూ. 7785 కోట్ల రుణం

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వమే గ్యారంటీగా ఉంటోంది. ఈ రుణానికి కార్పొరేషన్ 9.45% మేర వార్షిక వడ్డీని చెల్లించేలా ఒప్పందం కుదిరింది. ప్రతీ నెలా వడ్డీని చెల్లించేలా ప్రతీ మూడు లేదా ఐదు లేదా పదేళ్ళకోసారి వడ్డీలో మార్పులు చేర్పులు చేసుకునేలా ఆ ఒప్పందం కుదిరింది. ఈ రుణాన్ని సమకూర్చడానికి పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ 10.75% చొప్పున వడ్డీని నిర్దేశించినప్పటికీ బసిక్ పాయింట్లను పరిగణనలోకి తీసుకున్న తర్వాత 9.45% వడ్డీకి అంగీకారం కుదిరింది. గతేడాది మార్చిలో తీసుకున్న రూ. 12,067.36 కోట్లకు ఇప్పుడు తీసుకుంటున్న రుణం అదనంగా ఉంటుందని, వడ్డీ కూడా విడిగానే ఉంటున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి తీసుకుంటున్న రూ. 7,784.95 కోట్ల రుణంలో 21(ఏ) ప్యాకేజీ పనుల నిమిత్తం రూ. 2,379.56 కోట్లుకాగా, ఒకటవ లింక్‌లోని సివిల్ పనుల నిమిత్తం రూ. 5,405.39 కోట్లు అని సిఎస్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ రుణం పొందడానికి అవసరమైన అన్ని విధి విధానాలను రూపొందించాల్సిన బాధ్యత కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు మేనేజింగ్ డైరెక్టర్‌దేనని సిఎస్ స్పష్టం చేశారు. ఈ రుణానికి సంబంధించి రాష్ట్రప్రభుత్వం గ్యారంటీగా ఉంటున్నందున రానున్న బడ్జెట్ (పూర్తిస్థాయి)లో పేర్కొననున్నట్లు తెలిపారు. అయితే గ్యారంటీ కమిషన్‌గా నిర్ణయించిన రెండు శాతం మొత్తాన్ని మాత్రం కాళేశ్వరం ప్రాజెక్టు భరిస్తుంది. రెండు విడతలుగా మంజూరవుతున్న ఈ రుణం 2021–22 ఆర్థిక సంవత్సరంనుంచి 2033–34 ఆర్థిక సంవత్సరం వరకు మొత్తం 48 త్రైమాసికాల్లో చెల్లించేలా ఒప్పందం కుదిరింది. 2021–22 ఆర్థిక సంవత్సరంలో మాత్రం రెండు త్రైమాసికాలు మాత్రమే చెల్లించనుండగా ఆ తర్వాత పదకొండు సంవత్సరాల పాటు ప్రతీ ఏటా నాలుగు త్రైమాసికాలకు, చివరి విడతగా 2033–34 ఆర్థిక సంవత్సరంలో మాత్రం రెండు త్రైమాసికాలు చెల్లిస్తే మొత్తం రుణం తీరిపోయేలా షెడ్యూలు కూడా సిద్ధమైంది. ప్రతీ ఆర్థిక సంవత్సరంలో మొత్తం రుణంలో 8.33% చొప్పున పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్ చెల్లించేలా ఈ షెడ్యూలు తయారైంది.

తాజాగా విడుదలైన రూ. 5,405.39 కోట్ల రుణానికి సంబంధించి ప్రతీ త్రైమాసికానికి రూ. 112.61 కోట్ల చొప్పున ఏడాదికి రూ. 450.45 కోట్ల చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఇక రూ. 2,379.56 కోట్ల రుణాన్ని మాత్రం ప్రతీ త్రైమాసికానికి రూ. 49.57 కోట్ల చొప్పున ఏటా రూ. 198.30 కోట్ల చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. మొత్తం 48 త్రైమాసికాల ప్రకారం చెల్లించాల్సిన ఈ రెండు రకాల రుణాల తొలి విడత చెల్లింపు 2021–22 ఆర్థిక సంవత్సరంలో మూడవ త్రైమాసికం (అక్టోబర్ 15, 2021) నుంచి ప్రారంభం కానుంది. 2021–22, 2033–34 ఆర్థిక సంవత్సరాల్లో రెండు త్రైమాసికాల చొప్పున మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి తీసుకున్న రూ. 2,379.56 కోట్ల రుణంతో కాళేశ్వరం ప్రాజెక్టులోని నిర్మాణపు పనులతో పాటు ప్రెషర్డ్ పైప్ ఇరిగేషన్ సిస్టమ్, ఎంఎస్, డిఐ, హెడ్‌పిఇ పైప్‌లైన్ సిస్టమ్, వాల్వులు, థ్రస్ట్ బ్లాకులు తదితర 21(ఏ) ప్యాకేజీలోని పనులకు కాళేశ్వరం ప్రాజెక్టు కార్పొరేషన్ ఖర్చు చేయనుంది. అదే విధంగా రూ. 5,405.39 కోట్ల రుణంతో కాళేశ్వరం ప్రాజెక్టులోని ఒకటవ లింకులోని సివిల్ పనులు, ఫోర్‌బే, ఇఎం, హెచ్‌ఎం, ప్రెషర్ మెయిన్‌లు, గేట్లు, సబ్ స్టేషన్లు తదితర పనులను కార్పొరేషన్ చేపట్టనుంది.

పంచాయతీకొక నర్సరీ

(మొదటిపేజీ తరువాయి)

ఆలోచనలకు అ నుగుణంగా రానున్న ఐదవ విడత హరితహారం కార్యక్రమానికి కోటి మొక్కలను నాటేలా లక్ష్యాన్ని విజయవంతం చేయాలని స్పష్టం చేశా రు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న మొ త్తం 12,751 పంచాయతీల్లో ఇప్పటికే 2.206 పంచాయతీల్లో నర్సరీలు ఉన్నాయని, మరో 9,868 పంచాయతీల్లో వీటి నిర్మాణం ముమ్మరంగా జరుగుతున్నట్లు పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్ వివరించారు. ఈ నర్సరీలను అటవీ శాఖ నిర్వహిస్తోందని తెలిపారు. ఇక పట్టణ ప్రాంతాల్లోని నర్సరీలు, రానున్న హరితహారంలో నాటే మొక్కలపై అటవీ, పట్టణాభివృద్ధి శాఖల ఉన్నతాధికారులతో చర్చించిన ప్రధాన కార్యదర్శి ఎక్కువగా పూలు, పండుల, నీడను ఇచ్చే మొక్కలను పెంచడంపై దృష్టి పెట్టాల్సిందిగా సూచించారు. రాష్ట్రంలోని వాతావరణ పరిస్థితులు ఒక్కో జిల్లాకు ఒక్కో రకంగా ఉన్నందున వాటికి అనుగుణంగా నాటాల్సిన మొక్కలపై దృష్టి పెట్టాలని, రాష్ట్ర, జాతీయ రహదారుల పక్కన నాటేందుకు ఏపుగా పెరిగే జాతి మొక్కలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఇందుకు అటవీశాఖ ప్రత్యేక చొరవ తీసుకోవాలని స్పష్టం చేశారు. పట్టణాల్లో రకరకాల కాలుష్యం పెరిగిపోతున్నందున దానికి అనువుగా మొక్కల ఎంపిక ఉండాలని, పచ్చదనాన్ని పెంచడానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

జూలై నుంచి పట్టణాల్లో అర్బన్ ఫారెస్టు పార్కులు

పట్టణాల్లో పచ్చదనం తగ్గిపోతుండడం, సిమెంటు కాంక్రీటు భవనాలు వెలుస్తూ ఉండడం, దానికి వెన్నంటే కాలుష్యం కూడా ఉత్పత్తి అవుతున్నందున పచ్చదనం పెరగడానికి ముఖ్యమంత్రి ప్రత్యేక ఆలోచనలు చేశారని, అందువల్ల అర్బన్ ఫారెస్టు పార్కుల పెంపకం అనే ప్రణాళిక సిద్ధమైందని ప్రధాన కార్యదర్శి గుర్తుచేశారు. హైదరాబాద్ నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో మొత్తం 56 అర్బన్ ఫారెస్టు పార్కుల నిర్మాణం జరుగుతోందని, జూలై నెలకల్లా ఇవి ప్రజలకు వినియోగంలోకి రావాలని స్పష్టం చేశారు. అందుకనుగుణంగా ప్రస్తుతం జరుగుతున్న పనులను వేగవంతం చేయాల్సిందిగా ఆదేశించారు. టెండర్లు, వివిధ శాఖల నుంచి అనుమతులు రావడంలో జాప్యం జరుగుతోందన్న సాకుతో పనుల్లో నిర్లక్ష్యం మంచిది కాదని, పనులు వేగంగా జరగాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా హెచ్‌ఎండిఏ, జిహెచ్‌ఎంసి ప్రాంతాల్లో పర్యాటక ప్రాధాన్యత ఉన్న అర్బన్ పార్కులకు తొలి ప్రాధాన్యత ఇచ్చి పెండింగ్ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు.

పర్యాటక ప్రాధాన్యత ఉన్న అటవీ ప్రాంతాల్లో రకరకాల పేర్లతో సౌకర్యాలను కల్పించి పార్కుల రూపంలో అభివృద్ధి చేస్తున్నామో అదే తరహాలో పల్చబడుతున్న అడవుల్లో పచ్చదనం పెరిగేందుకు మొక్కలు నాటడం, పునరుజ్జీవనం కూడా అంతే ముఖ్యమని, అందుకు అటవీ శాఖ దృష్టి సారించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా, రోడ్లు భవనాల ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, పట్టణాభివృద్ధి శాఖ కమీషనర్ శ్రీదేవి, పర్యాటక శాఖ కార్యదర్శి దినకర్‌బాబు, జిహెచ్‌ఎంసి అదనపు కమిషనర్ ఆమ్రపాలి, పర్యాటవరణ శిక్షణ పరిశోధనా కేంద్రం డైరెక్టర్ జనరల్ కళ్యాణ్ చక్రవర్తి, ముఖ్యమంత్రి ఓఎస్‌డి ప్రియాంకా వర్గీస్, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ పి.కె.ఝూ, అటవీ అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎ.కె.జైన్ అదనపు పిసిసిఎఫ్ డోబ్రియాల్, మెట్రో రైల్ ఎండి ఎన్‌విఎస్‌రెడ్డి, రాష్ట్ర పరిశ్రమలు మౌలిక సదుపాయాల సంస్థ వైస్ చైర్మన్ నర్సింహరెడ్డిలతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పేద ప్రజల పెన్నిధి ఈశ్వరీబాయి

మన తెలంగాణ/కాచిగూడ : బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయాలకు, సిద్ధాంతాలకు పూర్తిగా అంకితమై వాటిని సాధించటానికి అవిశ్రాంతంగా కృషి చేసిన పేద ప్రజల పెన్నిధి ఈశ్వరీ బాయి అని లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ కేంద్ర మంత్రి మల్లికార్జున ఖార్గే అన్నారు. ఈ శ్వరి బాయి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యం లో ఈశ్వరీభాయ్ సెంచరీ సెలబ్రేషన్స్ బుధవారం రవీంద్రభారతిలో వైభవంగా నిర్వహించారు. ఈ కా ర్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్టీ నేత మల్లికార్జున ఖార్గే, మాజీ కేంద్రమంత్రి జైపాల్ రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి పలువురు ప్రముఖు లు పాల్గొని ఈ సందర్భంగా రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన ఈశ్వరి బాయి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఈశ్వరీబాయి మెమోరియల్ అవార్డును ప్రజా నౌక గద్దర్ దంపతులకు బహూకరించి ఘనంగా సత్కరించి ప్రసంగించారు. పేదల కష్టాలను పాట ల రూపంలో గద్ద ర్ అద్భుతంగా పాడుతారన్నారు. బాబా సాహెబ్ అంబేద్కర్ తత్వాలను ప్రచారం చేసిన వీర వనిత ఈశ్వరి బాయి అన్నారు. తెల ంగాణ కోసం ఎవరికి బయపడ కుండా ఉద్యమం చేసిన వీరనారీ, నేడు తెలంగాణ వచ్చింది అంటే ఈశ్వరి బాయి పోరాటం వల్లనే ఆయన పేర్కొ న్నారు. దళి తు లు, గరిబులు స మస్యల పరిష్కారం కోసం నిరంతరం కొట్లాడిన ప్రజా నాయకురాలు అన్నారు. పార్లమెంట్ డెమక్రసీను నాశనం చేయడానికి కొంత



మంది ప్రయత్నిస్తున్నారు, డెమక్రసీను అందరు కలిసి కాపాడుకోవాలని సూచించారు. జానారెడ్డి మాట్లాడుతూ..తరతరాల నుంచి సమా జంలో పీడనకు గురి అవుతూ, బానిసత్వంలో మగ్గుతూ అణగారిన ప్రజలకు విముక్తి కలిగించ డానికి ఆమె ఎంతగానో కృషి చేశా రన్నారు. ఈశ్వ రి బాయి శత జయం తి ఉత్సవం జరుపుతున్న గీత రెడ్డికి అభినందనలు తెలుపుతూ..గద్దర్‌కు ఈ శ్వరి బాయి మెమోరియల్ అవార్డు అందించ డం స్ఫూర్తిదాయ కం కొనియాడారు. అవార్డు అందుకున్న గద్దర్ మాట్లాడూతూ..అంబేద్కర్ ఆలోచన విధానం గొప్ప మానవీ య విధానం అన్నా రు. ప్రత్యేక తెలంగాణ ఉద్య మంలో సంపూర్ణ తెలంగాణ కోసం పోరాడిన వనిత ఈశ్వరి బాయి అన్నారు. మనందరం సంపూ ర్ణ తెలంగాణ కోసం పోరాడాలని పిలుపుని చ్చారు. నా మిగత జీవితం గ్రామ గ్రామానికి భారత రాజ్యాంగను పాటల రూపంలో తీసు కుపోత అ ని, ఈశ్వరి బాయి మెమోరియల్ ఇచ్చిన ఈ శ్వరి బా యి ట్రస్ట్‌కు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా రామలింగం రచించిన అగ్ని శిఖ ఈశ్వరీబాయి పు స్తకాన్ని, ఈశ్వరీ బాయి అమ్మ క్యాలె ం డర్ ను ఖర్గే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐసిసి ప్రధాన కార్యదర్శి వి హ నుమంత్‌రావు, ఈశ్వరి బాయి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ గీతారెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.



రిజిస్ట్రేషన్ కార్యాలయంలో కలకలం

ఐదుగురు ఉద్యోగుల సస్పెన్షన్

మన తెలంగాణ/ఆదిలాబాద్ : ప్రభుత్వ శాఖలో డబ్బులను సొంత ఖాతాలో జమచేసుకున్న కేసులో ఇప్పటికే పోలీసులు ఇద్దరిని అరెస్టు చేయగా మరో ఐదుగురు ఉద్యోగులకు రిజిస్ట్రేషన్ శాఖ కరీంనగర్ డిఐజి ట్వింకల్ జాన్ బుధవారం సస్పెన్షన్ ఆర్డర్లు అందించారు. బుధవారం డిఐజీతో పాటు అడిషనల్ డిఐజీ వెంకట్ రాజేష్‌లు కార్యాలయంలో తనిఖీ చేసి పలు కీలక పత్రాలను వారి వెంట తీసుకెళ్లారు. 2014 నుంచి 31 మే 2018 వరకు స్టాంప్‌ల విక్రయాల్లో కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ కపిల్‌కుమార్, క్యాషియర్ ఇంతియాజ్‌లు దాదాపు 78 లక్షల స్వాహా చేశారు. ఇటీవల నిర్వహించిన ఆడిట్‌లో ఈ విషయాలు బయటకు రావడంతో సబ్ రిజిస్ట్రార్ టూ టౌన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు విచారణ చేపట్టి ఇంతియాజ్‌తో పాటు కపిల్ కుమార్‌లను అరెస్టు చేశారు. కార్యాలయ ఉద్యోగుల హస్తం ఉందని విచారణ చేపట్టారు. దీంతో ఆ సమయంలో సబ్ రిజిస్ట్రార్‌గా పని చేసిన వారిపై చర్యలు చేపట్టారు. వారి పర్యవేక్షణలో ఇంత కుంభకోణం జరిగినప్పటికి పట్టించుకోలేదని క్రమ శిక్షణ చర్యలలో భాగంగా అసిస్టెంట్ రిజిస్ట్రార్ (చిట్స్) ఇమ్రాన్‌ఖాన్, భైంసా సబ్ రిజిస్ట్రారర్ సాయినాథ్, లక్షెటిపేట కార్యాయల జూనియర్ అసిస్టెంట్ అరుణ్ కుమార్, సబ్ రిజిస్ట్రార్ మనోహర్, చంద్ర శేఖర్‌లను సస్పెండ్ చేస్తూ వారికి ఉత్తర్వులు అందించారు. ఇదిలా ఉంటే ఇంత జరుగుతున్న పట్టించుకోకపోవడంతో సబ్ రిజిస్ట్రార్‌గా ఉన్న జయవంత్‌పై కమిషనర్‌కు లేఖ అందించనున్నట్లు డిఐజి ట్వింకల్ జాన్ తెలిపారు. జయవంత్‌పై క్రమ శిక్షణ చర్యల్లో భాగంగా విధుల నుంచి తప్పించి ఆయన స్థానంలో హైదరాబాద్‌లోని రిజిస్ట్రార్ కార్యాలయ రిజిస్ట్రార్ ఎం.రవీందర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇంచార్జీగా బాధ్యతలు చేపట్టిన రవీందర్ ఈ విషయంలో ఎలా స్పందిస్తారో చూడాలి.

వామ్మో.. ఆ చీరలు మాకొద్దు.!




మన తెలంగాణ/అడవిదేవులపల్లి : అడవి దేవులపల్లి గ్రామంలో ఒక వర్గానికి చెందిన సర్పంచ్ అభ్యర్థి మహిళా ఓటర్లను ఆకర్షించాలనే ఉద్దేశంతో చీరల్లో దేవుని బొమ్మ, పసుపు, కుంకుమ పెట్టి ఇవ్వడం వల్ల ఓటర్లు భయపడి బయట వేసిన సంఘటన అడవిదేవులపల్లిలో జరిగినట్లు వినికిడి. ఈ భయంతో ప్రజలు చీరలు తీసుకోవడానికి భయపడుతున్నారని గ్రామంలో గుసగుసలు వినబడుతున్నాయి. ఈ పద్ధతి సరైంది కాదని ప్రజలు వాపోతున్నట్లు సమాచారం.

గ్రామాలకు పచ్చందాలు

- త్వరలో కొత్త సొబగులు
- పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ
- సరికొత్త ప్రణాళికలతో అభివృద్ధి పనులు
- ప్రతి గ్రామానికి బీటీ రోడ్లు

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో పంచాయతీలు కొత్త సొగబులు అద్దుకోనున్నాయి. ఇక పచ్చదనంతో కళకళలాడనున్నాయి. చూడచక్కని మొక్కలతో ప్రజలకు కనువిందు చేయనున్నాయి. సరికొత్త ప్రణాళికలతో అభివృద్ధి పనులు పరుగులు తీయనున్నాయి. అద్దంలా రోడ్లు మెరవనున్నాయి. పారిశుద్ధ్యం పనులు పరుగులు పెట్టనున్నాయి. ఇటీవల ముఖ్యమంత్రి కెసిఆర్ నిర్వహించిన సమీక్షా సమావేశంలో పంచాయత్ రాజ్ శాఖ అధికారులకు దశా దిశను నిర్దేశించిన విషయం తెలిసిందే. అలాగే స్పష్టమైన హెచ్చరికలను కూడా ముఖ్యమంత్రి జారీ చేశారు. కొత్తగా తీసుకొచ్చిన పంచాయతీరాజ్ చట్టాన్ని పకడ్బందిగా అమలు చేయాలని కెసిఆర్ అధికారులను ఆదేశించారు. నిబంధనలను పాటించని ఎవరిపైనైనా చర్యలు తీసుకునే విధంగా చట్టాన్ని తీసుకొచ్చిన నేపథ్యంలో సంబంధిత అధికారులు మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆయన ఆదేశించారు. లేనిపక్షంలో కష్టాలు తప్పవని ఖరాఖండిగా హెచ్చరించారు. దీంతో అధికారుల్లో టెన్షన్ మరింతగా పెరిగిపోతోంది. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న పంచాయతీల ఎన్నికల పోరు ప్రక్రియ ఈ నెల 30వ తేదీ నాటితో ముగియనుంది. తదనంతరం గ్రామాల్లో స్థానిక పాలన కొలువుతీరనుంది. ఈ మేరకుఅవసరమైన ఏర్పాట్లను అధికారులు శరవేగంగా పూర్తి చేస్తున్నారు. ముఖ్యంగా హరితహారం కింద పెద్దఎత్తున మొక్కలను గ్రామాల్లో నాటనున్నారు. దీని కోసం ప్రత్యేకంగా ప్రతి పంచాయతీ ఒక నర్సరీ (మొక్కల పెంపు) కేంద్రాన్ని ఏర్పాటు చేసుకుంటోంది. విరివిగా మొక్కలను పెంచేందుకు అవసరమైన స్థలాల ఎంపిక ప్రక్రియ కూడా పూర్తయ్యింది. పాత పంచాయతీల కార్యాలయాల పరిధిలో ఇప్పటికే నర్సరీ కేంద్రాలు ఉండగా కొత్తగా ఏర్పాటు చేసిన నాలుగు వేల పైచిలుకు



పంచాయతీల్లో కూడా నర్సరీ కేంద్రాల కోసం స్థలాల అన్వేషణ ముమ్మరంగా కొనసాగుతోంది. పైగా మొక్కలను నాటని సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులపై చర్యలు తీసుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్త పంచాయతీరాజ్ చట్టంలో సవరణ కూడా తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని గ్రామాలు పచ్చదనంతో సరికొత్త శోభను సంతరించుకోబోతున్నాయి.

అందమైన పూల చెట్లు, మనస్సుకు ఉల్లాసం కలిగించే సుంగంధాలు వెదజల్లే మొక్కలతో పాటు రకరకాల పండ్ల మొక్కలను కూడా నాటనున్నారు. చాలా వరకు గ్రామల్లో చింత, మామిడి, వేప చెట్లు మాత్రమే దర్శనమిస్తుంటాయి. అలాగే రహదారుల వెంట పిచ్చిమొక్కలు తప్ప మరోటి కనిపించవు. ఈ నేపథ్యంలో ధనవంతులు ఉండే ప్రాంతాలకు ఏ మాత్రం తీసిపోకుండా గ్రామాల్లో కూడా పచ్చదనాన్ని పెంచాలని సిఎం కెసిఆర్ ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. స్థలాలు లభ్యమైన ప్రాంతాల్లో పార్కుల నిర్మాణాలను కూడా చేపట్టనున్నారు. ప్రస్తుత చలికాలం ముగిసి వేసవి కాలంలోకి అడుగుపెడుతున్నాం.

మరో ఐదారు మాసాల్లో వర్షాకాలం ప్రారంభం కానుంది. వర్షాలు పడే సమయానికల్లా ప్రతి పంచాయతీ పరిధిలోని ప్రాంతాల్లో పెద్దఎత్తున మొక్కలు నాటేందుకు అవసరమైన ఏర్పాట్లకు అధికారులు అధిక ప్రాధాన్యతను ఇవ్వనున్నారు. ఈ మేరకు నర్సరీ కేంద్రాల్లో పెద్దఎత్తున మొక్కలను సిద్ధం చేయనున్నారు. ఇక ప్రతి పంచాయతీ పరిధిలోని ప్రాంతాల్లో అక్కడ అపరిశుభ్రతకు తావులేకుండా పారిశుద్ధ్య పనులకు అధిక ప్రాధాన్యతను ఇవ్వనున్నారు. రహదారుల నిర్మాణానికి ఎక్కవ ప్రాముఖ్యతను ఇస్తూనే....ఉన్న రహదారుల్లో ఎలాంటి చెత్తా, చెదారం లేకుండా పారిశుద్ధ్య పనులను పరుగులు తీయించనున్నారు. ప్రతి పంచాయతీ పరిధిలో బిటి రోడ్ల సౌకర్యం ఉండే విధంగా కూడా ప్రణాళికలను రూపొందిస్తున్నారు. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారుల నుంచి గ్రామ పంచాయతీ కార్యదర్శలకు కూడా స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. ఒక వైపు ప్రజలకు అవసరమైన కనీస సౌకర్యాలపై దృష్టి సారిస్తూనే మరోవైపు గ్రామపంచాయతీలకు చెందిన స్థలాలు అన్యాకాంతం కాకుండా అవసరమైన చర్యలు కూడా తీసుకోనున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులే కాకుండా పంచాయతీలు సొంతంగా ఆర్థిక వనరులను పెంచుకునే అంశంపై మరింతగా దృష్టి సారించనున్నారు. పంచాయతీల పరిధిలో జారీ చేసే భవన నిర్మాణ అనుమతులు, ఆస్తిపన్ను వసూళ్ళపై కూడా దృష్టి సారించనున్నారు. అలాగే వీధిలైట్లు, ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన అన్ని అంశాలపై కూడా దృష్టి సారించి గ్రామ ప్రజలకు మెరుగైన పాలన అందించే విధంగా అధికారులు ప్రణాళికలను సైతం సిద్ధం చేస్తున్నారు. మంచినీటి సరఫరాతో పాటు ప్రజలకు మెరుగైన వైద్యం, పశువులకు వైద్యం లభించే విధంగా మరిన్ని ఆరోగ్య కేంద్రాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. మొత్తంగా వచ్చే నెల నుంచి గ్రామాల్లో సరికొత్త పాలనకు పంచాయతీలు శ్రీకారం చుట్టనున్నాయి.

అశ్రా ఆధ్వర్యంలో మార్చి 17న మరథాన్

మనతెలంగాణ/ హైదరాబాద్ : వరల్డ్ కన్స్యూమర్ డే సందర్భంగా మార్చి 17వ తేదీన 20వేల మందితో మర్తాన్‌ను గచ్చిబౌలి స్టేడియం వద్ద నిర్వహించనున్నట్లు అడ్వకేట్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ అండ్ అవేర్‌నెస్ (అశ్రా) ప్రతినిధులు వెల్లడించారు. బుధవారం తెలంగాణ స్టేట్ కన్స్యూమర్ డిస్ప్యూట్స్ రెడ్‌రెసాల్ కమిషన్ కార్యాలయంలో జస్టిస్ ఎం.ఎస్.కె.జైస్వాల్ చేతుల మీదుగా మర్తాన్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జస్టిస్ జైస్వాల్ మాట్లాడుతూ, వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించడం కోసం మర్తాన్‌ను నిర్వహిస్తున్నందుకు అశ్రా ప్రతినిధులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అశ్రా ఫౌండర్ చీఫ్ ప్యాట్రన్ హాబిబ్ సుల్తాన్, రాష్ట్ర అధ్యక్షులు మాసిరెడ్డి, ఉపాధ్యక్షులు సందీప్, ప్రధానకార్యదర్శి ఇప్పలపల్లి రమేశ్, ఇంచార్జ్ నారాయణతో పాటు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఇబ్బందులు లేకుండా

చర్యలు తీసుకోవాలి

మన తెలంగాణ/ హైదరాబాద్ : ఎన్నికల పోలింగ్ సమయంలో దివ్యాంగులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ప్రత్యేక సౌకర్యాలు ఏం తీసుకుంటున్నారో తెలియజేయాలని కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలను హైకోర్టు వివరాలు కోరింది. ఎన్నికలప్పుడు దివ్యాంగులు ఇబ్బందులకు గురికాకుండా చర్యలు తీసుకునేలా ఆదేశాలివ్వాలని కోరుతూ మలక్‌పేటకు చెందిన దివ్యాంగుల సంక్షేమ సంస్థ తరపున ఎం.శ్రీనివాసులు, ఇతరులు రాసిన లేఖను హైకోర్టు ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించి విచారణ జరిపింది. దివ్యాంగులు ఓటింగ్‌లో పాల్గొనేప్పుడు ఏవిధమైన సౌకర్యాలు కల్పించుతున్నారో తెలియజేయాలని ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్ కూడిన బెంచ్ ఆదేశించింది.

ప్లాస్టిక్ వాడకాన్ని నివారిద్దాం..

దేశానికే ఆదర్శంగా నిలుద్దాం

- కాలుష్యం మూలంగానే క్యాన్సర్ లాంటి ప్రమాదకరమైన వ్యాధులు
- ఆరోగ్యవంతమైన జీవితం గడపాలంటే చెట్లను పెంచాల్సిందే
- ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు



మన తెలంగాణ / సిద్దిపేట ప్రతినిధి : ప్లాస్టిక్ వాడకాన్ని నివారించి దేశానికే సిద్దిపేటను ఆదర్శంగా నిలుపుదామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని 7వ వార్డులో బుధవారం రూ. 10 లక్షల వ్యయంతో నిర్మించిన మహిళా సంఘం భవనాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. ప్రతి ఒక్కరి జీవన విధానంలో మార్పు వచ్చి ఆరోగ్యంగా ఉన్నప్పుడే అసలైన అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ప్లాసిక్, దుమ్ము దూళితో రోజురోజుకు కాలుష్యం అధికంగా పెరిగిపోవటంతోనే క్యాన్సర్ లాంటి అనేక ప్రమాదకరమైన వ్యాధులు వస్తున్నాయన్నారు. క్యాన్సర్‌కు సరైన వైద్యం లేదని దీంతో అనేక మంది తమ విలువైన ప్రాణాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే చిన్న పిల్లలకు సైతం ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధుల బారిన పడుతున్నారని అన్నారు. ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటి వాటి సంరక్షణ చేపట్టారు. ఆరోగ్యమైన జీవితం గడపాలంటే చెట్లను పెంచాల్సిందేనని అన్నారు. సిద్దిపేట ఇప్పటికే అనేక రంగాలలో ఆదర్శంగా నిలిచిందని ఇదే స్పూర్తితో కాలుష్య రహిత పట్టణంగా మార్చుకుందామన్నారు. మన ఆరోగ్యం ... మన చేతుల్లోనే అంటూ తన మిత్రులతో పాటు దాతల సహకారంతో పట్టణ వ్యాప్తంగా ప్రజలందరికీ ఉచితంగా జూట్ బ్యాగులను అందిస్తానన్నారు. అనంతరం మహిళలకు జూట్ బ్యాగులను ఉచితంగా హరీశ్‌రావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, మునిసిపల్ ఛైర్మన్ కడవేర్గు రాజనర్సు, వైస్ ఛైర్మన్ అత్తర్ పటేల్, వార్డు కౌన్సిలర్ మల్యాల ప్రశాంత్, మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ ప్రతాప్, డీఈ లక్ష్మణ్, నాయకులు మల్యాల బాలరాజు, చిప్ప ప్రభాకర్, పాల సాయిరాం, శ్రీకాంత్ గౌడ్ తదితరులు ఉన్నారు.


తాండూరు కందికి

భౌగోళిక గుర్తింపునకు కృషి

- శాస్త్రవేత్తల పరిశోధనలు



మన తెలంగాణ/వికారాబాద్ జిల్లా ప్రతినిధి : ప్రసిద్ధిగాంచిన తాండూరు ప్రాంత కందికి భౌగోళిక గుర్తింపు తెచ్చేందుకు వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశోధనలు జరుపుతున్నారు. ప్రస్తుతం బాసుమతి బియ్యానికి పంజాబ్, తేయాకు పొడికి అస్సామ్ ప్రాంతాలు ఏ విధంగా భౌగోళిక గుర్తింపు తెచ్చుకున్నాయో.. వాటి మాదిరిగానే కందికీ గుర్తింపు తెచ్చేందుకు శక్తివంచన లేకుండా ప్రయత్నాలు చేస్తున్నారు. దీనికోసం వారు చేస్తున్న పరిశోధనలు విజయవంతం కావాలని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. దశాబ్ధాల క్రితం తాండూరు ప్రాంత కంది పంటకు, కందులకు కితాబు ఇస్తూ ప్రభుత్వం, ఇతర ఉన్నత వ్యక్తులు ఇచ్చిన లిఖిత పూర్వక ప్రశంసలు ఏమైనా ఉన్నాయా.. అని ఆరా తీస్తున్నారు. రైతులకు, వ్యవసాయశాఖకు వచ్చిన అవార్డులు, రెవెన్యూశాఖలో లభ్యమైన రికార్డుల కోసం అన్వేషిస్తున్నారు. చెన్నైలోని జియాగ్రాఫికల్ ఐడెంటిటీ (భౌగోళిక గుర్తింపు సంస్థ) ఇనిస్టిట్యూట్‌కు సమగ్ర వివరాలు, ఆధారాలు అందజేయాల్సి ఉంటుంది. ఈ గుర్తింపు లభిస్తే తాండూరు కందికి భలే డిమాండ్ వస్తుందని వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుధాకర్ తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి మంచి ఆర్డర్లు వచ్చి ధరలు కూడా అనూహ్యంగా పెరుగుతాయని చెప్పారు. తాండూరు ప్రాంతంలో కందికి అనుకూలమైన వాతావరణం, మంచి నల్లరేగడి నేలల వల్ల నాణ్యమైన కందులు దిగుబడి సాధిస్తున్నారు. ఖరీఫ్ మాసం ఆరంభం జూన్ నుంచి డిసెంబరు మాసం వరకు సమతుల్యమైన వాతావరణం నెలకొంటుంది. సమపాళ్లలో వర్షాలు, చలి, ఎండ వల్ల కందుల దిగుబడులు సాధ్యమవుతున్నాయి. ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల వరకు పండిస్తున్నారు. వర్షాభావ పరిస్థితుల్లో కూడా ఎకరాకు 4 నుంచి 6 క్వింటాళ్లు సాధిస్తున్నారు. ఇంతటి ఘనత దేశంలో ఎక్కడా లేదని చెబుతున్నారు. ఒకవేళ మంచి దిగుబడులు సాధించినా తాండూరు కంది మాదిరిగా నాణ్యత ఉండదని స్పష్టం చేస్తున్నారు. ప్రతి యేటా తాండూరు ప్రాంతంలో 8 నుంచి 10 లక్షల క్వింటాళ్ల కందులు దిగుబడులు సాధిస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలతో పాటు కమీషన్ ఏజెంట్లు కూడా కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు రవాణా చేస్తున్నారు.



అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తా

-కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే పువ్వాడ అజయ్

మన తెలంగాణ / ఖమ్మం కార్పొరేషన్ : ఖమ్మం నియోజకవర్గానికి రెండవ సారి ప్రాతినిధ్యం వహించడం గర్వంగా బావిస్తున్నానని, నగర అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార అన్నారు. నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం బుధవారం మేయర్ పాపాలాల్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, అధికార పార్టీ కార్పొరేటర్లు, ప్రతిపక్ష కార్పొరేటర్లు హాజరయ్యారు. తొలుత ఈ మధ్య కాలంలో మృతిచెందిన కౌన్సిలర్లు పాలెపు అక్కమ్మ, గుంటి మల్లయ్య, పిట్టల రాంచందర్‌రావులకు రెండు నిమిషాలు మౌనం పాటించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం రెండవసారి శాసనసభ్యునిగా గెలుపొందిన సందర్భంగా మేయర్, పలువురు కార్పొరేటర్లు, ఎమ్మెల్యే అజయ్‌కుమార్‌ను శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సన్మానించారు. కౌన్సిల్ సమావేశాన్నిద్దేశించి ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ మొదటి సారికంటే రెండవ సారి శాసనసభ్యునిగా ఎన్నికవ్వడం గొప్పవిశేషమని, తాను కొందరి వాడిని కాదు అందరివాడినని నగర ప్రజలు తాను చేసిన అభివృద్ధి కార్యక్రమాలను చూసి రెండవసారి ఎమ్మెల్యేగా గెలిపించినందుకు రాబోయే ఐదు సంవత్సరాల్లో రాజకీయాలకతీతంగా పనిచేసి అభివృద్ధికి తోడ్పడతానని తెలిపారు. వెయ్యి కోట్ల బడ్జెట్‌తో నగరంలోని ఐటి హబ్‌ను పూర్తి చేసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. నగర సుందరీకరణకు కావల్సిన నిధులను తేవడానికి తెలంగాణ ప్రభుత్వం సుముఖంగా ఉందని అధికారులు అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని సూచించారు.



ప్రస్తుతం నా దృష్టి అంతా సినిమాలపైనే ఉంది. ఒకవేళ వివాహం చేసుకోవాల్సిన సమయం వస్తే చిత్ర పరిశ్రమకు చెందిన వ్యక్తిని పెళ్లి చేసుకోను. నాకు చిత్ర పరిశ్రమలో ఎందరో స్నేహితులు ఉన్నారు... కానీ వాళ్లలో ఎవరినీ జీవిత భాగస్వామిగా ఊహించుకోలేదు.

– స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్

సినిమా

క్రికెట్ నేర్చుకుంటున్న రణవీర్

బాలీవుడ్‌లో ఈమధ్య కాలంలో స్పోర్ట్స్ నేపథ్యంలో వరుసగా చిత్రాలు వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా రణవీర్ సింగ్ హీరోగా '83' అనే క్రికెట్ నేపథ్య చిత్రం తెరకెక్కబోతోంది. 1983 సంవత్సరంలో కపిల్‌దేవ్ సారథ్యంలో ఇండియా ప్రపంచ కప్ గెలుచుకున్న విషయం తెలిసిందే. ఆ నేపథ్యంలో ఈ సినిమాను చిత్రీకరించబోతున్నారు. కపిల్‌దేవ్ పాత్రను రణవీర్ సింగ్ పోషించనుండగా ఈ చిత్రానికి కబీర్‌ఖాన్ దర్శకత్వం వహించబోతున్నాడు. ప్రస్తుతం ముంబయ్‌లో రణవీర్ సింగ్ క్రికెట్ ట్రైనింగ్ తీసుకుంటున్నాడు. త్వరలోనే సినిమాకు సంబంధించిన ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ఏప్రిల్ 10వ తేదీన గుడ్‌ఫ్రైడే సందర్భంగా విడుదల చేయబోతున్నట్లు సినిమా యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రాన్ని హిందీతో పాటు తెలుగు, తమిళ్‌లో కూడా తెరకెక్కించబోతున్నారు. కీలక పాత్రల్లో పలువురు సౌత్ స్టార్స్ కనిపించబోతున్నట్లు సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది



రణవీర్ సింగ్

ఆత్మవిమర్శ చేసుకోవడం మంచిది



Akhil

అక్కినేని అఖిల్ హీరోగా 'తొలిప్రేమ' ఫేమ్ వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మిస్టర్ మజ్ను'. నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హీరో అఖిల్‌తో ఇంటర్వ్యూ విశేషాలు...

ఛాలెంజింగ్‌గా అనిపించింది

క్యారెక్టర్ బేస్డ్ ఫిల్మ్ 'మిస్టర్ మజ్ను'. ఈ క్యారెక్టరైజేషన్ నాకు ఛాలెంజింగ్‌గా అనిపించింది. ఈ కథ వినగానే నచ్చేసింది. నేను ఇంతకుముందు చేసిన రెండు సినిమాలకు పూర్తిగా విభిన్నమైన చిత్రమిది. సినిమాలో మంచి వినోదంతో పాటు విభిన్నమైన భావోద్వేగాలు కూడా ఉంటాయి.

ఆ సినిమాల ప్రేరణతోనే...

దర్శకుడు వెంకీ నాకు పది సంవత్సరాల నుంచి తెలుసు. కామన్ ఫ్రెండ్స్ ద్వారా చాలా సార్లు కలిశాం. 'మిస్టర్ మజ్ను' సినిమా తర్వాత మంచి స్నేహితులమయ్యాం. వెంకీ గుడ్ డైరెక్టరే కాదు గుడ్ రైటర్ కూడా. అతను మా డాడీకి పెద్ద ఫ్యాన్. డాడి చేసిన నిన్నే పెళ్లాడతా, మన్మథుడు సినిమాల ప్రేరణతోనే అతను ఈ సినిమా చేశాడు.

వేగంగా పూర్తయింది

అఖిల్, హలో చిత్రాల కంటే ఈ సినిమా తొందరగా పూర్తయింది. ఫుల్ స్క్రిప్ట్‌తో వెంకీ సిద్ధంగా ఉండడం వల్లే సినిమా వేగంగా పూర్తయింది. అయితే అఖిల్, హలో సినిమాల స్క్రిప్ట్ వర్క్, షూటింగ్‌కు ఎక్కువ సమయం పట్టింది.

చాలా వర్క్ చేశాము

ఈ సినిమాలో నా బాడీ లాంగ్వేజ్, యాక్షన్... ఇలా ప్రతి విషయంలో కొత్తగా కనిపించాలనే ఉద్దేశ్యంతో వెంకీ, నేను చాలా వర్క్ చేశాము. ఈ విషయం గురించే 'మజ్ను' ఆడియో ఈవెంట్‌లో తారక్ అన్నయ్య చెప్పారు. ఎప్పటికప్పుడు మనం ఆత్మవిమర్శ చేసుకోవడం మంచిది.

మోడ్రన్ మజ్ను..

ఈ సినిమాకు 'మిస్టర్ మజ్ను' అని పెట్టడానికి ప్రత్యేకమైన కారణాలు ఏమీ లేవు. ఒక మోడ్రన్ మజ్నును చూపించబోతున్నామని దర్శకుడు వెంకీ మజ్నుకు ముందు మిస్టర్ అని పెట్టడం జరిగింది. మొత్తానికి మజ్ను అనే టైటిల్ బాగా కలిసొచ్చింది మా ఫ్యామిలీకి.

అన్ని రకాల భావోద్వేగాలు.

ఇందులో లవ్‌స్టోరీతో పాటు యాక్షన్ పార్ట్ కూడా ఉంటుంది. మూడు ఫైట్స్ ఉంటాయి. అలాగే సినిమాలో నాకు, నా బాబాయ్, పిన్నీకి మధ్య వచ్చే సీన్ చాలా బాగుంటుంది. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ సినిమాలో అన్ని రకాల భావోద్వేగాలు ఉంటాయి.

నెక్స్ట లెవెల్‌కు

ఒక లవ్‌స్టోరీకి మ్యూజిక్ ఎంత ముఖ్యమో తెలిసిందే. ఈ మేరకు తమన్ సినిమాకు అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. అతని మ్యూజిక్ సినిమాను నెక్స్ లెవెల్‌కు తీసుకువెళ్తుంది.

కథ నచ్చితే మల్టీస్టారర్ చేస్తా

ప్రస్తుతం నా దృష్టి అంతా 'మిస్టర్ మజ్ను'పైనే ఉంది. ఈ సినిమా విడుదలైన తర్వాత నా నెక్స్ట సినిమా గురించి ఆలోచిస్తా. ఇక గతంలో ఓ మల్టీస్టారర్ చేయమని అడిగారు. కానీ అప్పుడు చేయడం కరెక్ట్ కాదని చేయలేదు. అయితే కథ నచ్చితే భవిష్యత్తులో మల్టీస్టారర్ చేస్తాను.

కొరటాల శివతో సినిమా ఓకే

ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవి 'సైరా' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. భారీ అంచనాలతో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని రామ్‌చరణ్ స్వయంగా నిర్మిస్తున్న విషయం తెలిసిందే. సురేందర్ రెడ్డి దర్శకత్వంలో భారీ తారాగణంతో ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. దీని తర్వాత కొరటాల శివ దర్శకత్వంలో సినిమా చేయడానికి చిరంజీవి ఓకే చెప్పిన విషయం తెలిసిందే. ఈ కారణంగానే 'భరత్ అనే నేను' చిత్రం తర్వాత ఎనిమిది నెలలు గ్యాప్ వచ్చినా చిరుతో చేసే ఛాన్స్ వదులుకోకూడదు అనే ఉద్దేశ్యంతో కొరటాల ఈ స్క్రిప్ట్ మీదే వర్క్ చేస్తున్నారు. అయితే కొరటాల శివ చెప్పిన స్టోరీ లైన్ చిరంజీవికి నచ్చలేదని మొత్తం మార్చి వేరేది రాయమని చెప్పారని ప్రచారం జరిగింది. ఆతర్వాత ఈ సినిమా ఓకే అయ్యే ఛాన్స్‌లు లేవని అన్నారు. ఈ విషయం కాస్త రామ్‌చరణ్‌కు తెలిసింది. దీనిపై స్పందించిన చరణ్... ఎట్టి పరిస్థితుల్లోనూ కొరటాల శివ సినిమా నాన్నతో ఉంటుందని, కొన్ని కీలక మార్పుల గురించి మాత్రమే వాళ్లు చర్చించుకున్నారని... అంతే తప్ప వాయిదా, రద్దు లాంటి ఆలోచనలు ఏమీ లేవని తేల్చి చెప్పినట్టు సమాచారం. అయితే సినిమా ప్రారంభం కావడానికి కొంత సమయం కావాలని మాత్రం రామ్‌చరణ్ చెప్పినట్టు తెలిసింది. కొరటాల శివ సోషల్ మెసేజ్‌తో పాటు కమర్షియల్ అంశాలు ఏవీ మిస్ కాకుండా జాగ్రత్తగా స్క్రిప్ట్ సిద్ధం చేశారని... చిరు చెప్పిన మార్పులు పూర్తయిన తర్వాత సినిమా సెట్స్‌పైకి వెళ్లేందుకు మహూర్తం నిర్ణయిస్తారని తెలిసింది. కాబట్టి చిరంజీవి, కొరటాల కాంబినేషన్ మూవీకి ఎలాంటి అడ్డంకులు లేనట్టే. లొకేషన్స్ వెతికే పనితో పాటు హీరోయిన్ల ఎంపికపై కొరటాల శివ ఇప్పటికే వర్క్ ప్రారంభించినట్టు సమాచారం.



చిరంజీవి

వచ్చే నెల 11న పెళ్లి



సౌందర్య రజనీకాంత్

సౌతిండియా సూపర్‌స్టార్ రజనీకాంత్ కూతురు సౌందర్య రజనీకాంత్ మళ్లీ పెళ్లి చేసుకోబోతున్నారు. వచ్చే నెల 11న ఆమె రెండో పెళ్లి చేసుకోబోతున్నట్టు తెలిసింది. చెన్నైలోని ఒక స్టార్ హోటల్‌లో ఈ పెళ్లి జరుగనుందని సమాచారం. వ్యాపారవేత్త, నటుడు విశాగన్ వనంగమూడిని ఆమె పెళ్లి చేసుకోనుంది. ఈ పెళ్లి ఏర్పాట్లలో రజనీకాంత్ కుటుంబం నిమగ్నమైంది. గత ఏడాదిలోనే వీరి ఎంగేజ్‌మెంట్ జరిగింది. ఫిబ్రవరి 9వ తేదీ నుంచే సౌందర్య వివాహ వేడుక మొదలవుతుందని... ఫిబ్రవరి 11 వరకు ఈ వేడుక ఉంటుందని తెలిసింది. మెహందీ, సంగీత్ కార్యక్రమాలతో కలిపి మూడు రోజుల పాటు వివాహ వేడుక కొనసాగుతుంది. ఓ ఫార్మా కంపెనీ యజమాని అయిన విశాగన్ 'వంజగర్ ఉళగమ్' అనే తమిళ చిత్రంలో నటించాడు. ఇక 2010లో అశ్విన్ అనే వ్యాపారవేత్తను పెళ్లి చేసుకున్న సౌందర్య 2017లో విడాకులు తీసుకుంది. వీరిద్దరికీ ఓ కుమారుడు ఉన్నాడు.

ప్రారంభమైన 'ఇస్మార్ట్ శంకర్'



ఛార్మి, రామ్, పూరీ జగన్నాథ్

యంగ్ హీరో రామ్, దర్శకుడు పూరీ జగన్నాథ్ కలయికలో వస్తున్న తొలి చిత్రం ప్రారంభమైంది. 'ఇస్మార్ట్ శంకర్' అనే టైటిల్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి హీరోయిన్ ఛార్మి కౌర్ క్లాప్ కొట్టగా... తొలి షాట్‌ను హీరో రామ్‌పై తెరకెక్కించారు. స్రవంతి రవికిషోర్ కెమెరా స్విచాన్ చేశారు. ఈ సినిమాలో రామ్ సరికొత్త లుక్‌లో కనిపించనుండగా గురువారం నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాకు మణిశర్మ సంగీతాన్ని సమకూరుస్తుండగా రాజ్ తోట సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. ఈ సినిమాలో పునీత్ ఇస్సార్, సత్యదేవ్, మిలింద్ గునాజి, ఆశిష్ విద్యార్థి, గెటప్ శ్రీను ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. పూరీ జగన్నాథ్ టూరింగ్ టాకీస్, పూరీ కనెక్ట్స్ పతాకాలపై పూరీ జగన్నాథ్, ఛార్మి సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాను మే నెలలో విడుదల చేయాలని ప్లాన్ చేశారు. ఈ చిత్రానికి ఎడిటర్: జునైద్ సిద్దిఖీ, ఆర్ట్: జానీ షైక్, పాటలు: భాస్కరభట్ల, ఫైట్స్: రియల్ సతీష్.



డేటింగ్‌లో సారా



సారా అలీఖాన్

సుశాంత్ సింగ్ రాజ్‌పుత్, సారా అలీఖాన్ జంటగా నటించిన 'కేదార్‌నాథ్'పై వచ్చిన వివాదాల సంగతేమో కానీ ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించింది. ఈ చిత్రంలో సుశాంత్, సారాల మధ్య కెమిస్ట్రీకి మంచి స్పందన వచ్చింది. ఇదిలాఉంటే ఈ జంట రియల్ లైఫ్‌లో కూడా ప్రేమలో పడ్డారనే వార్తలు ఇప్పుడు బాలీవుడ్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. సుశాంత్, సారా డేటింగ్ చేస్తున్నారని తెలిసింది. ఈమధ్య సుశాంత్ తన 33వ పుట్టిన రోజును జరుపుకుంటే సారా తన డెహ్రాడూన్ ట్రిప్‌ను కుదించుకొని మరీ ఈ బర్త్‌డే పార్టీకి హాజరైందట. బర్త్ డే రోజు రాత్రి సుశాంత్ అపార్ట్‌మెంట్ దగ్గర కేక్‌తో సారా ప్రత్యక్షమైందని అంటున్నారు. ఆ కేక్ కటింగ్ అయిన తర్వాత ఇద్దరూ కలిసి డిన్నర్‌కు వెళ్లారట. ఆతర్వాత సారాను భద్రంగా వాళ్ల ఇంటి దగ్గర దింపి మరీ సుశాంత్ తన ఇంటికి వెళ్లాడట. దీంతో ఇది కొత్త బాలీవుడ్ ప్రేమ జంట అనే వార్తలు బాలీవుడ్‌లో మీడియాలో సందడి చేస్తున్నాయి.

మైనస్ 2 డిగ్రీల చలిలో పాట!

గత ఏడాది 'ఛలో'తో ఓ బ్లాక్‌బస్టర్‌ను 'గీత గోవిందం'తో ఓ ఇండస్ట్రీ హిట్‌ను తన ఖాతాలో వేసుకున్న హీరోయిన్ రష్మిక మందన్నకు టాలీవుడ్‌లో మంచి క్రేజ్ ఉంది. ఆతర్వాత చేసిన 'దేవదాస్' చిత్రం సక్సెస్‌ను అందుకోలేకపోయింది. ఇక వెంకీ కుడుముల దర్శకత్వంలో నితిన్‌కు జోడీగా రష్మిక ఓ సినిమా చేయనుంది. దీంతో పాటు కన్నడ సినిమాలతో ఆమె బిజీగా ఉంది. ఇటీవల అక్కడ స్టార్ హీరో దర్శన్‌తో 'యజమాన' అనే సినిమాలో నటించింది. అందులో ఓ పాటను స్వీడన్‌లో చిత్రీకరించారు. మంచు దట్టంగా కురుస్తూ అసలు మనుషులు కనిపించలేనంత పొగ కమ్ముకున్న వాతావరణంలో మైనస్ 2 డిగ్రీల చలిలో ఈ పాటను చిత్రీకరించారట. సినిమా యూనిట్ మొత్తం గజగజ వణుకుతున్నా దర్శన్, రష్మికలు మాత్రం ఈ పాటలో హుషారుగా స్టెప్పులు వేయడంతో అందరూ షాక్ అయ్యారట. ఈ పాట తన కెరీర్‌లో సమ్‌థింగ్ స్పెషల్‌గా నిలుస్తుందని రష్మిక పేర్కొంది.



రష్మిక మందన్న

గత కొంతకాలంగా బాలీవుడ్ హాట్ భామ మలైకా అరోరా యంగ్ హీరో అర్జున్ కపూర్‌తో ఎఫైర్ సాగిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఎఫైర్‌లో నెక్స్ ఇక పెళ్లి చేసుకోవడమే అంటూ ప్రచారం సాగుతోంది. మలైకా, అర్జున్‌ల రొమాన్స్‌పై బాలీవుడ్ మీడియాలో పుష్కలంగా కథనాలు వస్తున్నాయి. అయితే మలైకా ఎఫైర్ విషయం బయటి ప్రపంచానికి ఎలా తెలిసింది? ఈ వ్యవహారం మలైకా భర్త అర్బాజ్ ఖాన్‌కు ఎలా తెలిసింది? అంటే దీనికి సంబంధించిన ఓ టాప్ సీక్రెట్ బయటకు వచ్చింది. మలైకా సీక్రెట్స్ అన్నింటినీ ఎప్పటికప్పుడు ఆమె కారు డ్రైవర్ స్వయంగా బయ

డ్రైవర్ వల్లే సీక్రెట్ తెలిసింది

టకు లీక్ చేసేవాడట. మలైకా వద్ద పనిచేసే కారు డ్రైవర్ ముఖేష్, అర్బాజ్ ఖాన్ దగ్గర పని చేసే బబ్లూ ఇద్దరూ అన్నదమ్ములు. మలైకా ఏం చేసినా దానిని ముఖేష్ తన తమ్ముడు బబ్లూకి చెప్పేవాడు. బబ్లూ వెళ్లి అర్బాజ్‌కు ఈ విషయం చెప్పేవాడు. అలా మలైకా ఎఫైర్ విషయం తెలిసిపోయింది. దీంతో అర్బాజ్, మలైకా మధ్య చిచ్చు రేగి వారి కాపురంలో కల్లోలం తప్పలేదు. ఇదిలాఉండగా మలైకా, అర్జున్ తొందరలోనే పెళ్లి చేసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. పెళ్లికి ముందే ముంబయ్‌లో ఓ ఖరీదైన ప్రాంతంలో లగ్జరీ అపార్ట్‌మెంట్‌ను కొనుగోలు చేసేందుకు వాళ్లు సిద్ధమవుతున్నారు.



మలైకా అరోరా

నెక్, చికెన్ ధరలు రూపాయల్లో

టోకు గుడ్లు	రూ. 410
రిటైల్ గుడ్డు	రూ. 4.50
ఫారమ్ కోడి	రూ. 120
డ్రెస్డ్ స్కిన్ చికెన్	రూ. 190
స్కిన్‌లెస్	రూ. 200

నగర రోడ్లపైకి కొత్త వ్యాగన్ ఆర్ కారు

రత్నముఖర్జీకి తొలి కారును అందజేసిన వరుణ్ మోటార్స్



మన తెలంగాణ/హైదరాబాద్ : అధునాతన ఫీచర్లతో మార్కెట్‌లోకి కొత్తగా వచ్చిన 'ది బిగ్ న్యూ వ్యాగన్ ఆర్' కారును బేగంపేట్‌లోని మారుతి సుజుకీ షోరూమ్ రత్న ముఖర్జి అనే వినియోగదారురాలికి బుధవారం అందజేశారు. ఇండస్ మోటార్స్ ఛైర్మన్ పి.వి. అబ్దుల్ వాహెబ్, వరుణ్ మోటార్స్ ఛైర్మన్ వి. ప్రభు కిషోర్, మారుతీ సుజుకీ రీజినల్ మేనేజర్ అనింద్యా దత్తా తదితరులు ఇందులో పాల్గొన్నారు. వినియోగదారుల అభిరుచికి అనుగుణంగా, అనేక ఫీచర్లతో పాటు ప్రయాణంలో కారులో ఉన్నవారి భద్రతను దృష్టిలో పెట్టుకుని మరికొన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు మారుతీ సుజుకీ రీజినల్ మేనేజర్ పేర్కొన్నారు. తొలి నుంచీ వ్యాగన్ ఆర్ కారుకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని, అయితే అదనపు ఫీచర్లను జోడించినందున మార్కెట్ విస్తరిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇప్పటికే రోడ్లమీద తిరుగుతున్న మోడళ్ళకు కొన్ని మార్పులు చేయడం ద్వారా 1.2 ఎల్‌కె సిరీస్ పెట్రోజల్ ఇంజన్ కారు 21.5 కి.మీ. మైలేజ్ ఇచ్చేలా రూపొందించినట్లు తెలిపారు.

1.0 ఎల్‌కె సిరీస్ పెట్రోల్ ఇంజన్ కారు లీటరు పెట్రోలుకు 22.5 కి.మీ. మైలేజీ ఇస్తుందని పేర్కొన్నారు. తొలి కారును రత్నా ముఖర్జీకి అందజేసిన కార్యక్రమంలో వరుణ్ మోటార్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.సి. రాజు, డైరెక్టర్ డి.కె. రాజు, ఏజిఎం రామ్‌కుమార్, ఎస్ఎం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్లోకి టాటా హారియర్ ఎస్‌యువి



కోల్‌కతా: టాటామోటార్స్ ఎట్టకేలకు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్న ఎస్‌యువి మోడల్ 'హారియర్'ను లాంచ్ చేసింది. ల్యాండ్‌రోవర్ ఓమెగా ఆర్క్ ప్లాట్‌ఫామ్‌పై నిర్మించిన హారియర్ ఎస్‌యువి వాహనం ధర 12.69 లక్షల నుంచి రూ.16.25 లక్షల వరకు ఉంటుంది. టాటా మోటార్స్ ఎండి గుంటెర్ బుట్చేక్, టాటా మోటార్స్ ప్రెసిడెంట్ మయాంక్ ఫరేక్‌లు బుధవారం దీనిని ఆవిష్కరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో టాటా మోటార్స్ మార్కెట్లోకి విడుదల చేసిన నాలుగో కారు ఈ మోడల్.. ఈ కొత్త కారు మొత్తం నాలుగు వేరియంట్లలో లభిస్తుంది. ఎక్స్ఈ, ఎక్స్ఎం, ఎక్స్‌టి, ఎక్స్‌జెడ్ అనే వేరియంట్లలో ఇది లభ్యమవుతుంది. ఈ కారులో నాలుగు సిలెండర్ల 2.0 లీటర్ టర్బోఛార్జ్‌డ్ డీజిల్ ఇంజిన్‌ను అమర్చారు. ఈ ఇంజిన్ 350 ఎన్ఎం టార్క్‌ను 138 బిహెచ్‌పి శక్తిని విడుదల చేస్తుంది. దీనిలో 6 స్పీడ్ మ్యాన్యువల్ గేర్‌బాక్స్‌ను అమర్చగా, దీనిలో ఎకో, సిటీ, స్పోర్టప్స్ అనే డ్రైవింగ్ మోడ్‌లనూ అందుబాటులోకి తీసుకొచ్చారు. 7 అంగుళాల టిఎఫ్‌టి ఇనుస్ట్రుమెంట్ క్లస్టర్, తొమ్మిది జెబిఎల్ స్పీకర్లు, 8.8 అంగుళాల ఫ్లోటింగ్ టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ వంటివి ఈ మోడల్ ప్రత్యేకతలుగా చెప్పవచ్చు. ఈ కారు 16 అంగుళాల స్టీల్ వీల్స్, 17 అంగుళాల అలాయ్ వీల్స్‌తో లభ్యమవుతుంది.

వొడాఫోన్ ఐడియా రూ.25 వేల కోట్ల రైట్స్ ఇష్యూ



న్యూఢిల్లీ: రైట్స్ ఇష్యూ ద్వారా రూ.25 వేల కోట్లు సమీకరించేందుకు వొడాఫోన్ ఇండియా బోర్డు ఆమోదం తెలిపింది. 2016లో రిలయన్స్ జియో టెలికామ్ రంగంలోకి ప్రవేశించడంతో ఈ సంస్థకు గట్టి పోటీ ఎదుదైంది. అదే సమయంలో పోటీని తట్టుకోలేక సంస్థ నష్టాలను నమోదు చేస్తోంది. సెప్టెంబర్ త్రైమాసికంలో వోడాఫోన్ ఐడియా రూ.4,970 కోట్ల నష్టాన్ని ప్రకటించింది. స్పెక్ట్రమ్ చెల్లింపులు చేసేందుకు, 4జి నెట్‌వర్క్ కోసం సంస్థ నిధుల అవరసరం ఏర్పడింది. దీనికి గాను వొడాఫోన్ ఐడియా బోర్డు సమావేశమై..ఈక్విటీ షేర్ హోల్డర్లకు రైట్స్ ఇష్యూ ద్వారా రూ.25 వేల కోట్లు సేకరించేందుకు ఆమోదం తెలిపింది. ఈమేరకు రెగ్యులేటరీ ఫైలింగ్‌లో కంపెనీ పేర్కొంది. నవంబర్‌లో ఏర్పాటు చేసిన మూలధన పెంపు కమిటీ సిఫారసులకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు కంపెనీ వెల్లడించింది.

75 శాతం క్షీణించిన ఇండిగో లాభం



న్యూఢిల్లీ: క్రూడ్ ఆయిల్ ధరలు పెరగడం, తీవ్రమైన పోటీ వాతావరణం కారణంగా క్యూ3(అక్టోబర్-డిసెంబర్) ఫలితాల్లో ప్రైవేటు విమానయాన సంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ లాభం 75 శాతం క్షీణించింది. సంస్థ లాభం రూ.191 కోట్లు నమోదవ్వగా, గతేడాది ఇదే సమయంలో కంపెనీ లాభం రూ.762 కోట్లుగా ఉంది. రెవెన్యూ రూ.7,916 కోట్లతో 28 శాతం పెరిగింది. ముడి చమురు ధరలు పెరగడం, తీవ్రమైన పోటీ వాతావరణం కంపెనీని దెబ్బతీశాయి.

అంచనాలను అందుకోలేదు

క్యూ3లో ఐటిసి లాభం రూ.3,209 కోట్లు • ఆదాయం రూ.11,128 కోట్లతో 15 శాతం వృద్ధి



న్యూఢిల్లీ : డిసెంబర్ ముగింపు నాటి క్యూ3(అక్టోబర్-డిసెంబర్) ఫలితాల్లో ఎఫ్ఎంసిజి దిగ్గజం ఐటిసి అంచనాలను అందుకోలేకపోయింది. సిగరెట్ నుంచి హోటల్ వరకు పలు రకాల వ్యాపారాలు కల్గిన ఐటిసి సంస్థ రూ. 3,209 కోట్లతో నికర లాభం 4 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేసింది. గతేడాది ఇదే సమయంలో సంస్థ లాభం రూ.3,090 కోట్లుగా ఉంది. అయితే మార్జిన్లు అంచనాలను అందుకోలేకపోయాయి. నికర అమ్మకాలు రూ.11,431 కోట్లతో 15 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేయగా, గతేడాది అమ్మకాలు రూ.9,952 కోట్లుగా ఉన్నాయి. సంస్థ మొత్తం ఆదాయం 15 శాతం పెరిగి రూ.11,128 కోట్లకు చేరింది. ఇబిటా 11శాతం వృద్ధి చెంది రూ. 4326 కోట్లను సాధించగా, ఇబిటా మార్జిన్లు మాత్రం 39.8 శాతం నుంచి 38.5 శాతానికి పరిమితయ్యాయి. అలాగే సిగరెట్ల వ్యాపారానికి చెందిన ఇబిటా 8.8 శాతం వృద్ధిని సాధించినప్పటికీ, మార్జిన్లు 70.6 శాతం నుంచి 70.1 శాతానికి తగ్గాయి. క్యూ3 ఫలితాలు అంచనాలను అందుకోలేకపోవడంతో ఫలితాల వెల్లడి తర్వాత మార్కెట్లో కంపెనీ షేరు విలువ 4.75 శాతం పతనమైంది. ఆఖరికి సంస్థ షేరు విలువ రూ.276 వద్ద స్థిరపడింది.షేరు ఏడాది కనిష్ట, గరిష్ట ధరలు వరుసగా రూ. 251.30 రూ.322.70లుగా ఉన్నాయి.

ఇబిటా గణాంకాలు

వడ్డీ పన్ను తరుగుదల, రుణ విమోచనకు ముందు ఆదాయాలు(ఇబిటా) 11.23 శాతం వార్షిక వృద్ధితో రూ. 4,326 కోట్లను నమోదు చేయగా, గతేడాది ఇదే సమయంలో రూ.3,889 కోట్లుగా ఉన్నాయి. ఇబిటా మార్జిన్లు మాత్రం 39.80 శాతం నుంచి 38.50 శాతానికి పరిమితయ్యాయి. అలాగే సిగరెట్ల వ్యాపారానికి చెందిన ఇబిటా 8.8 శాతం వృద్ధిని సాధించినప్పటికీ, మార్జిన్లు 70.6 శాతం నుంచి 70.1 శాతానికి తగ్గాయి.

విభాగాల పనితీరు

2018–19 ఆర్థిక సంవత్సరంలో సిగరెట్ విభాగం నుంచి ఆదాయం రూ.5,073 కోట్లతో 10 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేసింది. హోటల్, వ్యవసాయ వ్యాపారం నుంచి వరుసగా రూ.451.86 కోట్లు, రూ.1924.61 కోట్లు ఆదాయం వచ్చింది. అంటే హోటల్ వ్యాపారం నుంచి 11.72 శాతం, వ్యవసాయ వ్యాపారం నుంచి 25.72 శాతం వృద్ధిని చూపింది.

ఇతర ఆదాయం


2018 డిసెంబర్ ముగింపు నాటి త్రైమాసికంలో ఐటిసి ఇతర ఆదాయం రూ.836.39 కోట్లతో 30 శాతం వార్షిక వృద్ధిని సాధించింది. గతేడాది ఈ ఆదాయం రూ.642 కోట్లుగానే ఉంది.

ఇపిఎస్(ఎర్నింగ్ ఫర్ షేర్)

డిసెంబర్ ముగింపు నాటి త్రైమాసికంలో సంస్థ ఇపిఎస్ 2.62 శాతం నమోదవగా, గతేడాది ఇదే సమయంలో 2.54 శాతంగా ఉంది.

చివరి గంటలో తారుమారు

అమ్మకాల ఒత్తిడితో భారీగా నష్టపోయిన మార్కెట్లు • 336 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్



ముంబై: దేశీయ స్టాక్‌మార్కెట్లు బుధవారం తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. ఆఖరి సమయంలో అమ్మకాల ఒత్తిడితో భారీగా నష్టపోయాయి. ఐటిసి ఫలితాలు అంచనాల మేరకు లేకపోవడంతో షేరు అమ్మకాలు వెల్లువెత్తాయి. దీంతో చివరి గంటలో మార్కెట్లు కుదేలయ్యాయి. క్యూ3 ఫలితాల్లో ఐటిసి నికర లాభం 4 శాతం పెరిగి, మొత్తం ఆదాయం 15 శాతం పెరిగిది. అయితే మార్జిన్లు నిరాశపరచడంతో ఈ ఎఫ్ఎంసిజి బ్లూచిప్ కౌంటర్లో అమ్మకాలు వెల్లువెత్తాయి. దీంతో సెంటిమెంటు బలహీనపడగా, రోజంతా సూచీలు హెచ్చుతగ్గులకు లోనయ్యాయి. మరోవైపు పిఎస్‌యు బ్యాంక్స్, ఆటో, ప్రైవేట్ బ్యాంక్స్, ఐటి రంగాలు కూడా 1.4 నుంచి 0.7 శాతం మధ్య క్షీణించాయి. దీంతో సెన్సెక్స్ 400 పాయింట్ల వరకూ పతనమై ఓ దశలో 36,040 పాయింట్ల కనిష్టాన్ని తాకింది. మార్కెట్ ముగిసే సమయానికి 336 పాయింట్లు కోల్పోయి 36,108 వద్ద నిలిచింది. నిఫ్టీ 91 పాయింట్లు నష్టపోయా 10,831 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఇలో మీడియా 1.3 శాతం, మెటల్, ఫార్మా రంగాలు 0.6 శాతం చొప్పున లాభపడ్డాయి. నిఫ్టీ దిగ్గజాలలో ఐటిసి దాదాపు 5 శాతం పతనమైంది. ఇంకా గ్రాసిమ్, ఐబీ హౌసింగ్, టైటన్, ఎం అండ్ ఎం, ఇన్ఫోసిస్, అదానీ పోర్ట్స్, కొటక్ బ్యాంక్, ఎస్‌బిఐ, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ 3 నుంచి 1.4 శాతం మధ్య క్షీణించాయి. అయితే సన్ ఫార్మా, యస్ బ్యాంక్, టాటా స్టీల్, విప్రో, జీ, బజాజ్ ఫిన్, టెక్ మహీంద్రాలాభపడ్డాయి. బిఎస్ఇ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు 0.25 శాతం బలహీనపడ్డాయి. ట్రేడైన మొత్తం షేర్లలో 1,472 నష్టపోగా, 1,073 లాభాలతో ముగిశాయి. నగదు విభాగంలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పిఐలు) రూ. 78.5 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించాయి. దేశీ ఫండ్స్(డిఐఐలు) రూ. 84 కోట్లను ఇన్వెస్ట్ చేశాయి.

ఎయిర్ ఇండియా మాజీ చీఫ్ జాదవ్‌పై సిబిఐ కేసు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా మాజీ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అరవింద్ జాదవ్‌పై సిబిఐ కేసు నమోదు చేసింది. ఎయిర్ ఇండియా నియామకాల్లో అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో ఆయనపై సిబిఐ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది. ఇంకా జాదవ్‌తో పాటు ఎయిర్ ఇండియా మాజీ సీనియర్ ఉద్యోగులపై కూడా సిబిఐ కేసు నమోదు చేసింది. కాగా కెప్టెన్ ఎ.కథ్‌పాలియా, కెప్టెన్ అమితాబ్ సింగ్, కెప్టెన్ రోహిత్ భాసిన్, అప్పటి ఎయిరిండియా జనరల్ మేనేజర్‌లకు ప్రయోజనాలు చేకూర్చేలా జాదవ్ నియామకాలు చేపట్టారని ఆరోపణలు ఉన్నాయి.

స్వల్పంగా తగ్గిన పసిడి ధర



ముంబై: బంగారం ధర కాస్త తగ్గింది. బుధవారం అంతర్జాతీయ పరిణామాల కారణంగా పది గ్రాముల పసిడి ధర రూ.115 తగ్గి రూ.33,210కి చేరింది. దేశీయంగా నగల వ్యాపారుల నుంచి డిమాండ్ లేకపోవడంతో బంగారం ధర తగ్గుతోందని బులియన్ ట్రేడింగ్ వర్గాలు వెల్లడించాయి. 99.9 శాతం స్వచ్ఛత పసిడి ధర రూ.33,210గా ఉండగా, 99.5 శాతం పసిడి ధర రూ.33,060గా ఉంది. మరోవైపు వెండి ధర మాత్రం పెరిగింది. రూ.310 పెరగడంతో కిలో వెండి రూ.40,160కి చేరింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల దగ్గర నుంచి డిమాండ్ లభించడంతో వెండి ధర పెరిగినట్లు ట్రేడర్లు చెబుతున్నారు. గ్లోబల్ మార్కెట్లో బంగారం ధర 0.11శాతం తగ్గడంతో ఔన్సు 1,284.30డాలర్లు పలికింది. వెండి 0.16శాతం పెరగడంతో ఔన్సు 15.43డాలర్లు పలుకుతోంది.

చేతులెత్తేసిన 16 బ్యాంకులు

రూ.1.16 లక్షల కోట్లు రికవరీ చేయలేని పరిస్థితి



న్యూఢిల్లీ: మొండి బకాయిల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ఎన్ని చట్టాలు చేపట్టినా వాటిని సమర్థవంతంగా అమలు చేస్తేనే ఫలితం దక్కుతుంది. డెట్ రికవరీ ట్రిబ్యునల్, దివాలా చట్టం వంటివాటిని వినియోగించినా ఫలితం లేకపోవడంతో రూ.1.16 లక్షల కోట్ల రుణ బకాయిలను రికవరీ చేయలేక 16 బ్యాంకు లు చేతులెత్తేశాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2018-19)లో ఈ రుణాలను రికవరీ చేయలేకపోయాయి. 2016 ఐబిసి(దివాలాచట్టం)వేగవంతమైన యంత్రాంగాన్ని తీసుకొచ్చినా, ఆలస్య తీర్మాణాలు బ్యాంకులను విక్రయించేందుకు ఒత్తిడి తెస్తున్నాయి. ఈ రుణ మొత్తాలను బ్యాంకులు వసూలు చేయలేకపోతున్నాయి. దీంతో చివరి అస్త్రంగా వీటిని అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఎఆర్‌సి)లకు అమ్ముకుని బ్యాంకులు చేతులు దులుపుకుంటున్నాయి. గత వారం ఎస్‌బిఐ ఎస్సార్ స్టీల్‌కు ఇచ్చిన రూ 15,000 కోట్ల రుణాలను 18 శాతం రాయితీతో విక్రయించి మార్కెట్ వర్గాలను విస్మయానికి గురిచేసింది. డిస్కౌంట్‌కు తాము రుణాలను విక్రయించినా బ్యాంకుకు రూ 9,500 కోట్ల నగదు లభించిందని, ఇది ఇతరులకు రుణాలు ఇచ్చేందుకు వెసులుబాటు కలిగిస్తుందని ఎస్‌బిఐ చైర్మన్ రజనీష్ కుమార్ అన్నారు. రుణాలు పేరుకుపోతే దానికి కేటాయింపులూ పెరుగుతాయని, మూలధనం ఎక్కువకాలం నిలిచిఉండటం మంచిదికాదని ఆయన చెప్పుకొచ్చారు. 62 ఖాతాలకు చెందిన రూ 27,953 కోట్ల రుణాలను ఎస్‌బిఐ వేలం ప్రక్రియలో అమ్మకానికి ఉంచింది. ఇక బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా రూ 29,801 కోట్ల రుణాలను అమ్మకానికి పెట్టాయి. కెనరా బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్, దేనా బ్యాంక్‌లూ నిరర్థక ఆస్తుల విక్రయానికి మొగ్గుచూపుతున్నాయి. ఈ తరహా రుణాలను కొనుగోలు చేసేందుకు డచ్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ అమెరికా, హెడ్జ్ ఫండ్స్‌లు ఆసక్తి చూపుతున్నాయి. ఇప్పటివరకు 12 భారీ డిఫాల్ట్ కేసుల్లో మూడు మాత్రమే దివాలా చట్టం కింద పరిష్కరించారు. వాటిలో భూషణ్ స్టీల్, మొన్నెట్ ఇస్పాత్ అండ్ ఎనర్జీ, బినాని సిమెంట్ ఉన్నాయి. ఎస్సార్ స్టీల్‌కు 500 రోజులకు పైగా సమయం తీసుకోవడంతో బ్యాంకులు ఆస్తులను విక్రయించాయి.


స్టాక్ మార్కెట్

ఈ రోజు మార్కెట్ ముగింపు		మార్పు	%
సెన్సెక్స్	36108.47	-336.17	(-0.92%)
నిఫ్టీ	10831.50	-91.25	(-0.84%)

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	71.14
యూరో	80.86
బ్రిటిష్ పౌండ్	92.23
ఆస్ట్రేలియన్ డాలర్	50.75
కెనెడియన్ డాలర్	53.36
సింగపూర్ డాలర్	52.33
స్విస్ ఫ్రాంక్	71.33
చైనీస్ యువాన్	10.47
మలేషియన్ రింగిట్	17.21
న్యూజిలాండ్ డాలర్	48.18
హాంకాంగ్ డాలర్	9.07
జపనీస్ యెన్	0.65
కువైట్ దినార్	234.79
సౌతాఫ్రికన్ రాండ్	5.10

బులియన్




బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు) 22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	30930	33080.21	0.36%
ముంబై	31720	33925.13	0.5%
ఢిల్లీ	31600	33796.79	0.32%
కోల్‌కతా	31990	34213.90	0.53%
కేరళ	30100	32192.51	0.33%
బెంగళూరు	30250	32352.94	0%
హైదరాబాద్	30930	33080.21	0.36%
గల్ఫ్	136.51	146.00	0.17%

వెండి ధర (రూ./ కిలో)

చెన్నై	₹ 42300.00
ముంబై	₹ 42300.00
ఢిల్లీ	₹ 42300.00
కోల్‌కతా	₹ 42300.00
హైదరాబాద్	₹ 42300.00



టాప్ గెయినర్స్ (+)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	లాభం%
సన్ ఫార్మా	434.40	411.65	431.00	418.95	12.05	2.88
యస్ బ్యాంక్	199.50	193.65	197.25	192.20	5.05	2.63
జీ ఎంటర్‌టైన్	439.80	423.80	432.85	425.25	7.60	1.79
టాటా స్టీల్	467.85	457.00	464.60	456.55	8.05	1.76
విప్రో	355.80	348.00	351.55	346.50	5.05	1.46
జెఎస్‌డబ్ల్యూ స్టీల్	284.90	277.20	280.90	278.00	2.90	1.04
హెచ్‌యుఎల్	1,784.05	1,749.40	1,767.20	1,750.20	17.00	0.97
బిపిసిఎల్	358.65	354.40	357.15	353.80	3.35	0.95
హిండల్కో	207.30	203.45	205.45	203.55	1.90	0.93
టెక్ మహీంద్రా	725.90	711.00	720.70	714.20	6.50	0.91

టాప్ లూజర్స్ (-)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	నష్టం%
ఐటిసి	294.40	275.00	277.30	289.75	12.45	4.30
గ్రాసిమ్	806.50	777.00	782.15	804.35	22.20	2.76
ఇండియాబుల్స్ హెచ్ఎస్‌జి	806.25	774.25	778.70	797.35	18.65	2.34
టైటాన్ కంపెనీ	987.40	957.60	962.15	982.65	20.50	2.09
ఇన్ఫోసిస్	742.60	729.20	731.65	745.35	13.70	1.84
ఎం అండ్ ఎం	709.75	693.60	695.85	708.50	12.65	1.79
పవర్ గ్రిడ్ కార్పో	191.50	185.70	186.30	189.70	3.40	1.79
ఎన్‌టిపిసి	143.60	140.30	140.75	142.80	2.05	1.44
హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్	2,135.85	2,101.45	2,105.40	2,135.85	30.45	1.43
అదానీ పోర్ట్	392.00	383.60	385.20	390.60	5.40	1.38



బాల్‌థాకరే స్మారకానికి భూమిపూజ

పాల్గొన్న మహా సిఎం ఫడ్నవీస్, ఉద్ధవ్ థాకరే

ముంబయి: శివసేన వ్యవస్థాపకుడు బాల్‌థాకరే 93వ జయంతి సందర్భంగా ఆయన స్మారక చిహ్నం నిర్మాణానికి బుధవారం భూమి పూజ జరిగింది. ఇటీవల ఎడమొహం, పెడమొహంగా ఉన్నమిత్రపక్ష నాయకులు... మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, శివసేన అధ్యక్షుడు ఉద్ధవ్ థాకరే ఈ పూజా కార్యక్రమంలో కలిసి పాల్గొనడం విశేషం. ఇద్దరూ కలిసి స్మారక చిహ్నం నిర్మించే స్థలంలో గణపతి పూజ, వాస్తు పూజ చేశారు. సెంట్రల్ ముంబయిలో శివాజీ పార్క్ దగ్గర బాల్ థాకరే స్మారక నిర్మాణానికి స్థలం కేటాయించారు. కేంద్రంలోనూ, మహారాష్ట్రలోనూ భారతీయజనతా పార్టీకి భాగస్వామిగా ఉన్న శివసేన ఈమధ్య ప్రభుత్వ పథకాల విషయంలో కాషాయదళంతో తరచు విభేదిస్తోంది. ఈ నేపథ్యంలో రెండు పార్టీల నాయకులూ కలిసి కనిపించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. బాల్‌థాకరే స్మారక చిహ్నం నిర్మాణానికి మంగళవారంనాడు మహారాష్ట్ర కేబినెట్ రూ. 100 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం తెలిపింది. త్వరలోనే లోక్‌సభ ఎన్నికలు జరగబోతున్నాయి కనుక, శివసేనను బుజ్జగించేందుకు బిజెపి ప్రభుత్వం ఈ పథకం వేసిందని అనుకుంటున్నారు. భూమి పూజ సందర్భంగా స్మారక చిహ్నం నిర్మించబోయే స్థలాన్ని నగర పాలక సంస్థ, ఆ నిర్మాణాన్ని చేపట్టిన ట్రస్ట్‌కు అధికారికంగా బదిలీ చేసింది.

మత్తులో ఉండి కిందపడ్డారు

న్యూయార్క్: కాలిఫోర్నియాలో యోసెమైట్ నేషనల్ పార్క్‌లో నిటారుగా, ఎత్తుగా ఉన్న ఒక గుట్టపై నిలబడి సెల్ఫీ తీసుకుంటున్న ఒక భారతీయ జంట ఆ సమయంలో మత్తులో ఉండడంవల్లే కిందపడి మరణించారని శవపరీక్షలో వెల్లడైంది. ఈ సంఘటన గత అక్టోబర్‌లో జరిగింది. అక్టోబర్ 25న 800 అడుగుల ఎత్తునుంచి కిందపడి మరణించిన విష్ణువిశ్వనాథ్, ఆయన భార్య మీనాక్షి మూర్తి ఈథైల్ ఆల్కహాల్ సేవించి ఉన్నారని, అయితే వారి శరీరాల్లో ఏ మాదక ద్రవ్యం లేదని శవపరీక్ష నివేదిక వెల్లడించింది. బీర్, వైన్ వంటి ఆల్కహాల్ బెవరేజెస్‌లో ఈథైల్ ఆల్కహాల్ ఉంటుంది. అయితే, ఆ శరీరాల పరిస్థితినిబట్టి చూస్తే ఆ జంట చాలా ఎత్తు నుంచి కిందపడ్డారు కాబట్టి ఎంత మోతాదులో వారి దేహాల్లో మత్తు ఉందనేది దర్యాప్తు చేస్తున్నవారు కచ్చితంగా చెప్పలేకపోతున్నారని అసిస్టెంట్ మారీపోసా కౌంటీ కారోనర్ ఆండ్రియా స్టీవార్ట్ అన్నారు.

షుజాపై కేసు నమోదు

న్యూఢిల్లీ : ఇవిఎంల హ్యాకింగ్, ఎన్నికల రిగ్గింగ్ ఆరోపణలకు దిగిన సైబర్ నిపుణుడు సయ్యద్ షుజాపై ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలింగ్ యంత్రాల ట్యాంపరింగ్ జరిగిందనే ఆరోపణలపై ఎన్నికల సంఘం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎఫ్‌ఐఆర్ దాఖలు చేసినట్లు ఢిల్లీ పోలీసు అధికారి ఒకరు బుధవారం తెలిపారు. భయాందోళనలు రేకెత్తించడం, ప్రజలను మోసగించడం వంటి ఉద్దేశాలతో ఇటువంటి తప్పుడు అభియోగాలకు దిగారని ఎన్నికల సంఘం ఒక్కరోజు క్రితం స్థానిక పార్లమెంట్ స్ట్రీట్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీని మేరకు ఐపిసి 505 సెక్షన్ పరిధిలో కేసు దాఖలు చేసినట్లు పోలీసు అధికారి తెలిపారు. చట్ట ప్రకారం తదుదపరి చర్య తీసుకుంటామని వివరించారు. లండన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సయ్యద్ షుజా ఇవిఎంల పనితీరుపై పలు తీవ్రస్థాయి ఆరోపణలకు దిగారు. గత లోక్‌సభ ఎన్నికలలో రిగ్గింగ్ జరిగిందని, ఇవిఎంలను హ్యాకింగ్ చేయవచ్చునని తెలిపారు. తప్పుదోవ పట్టించే విధంగా ఆరోపణలకు దిగడం ద్వారా వ్యవస్థ పట్ల అపనమ్మకం కల్పించేందుకు యత్నిస్తున్న వారిపై సరైన విధంగా సమగ్ర దర్యాప్తు జరిపించాలని ఎన్నికల సంఘం తమ ఫిర్యాదులో తెలిపింది.

పాఠశాలలో పెచ్చులూడి విద్యార్థులకు గాయాలు



మన తెలంగాణ/సంగారెడ్డి/జిన్నారం, గుమ్మడిదల : సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం గడ్డపోతారం గ్రామ ప్రాథమిక పాఠశాల 5వ తరగతి పైకప్పు పెచ్చులూడి విద్యార్థుల మీద పడి ఇద్దరు గాయాలపాలైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది . ప్రాథమిక పాఠశాల 5వ తరగతి గది పైకప్పు పెచ్చులూడి విద్యార్థులపై పడింది. ఇద్దరు విద్యార్థులు గాయాల పాలయ్యారు. ఈ మధ్యనే (సుమారు 3 సంవత్సరాలు మాత్రమే) నిర్మించిన కొత్త గదిలో ఇలా జరగడంతో వాటి నిర్మాణం ఎంత నాసిరకంగా జరిగిందో అర్థం అవుతోంది. ఇంత నాసిరకంగా నిర్మించిన గుత్తేదారుపై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లితండ్రులు డిమాండ్ చేసారు. మా పిల్లల ప్రాణాలు పోయుంటే ఎవరు బాధ్యత వహించే వారని వారు నిలదీసారు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు రాఘవయ్య మాట్లాడుతూ జరిగిన విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకువెళతామని తెలిపారు.

వికలాంగ అభ్యర్థులకు 28 నుంచి ధ్రువీకరణ పరీక్షలు



మన తెలంగాణ / హైదరాబాద్ : గ్రామ రెవిన్యూ అధికారి పోస్టుల భర్తీ కోసం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో అర్హత సాధించిన వివిధ రకాల వికలాంగ అభ్యర్థులకు ఈ నెల 28 నుంచి మూడు రోజుల పాటు అంగవైకల్య ధ్రువీకరణ పరీక్షలను నిర్వహించనున్నట్లు కమిషన్ డిప్యూటీ కార్యదర్శి ఒక ప్రకటనలో తెలియజేశారు. అంధ అభ్యర్థులు ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు ప్రభుత్వ సరోజినీదేవి కంటి వైద్య కళాశాలలో ఉదయం పది గంటల నుంచి పరీక్షలు చేయించుకోవాలని, వినికిడి లోపంతో ఉన్న అభ్యర్థులు కోఠిలోని ఇఎన్‌టి ఆసుపత్రిలో, ఇతర వైకల్యం ఉన్న అభ్యర్థులు ఉస్మానియా జనరల్ ఆసుపత్రిలో ధ్రువీకరణ పరీక్షలు చేయించుకోవాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

28, 31 తేదీల్లో 'నైతిక విలువల' పరీక్ష

ఉత్తీర్ణులైతేనే ఇంటర్ పాస్ సర్టిఫికెట్లు

మన తెలంగాణ / హైదరాబాద్ : ఇంటర్ విద్యార్థులకు ఈ నెల 28, 31 తేదీల్లో 'నైతిక విలువలు', 'మానవ విలువలు', 'పర్యావరణ విద్య' అనే సబ్జెక్టుల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు ఇంటర్ బోర్డు కార్యదర్శి బుధవారం జారీ చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్‌లో అన్ని పరీక్షల్లో ఉత్తీర్ణులైనప్పటికీ ఈ పరీక్షలకు హాజరై ఉత్తీర్ణులైతేనే 'పాస్ సర్టిఫికెట్లు' ఇస్తామని స్పష్టం చేశారు. ఈ నెల 28, 31 తేదీల్లో ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. పర్యావరణ విద్య అనే అంశాన్ని సమైక్య రాష్ట్రం 2006లో 'తప్పనిసరి' సబ్జెక్టు చేసిందని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014 నుంచి 'నైతిక విలువలు', 'మానవ విలువలు' అనే సబ్జెక్టులను తప్పనిసరి చేసిందని ఆ ప్రకటనలో గుర్తుచేశారు. అన్ని పరీక్షల్లో ఉత్తీర్ణులైనప్పటికీ ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించనట్లయితే ఇంటర్ బోర్డు వారికి పాస్ సర్టిఫికెట్లను ఇవ్వడం సాధ్యం కాదని, అందువల్ల విద్యార్థులు ఈ ప్రాధాన్యతను గుర్తించి తప్పకుండా ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుందని నొక్కి చెప్పారు. బ్యాక్‌లాగ్ విద్యార్థులు వారి పాత హాల్ టికెట్ల ఆధారంగానే ఆయా కళాశాలల తరఫున ఈ పరీక్షలకు హాజరుకావచ్చని పేర్కొన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి ఈ పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించేలా ఇంటర్ బోర్డు నిర్ణయం తీసుకుందని, పరీక్ష రోజున ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్ళు ఆన్‌లైన్ ద్వారానే ప్రశ్నా పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆ ప్రకటనలో ఇంటర్ బోర్డు కార్యదర్శి పేర్కొన్నారు.

'రూటు' మార్చిన బంగారం స్మగ్లర్లు

- హైదరాబాద్ వరకు విదేశీ సర్వీసులు
- ఇక్కడి నుంచి దేశీయ సర్వీసుల్లో రవాణా
- తనిఖీలు లేని ఎయిర్‌పోర్ట్‌లలో బంగారం అప్పగింత
- స్మగ్లింగ్‌లో ఎయిర్ ఇండియా ఉద్యోగుల పాత్ర
- పట్టుబడిన బంగారం కన్నా వదిలేసిందే ఎక్కువ



మన తెలంగాణ/హైదరాబాద్: విదేశాల నుంచి బంగారం అక్రమంగా తరలించే స్మగ్లర్లు రూటు మారుస్తున్నారు. విదేశాల నుంచి అంతర్జాతీయ సర్వీసుగా వచ్చి దేశంలోకి ప్రవేశించిన అనంతరం దేశీయ సర్వీసులుగా మారే విమానాలను ఎంచుకుని సాగుతున్న అక్రమ రవాణా సాగిస్తున్నారు. దుబాయి, షార్జా, మలేషియా, సింగపూర్ ,మస్కట్, సౌదీ అరేబీయా తదితర దేశాల నుంచి భారత్‌లోకి ప్రవేశించే వరకు అంతర్జాతీయ సర్వీసుగా ఉండే విమానాలు దేశంలోకి రాగానే డొమెస్టిక్‌గా మారతాయి. ఈక్రమంలో విమానంలోని బాత్‌రూమ్స్‌లోని రహస్య ప్రదేశాల్లో బంగారం దాచేసి స్మగ్లర్లు విమానం దిగిపోతారు. అపై బంగారం దాచిన ప్రదేశాన్ని దేశీయంగా ప్రయాణించే తమ ముఠా సభ్యులకు సమాచారం అందిస్తారు. అదే విమానంలో ప్రయాణించే వ్యక్తి టాయ్‌లెట్స్‌లో దాచిన బంగారం తీసుకుని గమ్యస్థానం చేరగానే కస్టమ్స్ తనిఖీలు లేకుండా బయటకు వచ్చేస్తాడు. ఇటీవల కాలంలో దుబాయ్ నుంచి ఇటర్నేషనల్ సర్వీసుగా బెంగళూరు వచ్చిన పై కొలంబియా వెళ్లి చెన్నకు తిరిగి వచ్చి డొమెస్టిక్ సర్వీసుగా ఆ విమానం మారింది. అందులోకి టాయ్‌లెట్స్‌లోని అద్దాల వెనుక స్మగ్లర్లు రూ.60లక్షల బంగారం (30కడ్డీలను) అమర్చారు. ఈ విమానం ఈనెల 13న చెన్నై నుంచి పూణే వెళ్లింది.. తదుపరి పుణే నుంచి చెన్నై. చెన్నై నుంచి హైదరాబాద్, హైదరాబాద్ నుంచి రాయ్‌పూర్, రాయ్‌పూర్ నుంచి ఢిల్లీ వెళ్లింది. అనంతరం ఢిల్లీ నుంచి అమృతసర్, అమృత సర్ నుంచి బెంగళూరుల్లో దేశీయంగా తిరిగింది. అయినా విమానంలోని బంగారాన్ని ఎవ్వరూ గుర్తించలేదు. ఈనెల 17న విమానం ఢిల్లీ చేరుకున్న సమయంలో కస్టమ్స్ అధికారులు సమాచారం అందుకుని తనిఖీ చేయగా బంగారం గుట్టు వెలుగు చూసింది. మరికొన్ని ప్రాంతాల్లో బంగారం తరలించే స్మగ్లర్లు మయన్మార్ నుంచి ఇంపాల్ అటు నుంచి గుహవాటికి చేరుకుంటున్నారు. అక్కడి నుంచి రైలు, రోడ్ మార్గంలో కోల్‌కత, భువనేశ్వర్, వైజాగ్ మీదుగా హైదరాబాద్‌కు తరలిరిస్తున్నట్లు పోలీసు అధికారులు వివరిస్తున్నారు. వైజాగ్ నుంచి రోడ్డు మార్గంలో విజయవాడ, నెల్లూరు తదితర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. గుహవాటి నుంచి కిషన్ గంజ్ మీదుగా చెన్నై, బెంగళూరు ప్రాంతాలకు రోడ్ మార్గంలో బంగారం తరలిస్తు పట్టుబడిన ఘటనలు ఉన్నాయి. వెరసి గుహవాటి నుంచి రైలు, రోడ్ మార్గంలో బంగారం తరలిస్తున్నారని పోలీసు వర్గాలు భావిస్తున్నాయి. ఇటీవల కాలంలో రెండు కిలోల బంగారాన్ని అక్రమంగా రవాణా చేస్తుండగా శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో డిఆర్‌ఐ అధికారులు పట్టుకున్నారు. బంగారం రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్ట్ చేసి రూ.66.27 లక్షల విలువైన బంగారం బిస్కెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఇండోర్ నుంచి హైదరాబాద్ వస్తున్న 6ఈ648 విమానంలో ఓ ప్రయాణీకుడు అక్రమంగా బంగారం రవాణా చేస్తున్నట్లు డిఆర్‌ఐ అధికారులకు సమాచారం అందింది. బూట్లలో బంగారం బిస్కెట్లను తీసుకువస్తుండగా పట్టుకున్నారు. తనిఖీలలో 1996.70గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడి వ్యక్తి వద్ద నకిలీ ఆధార్ కార్డు లభ్యమైంది. షార్జా నుంచి తిరువనంతపురం వెళ్తున్న మరో ప్రయాణీకుడు విమానంలో వదిలివెళ్లిన బంగారాన్ని తాను తీసుకువస్తున్నట్లు నిందితుడు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడించినట్లు డిఆర్‌ఐ అధికారులు వివరిస్తున్నారు. గౌహతి నుంచి హైదరాబాద్ వచ్చిన స్పైస్ జెట్ ఫ్లైట్ నంబర్. ఎస్జీ 464 వచ్చిన ఇద్దరు ప్రయాణీకులు బంగారాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు అధికారులకు సమాచారం అందటంతో తనిఖీ చేయగా రెండు కడ్డీలను గుర్తించారు. వాటికి వెండి పూత పూసి తరలిస్తుండగా పట్టుబడ్డారు. వీటి విలువ 31.68,000 వరకు ఉంటుందని అధికారులు తెలిపారు. స్టమ్స్ యాక్ట్ 1962 కింద నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈనెల 7వ తారీఖున ఎయిర్‌పోర్ట్‌లో ఒక ప్రయాణికుడి నుంచి 830గ్రాముల బంగారం స్వాధీనం చేసుకన్నారు. బంగారానికి సంబంధించిన సరైన ప్రతాలు చూపని కారణంగా సిఐఎస్‌ఎఫ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గత ఏడాది డిసెంబర్ నెలలో శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌లో 400 బంగారు బిస్కెట్లను ఎయిర్‌పోర్ట్ ఉద్యోగి నుంచి స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ బహిరంగ మార్కెట్‌లో 1.34 కోట్ల మేరకు ఉంటుందని డిఆర్‌ఐ అధికారులు వివరించారు. 194 గ్రాముల బంగారంతో పాటు 3.60లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఎయిర్ ఇండియా ఉద్యోగితో పాటు మరో ఇద్దరు స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నారు. .అబుదాబీ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన విమానంలో ఓ ప్రయాణీకుని నుంచి 1399.2 గ్రాముల 12 బంగారం బిస్కెట్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన బంగారం విలువ 44లక్షల రూపాయలు ఉంటుందని డిఆర్‌ఐఅధికారులు తెలియజేశారు.దుబాయి, షార్జా, మలేషియా, సింగపూర్ తదితర దేశాల నుంచి హైదరాబాద్‌కు అక్కడి నుంచి డొమెస్టిల్ విమానాల్లో ముంబైకి అక్రమమార్గాల్లో తరలుతున్న బంగారం స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నట్లు కస్టమ్స్ అధికారులు వివరిస్తున్నారు.దుబాయ్ నుంచి బంగారం తీసుకుని వచ్చి శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌లో పట్టుబడిన గ్యాంగ్‌లను కస్టమ్స్‌అధికారులు విచారించగా ఆసక్తికరమైన విషయాలు వెలుగు చూశాయి. దుబాయ్ కి చెందిన బంగారం స్మగ్లర్లు తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాల్లోని అక్రమ బంగారం కొనుగోలు దారులతో చేతులు కలిపి అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. దుబాయ్‌లోని వ్యాపారులు పథకం ప్రకారం హైదరాబాద్‌కు వస్తున్న వ్యక్తులను ఎంపిక చేసుకుని వారికి డబ్బు ఆశచూపించి బంగారాన్ని హైదరాబాద్‌కు చేరవేస్తున్నారని శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు పేర్కొంటున్నారు. విమానాలలో ప్రయాణీకుల దగ్గర పట్టుబడిన బంగారం కంటే విమానాల్లో వదిలేసిన బంగారం అధికంగా ఉంటుందని అధికారులు వివరిస్తున్నారు. ఎయిర్‌పోర్టుల్లో అంచెలంచెలుగా సిఐఎస్‌ఎఫ్, కస్టమ్స్, డిఆర్‌ఐ అధికారులు తనిఖీలకు భయపడి స్మగ్లర్లు బంగారన్ని విమానంలోనే వదిలేసిపోతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. స్మగ్లింగ్ ముఠాల సభ్యులు ఎయిర్‌పోర్ట్‌లో జరిగే తనిఖీలను వాట్సప్, ఫోన్ రూపంలో అందజేస్తున్న కారణంగా స్మగ్లర్లు బంగారాన్ని విమానాల్లో వదిలివేస్తున్నట్లు తమ విచారణలో తేలిందని కస్టమ్స్ అధికారులు పేర్కొంటున్నారు.

పీయూష్‌కు అదనంగా ఆర్థికం



న్యూఢిల్లీ : రైల్వే మంత్రి పీయూష్ గోయల్‌కు కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు బుధవారం రాష్ట్రపతి భవన్ నుంచి అధికారిక ప్రకటన వెలువడింది. క్యాన్సర్ చికిత్సకు అమెరికాకు వెళ్లిన ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీకి న్యూయార్క్‌లో శస్త్ర చికిత్స జరిగింది. ఆయనకు రెండు వారాల విశ్రాంతి అవసరం ఉంది. ఫిబ్రవరి 1వ తేదీన ఓటాన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టాల్సి ఉంది. ఈ దశలో గోయల్‌కు ఆర్థిక బాధ్యతలు అప్పగిసుతన్నట్లు ప్రకటన వెలువడింది. ఆర్థిక మంత్రి అస్వస్థతతో ప్రధాని సలహా మేరకు జైట్లీ నిర్వహిస్తోన్న ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మం త్రిత్వ శాఖ బాధ్యతలను అదనంగా పీయూష్ గోయల్‌కు అప్పగించడం జరిగిందని అధికారిక ప్రకటనలో తెలిపారు. గోయల్ ప్రస్తుతం రైల్వే మంత్రిత్వశాఖ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికలకు ముందటి అత్యంత కీలకమైన బడ్జెట్ సమర్పణకు ఇంకా వారం రోజుల గడువే ఉంది. ప్రస్తుతానికి గోయల్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్నుట్లు తెలిపిన ప్రకటనలో బడ్జెట్‌ను ఏ మంత్రి ప్రవేశపెడుతారు? అనేది వెల్లడించలేదు. అయితే సత్వరమే కోలుకుని జైట్లీనే తిరిగి వచ్చి బడ్జెట్‌ను సమర్పించడం జరుగుతుందని, లేకపోతే సాంకేతికంగా ఇబ్బంది ఉండకూడదనే పీయూష్‌కు ఈ బాధ్యత కట్టబెట్టారని భావిస్తున్నారు. అనారోగ్యంతో సెలవుపై వెళ్లిన జైట్లికి ఈ దశలో ఎటువంటి మంత్రిత్వశాఖల బాధ్యత లేని మంత్రిగా పేర్కొంటూ రాష్ట్రపతిభనవ్ ప్రకటనలో తెలిపారు. ఆయన తిరిగి బాధ్యతలు తీసుకునే వరకూ ఇదే పద్ధతి ఉంటుంది. ఆర్థిక మంత్రిత్వశాఖ తాత్కాలిక బాధ్యతను పియూష్ స్వీకరించడం ఇది రెండోసారి. గత ఏడాది మే నెలలో కిడ్నీ మార్పిడికి అమెరికాకు వెళ్లినప్పుడు కూడా పియూష్‌కు ఆర్థిక మంత్రిత్వశాఖ అప్పగించారు. గత ఏడాది ఆగస్టులో జైట్లీ తిరిగి ఆర్థిక శాఖను తీసుకున్నారు. ఆర్థిక మంత్రిగా విశేషానుభవం ఉండి, పలు సార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన జైట్లీ సారథ్యంలోనే ఈసారి బడ్జెట్ ఉండాలని, కీలక ఎన్నికల సమయంలో దీనిపై ప్రజలలో సరైన సంకేతాలు వెలువడాలని ప్రధాని మోడీ ఆశిస్తున్నారు.

నేడు జంట శాటిలైట్స్ ప్రయోగం

కౌంట్‌డౌన్ ప్రారంభం

బెంగళూరు : నేడు (గురువారం) మైక్రోశాట్, కలాం శాట్ ఉపగ్రహాలు నింగిలోకి దూసుకువెళ్లనున్నాయి. విజయాద్భుతాల దిశలో ఉన్న భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) వీటిని శ్రీహరికోట నుంచి పిఎస్‌ఎల్‌వి – సి 44 నుంచి ప్రయోగించనుంది. గురువారం రాత్రి 11 గంటల ప్రాంతంలో జరపతలపెట్టిన ప్రయోగానికి బుధవారం కౌంట్‌డౌన్ ఆరంభం అయింది. డిఆర్‌డిఒ వారు రూపొందించిన మైక్రోశాట్ ఆర్ ఇమేజింగ్ శాటిలైట్‌గా కక్ష్యలోకి వెళ్లుతుంది. ఇక ఇస్రో రూపొందించిన తొలి స్టూడెంట్ శాటిలైట్‌కు కలామ్‌శాట్ అని పేరు పెట్టారు. నూతనమైన పిఎస్‌ఎల్‌వి తరహా రాకెట్ నుంచి మొత్తం 700 కిలోల బరువైన ఈ రెండు ఉపగ్రహాలను ప్రయోగించడం జరుగుతుందని , వాతావరణ అనుకూలతను బట్టి పరీక్ష సమయం తెల్లవారుజామున ఖరారు అవుతుందని ఇస్రో ఛైర్మన్ కె శివన్ తెలిపారు. చైన్నైకు చెందిన స్పేస్ కిడ్జ్ ఇండియా వారు తమ సొంత పరిజ్ఞానంతో కలామ్‌శాట్‌ను రూపొందించారు.ఈ ఏడాది మొత్తం 32 అంతరిక్ష ప్రయోగాలు చేపడుతామని సంవత్సర ఆరంభంలో శివన్ తెలిపారు. అందులో భాగంగా ఇప్పుడు ఈ రెండు కీలక సూక్ష్మ స్థాయి ఉపగ్రహాల ప్రయోగం జరుగుతుంది. ఉపగ్రహాలను కక్ష్యలోకి తీసుకువెళ్లే పిఎస్‌ఎల్‌వి శ్రేణిలో ఇప్పుడు అందుబాటులోకి తెచ్చే పిఎస్‌ఎల్‌వి సి 44 సరికొత్తది అని, ఇది అత్యంత అధునాతన ప్రక్రియతో ఉటుందని, ఇంజిన్ సామర్థ్యం ఇతరత్రా పలు విధాలుగా నూతనత్వం సంతరించుకుంటుందని ఇస్రో ఛైర్మన్ తెలిపారు.



9 మంది ఐసిస్‌ల అరెస్టు

వీరిలో ఓ బాలుడు

ముంబై : ఐసిస్‌తో సంబంధాల అనుమానాలపై మహారాష్ట్రలో తొమ్మండుగురిని అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు మహారాష్ట్ర ఉగ్రవాద నిరోధక దళం (ఎటిఎస్) రంగంలోకి దిగింది. తాము ఒక బాలుడితో పాటు మొత్తం తొమ్మండుగురిని అరెస్టు చేసినట్లు ఈ దళం బుధవారం తెలిపింది. ముంబ్రా, థానే, ఔరంగాబాద్ నుంచి వీరిని అదుపులోకి తీసుకున్నారు. అంతర్జాతీయ ఇస్లాం తీవ్రవాద సంస్థ (ఐఎస్ఐఎస్)తో సంబంధాలు ఉన్నట్లుగా వెల్లడైందని పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవాల నేపథ్యంలో ఆయా ప్రాంతాలలో ఐసిస్ స్లీపర్ సెల్స్ పనిచేస్తున్నాయని విశ్వసనీయ సమాచారం అందింది. దీనితో నిఘా వేసి వారిని పట్టుకున్నట్లు వెల్లడించారు. పట్టుకున్న వారిలో ముగ్గురు సోదరులు అని, వారు యువతను తీవ్రవాదం వైపు ఆకర్షితులు చేయడం, వారిని సంస్థలోకి తీసుకునే రిక్రూట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇక పట్టుబడ్డ 17 ఏండ్ల బాలుడు కూడా ఐసిస్ ముఠాలో ఉన్నాడని వెల్లడించారు. వీరి కదలికల గురించి తమకు సమాచారం రావడంతో గత రెండు మూడు రోజులుగా కీలక ప్రాంతాలలో తగు విదంగా నిఘా వేయడం ద్వారా వీరిని అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. ఈ ముఠా రిపబ్లిక్ డే సందర్భంగా ఉగ్రవాద చర్యలకు వ్యూహరచనకు పాల్పడిందని , సకాలంలో వీరిని అరికట్టగలిగామని తెలిపారు. దాడుల సందర్భంగా వీరి నుంచి కత్తులు, రసాయనికాలు, విషపు పొడర్లు, మొబైల్ ఫోన్లు, అనేక సిమ్‌లు స్వాధీనపర్చుకున్నారు. వీరిపై చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం పరిధిలో కేసులు పెట్టారు. ఈ ముఠా ఉనికి వీరి పూర్వాపరాలు ఇతర అంశాలపై దర్యాప్తు చేపట్టినట్లు ఎటిఎస్ వర్గాలు తెలిపాయి.

భోపాలా... రాయ్‌బరేలీయా?

ప్రియాంక ఎన్నికల బరిపై జోరుగా చర్చ

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల తేదీలను ఇంకా ప్రకటించక ముందే మధ్యప్రదేశ్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు భోపాల్ పార్లమెంటరీ స్థానం నుంచి ఎఐసిసి ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ప్రియాంక గాంధీ పోటీ చేయాలని కోరుతూ భోపాల్ నగరమంతా హోర్డింగులు ఏర్పాటు చేశారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయ కేతనం ఎగురవేయడంతో నూతనోత్సాహంలో ఉన్న కాంగ్రెస్ ద్వితీయ శ్రేణి నాయకులు భోపాల్ నుంచి పోటీ చేసేందుకు ప్రియాంకను ఒప్పించాలని ఆమె తల్లి సోనియా గాంధీ, పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీని ఈ హోర్డింగుల ద్వారా కోరుతున్నారు. 1984 నుంచి భోపాల్ లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ గెలవలేదని, ప్రియాంక గాంధీ పోటీ చేస్తే 34 ఏళ్ల తర్వాత ఈ స్థానం కాంగ్రెస్‌కే దక్కడం ఖాయమని స్థానిక కాంగ్రెస్ నాయకుడు ప్రశాంత్ గురుదేవ్ అంటున్నారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మా స్వరాజ్ ప్రాతినిధ్యం వహిస్తున్న విదిష స్థానం నుంచి ప్రియాంక పోటీ చేయాలని మరో



కాంగ్రెస్ నాయకుడు సౌరబ్ సక్సేనా కోరుతున్నారు. ఇదే డిమాండుతో ఆయన సోషల్ మీడియాలో ప్రచారం కూడా మొదలుపెట్టారు. కాగా, ఎక్కడి నుంచి పోటీ చేయాలన్నది ప్రియాంక గాంధీ ఇష్టమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చంద్ర ప్రభాస్ శేఖర్ తేల్చేశారు. ఇక ఆమె ఎన్నికల బరిలో దిగుతారా? లేక గతంలో మాదిరిగానే తన తల్లి, సోదరుడి నియోజకవర్గాలలో ప్రచార బాధ్యతలు కూడా చేపడతారా అన్నదానిపై కూడా కాంగ్రెస్‌లో చర్చ జరుగుతోందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. క్రియాశీల రాజకీయాల నుంచి సోనియా ఎలాగూ తప్పుకున్నారని, ఆమె ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న రాయ్‌బరేలీ నుంచి ఈ సారి ప్రియాంక బరిలోకి దిగే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని, ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను చూస్తే అది మరింత బలపడిందని కాంగ్రెస్ సీనియర్ నేత ఒకరు వ్యాఖ్యానించారు.

విరాళాల్లో దొంగ సొమ్ము

- పార్టీలకు భారీగా గుప్త నిధులు
- బిజెపికి రూ 689.44 కోట్లు



న్యూఢిల్లీ : జాతీయ రాజకీయ పార్టీలకు నిధులు అత్యధికం అజ్ఞాత వర్గాల నుంచే అందుతున్నాయి. దేశంలో గుర్తింపు పొందిన వివిధ పార్టీలకు 2017–18 సంవత్సరంలో అందిన నిధుల వివరాలు వెల్లడయ్యాయి. ఈ మొత్తం నిధులలో సగానికి పైగా గుర్తు తెలియని వర్గాల నుంచి పార్టీలకు అందాయి. అజ్ఞాత వర్గాల నుంచి ఎలక్టోరల్ బాండ్స్, స్వచ్ఛంద విరాళాల రూపంలో ఈ మొత్తాలు అందినట్లు ప్రజాస్వామిక సంస్కరణలకు ఉద్దేశించిన ఎన్నికల నిఘా సంస్థ (ఎడిఆర్) బుధవారం తెలియచేసింది. ఎన్నికల కమిషన్‌కు ఆరు జాతీయ పార్టీలు అందించిన ఐటి రిటర్నులు, అందిన చందాల మొత్తాల ప్రకటనల విశ్లేషణలతో ఎడిఆర్ తన నిర్థారణలను వెల్లడించింది. దీని ప్రకారం 2017–18లో బిజెపి, కాంగ్రెస్, సిపిఐ, బిఎస్‌పి, టిఎంసి, ఎన్‌సిపిలకు అందిన మొత్తం ఆదాయం రూ 1293.05 కోట్లుగా లెక్కకట్టారు. అయితే ఈ ఆదాయంలో సగానికి పైగా అంటే రూ 689.44 కోట్లు (53 శాతం) తమకు ఎక్కడి నుంచి అందాయనేది పార్టీలు వెల్లడించలేదు. ఈ విధంగా అజ్ఞాత వనరులుగా మిగిలాయి. బిజెపికి మొత్తం రూ 689.44 కోట్లు అందాయి. ఇందులో పి ఈ అజ్ఞాత వర్గాల జాబితా పరిధిలో రూ 553.38 కోట్లు చూపింది. జాతీయ పార్టీలకు ఈ మార్గంలో అందిన మొత్తం ఆదాయంలో ఇది 80 శాతం వరకూ ఉంది. ఇక ఎలక్టోరల్ బాండ్స్ రూపేణా పార్టీకి రూ 215 కోట్లు వచ్చాయి. ఇది మొత్తం ఆదాయంలో 31 శాతం. పార్టీలకు 51 శాతం పైఆ అంటే రూ 354.22కోట్ల వరకూ నిధులు అజ్ఞాత వర్గాల ద్వారా స్వచ్ఛంద విరాళాలుగా అందాయి. రూ 20000 తక్కువ స్థాయిలో ఈ చందాలు అందాయి. ఇక ఇతరత్రా గుర్తు తెలియని వర్గాల ద్వారా అందిన మొత్తం నాలుగున్నర కోట్ల రూపాయల వరకూ ఉంది. ఇక పార్టీలకు అందిన మొత్తం ఆదాయంలో రూ 467. 13 కోట్ల వరకూ ఎవరి నుంచి అందాయనేది ఎన్నికల కమిషన్‌కు పేర్లతో సహా వెల్లడించారు. ఈ విధంగా లెక్కలోకి వచ్చిన ఆదాయం 36 శాతం వరకూ ఉంటుంది. ఇక ఆస్తుల అమ్మకాలు, ప్రచురణలు సభ్యత్వ రుసుం, బ్యాంకు వడ్డీలు , పార్టీ సుంకాల వంటి వాటి ద్వారా అందిన మొత్తం రూ 136.48 కోట్లు వరకూ ఉంది. ఈ విధంగా సమకూరిన మొత్తాలు ఎక్కడి నుంచి వచ్చాయనేది ఎన్నికల సంఘానికి చూపారు. రూ 20000లు అంతకు పైగా అందిన విరాళాల వివరాలను పరిశీలిస్తే వీటిలో పార్టీలకు నగదు రూపంలో అందింది కేవలం రూ 16.80 లక్షలుగా నమోదు అయింది. జాతీయ పార్టీలలో ఒకటి అయిన సిపిఎంకు అందిన విరాళాలు, దక్కిన ఆదాయం గురించి ఎఆర్‌డి వెల్లడించలేకపోయింది. 2017–18 ఆర్థిక సంవత్సరానికి ఈ పార్టీకి సంబంధించిన అనుబంధాలు, షెడ్యూల్‌లు అందుబాటులోకి రాలేదని తెలిపారు. వివిధ పార్టీలకు అందే రూ 20000, లేదా ఎలక్టోరల్ బాండ్స్ ద్వారా విరాళాలు అందించే వ్యక్తులు లేదా సంస్థల పేర్లను ఎన్నికల సంఘానికి తెలియచేయాల్సిన అవసరం లేదు. 2013 జూన్‌లో కేంద్ర సమాచార కమిషన్ (సిఐసి) ఇచ్చిన రూలింగ్ మేరకు జాతీయ పార్టీలను సమాచార హక్కు చట్టం పరిధిలోకి తీసుకువచ్చారు. అయితే ఇప్పటికీ పార్టీలు ఈ నిర్ణయానికి కట్టుబడి ఉండటం లేదు.

> ప్రస్తుతం షమీ భీకర ఫామ్‌లో ఉన్నాడు. గతంలో ఎన్నడూ లేని విధంగా బంతితో చెలరేగి పోతున్నాడు. ప్రారంభంలోనే కీలక వికెట్లు తీసి జట్టుకు పైచేయి అందించాడు. రానున్న మ్యాచుల్లో కూడా ఇదే జోరును కొనసాగిస్తాడని ఆశిస్తున్నా.
>
> – టీమిండియా కెప్టెన్ విరాట్

మన తెలంగాణ
హైదరాబాద్
గురువారం 24, జనవరి 2019
www.manatelangana.news



సెరెనాకు షాక్

సెమీస్‌లో ప్లిస్కోవా, ఒసాకా, జకోవిచ్







మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ఓపెన్ మహిళల సింగిల్స్‌లో బుధవారం పెను సంచలనం నమోదైంది. టైటిల్ ఫేవరెట్‌గా భావిస్తున్న అమెరికా దిగ్గజం, 16వ సీడ్ సెరెనా విలియమ్స్ క్వార్టర్ ఫైనల్లోనే ఇంటిదారి పట్టింది. చెక్ రిపబ్లిక్ స్టార్, ఏడో కరోలినా ప్లిస్కోవా చేతిలో సెరెనాకు చుక్కెదురైంది. మరో క్వార్టర్ ఫైనల్లో జపాన్ ఆశాకిరణం, నాలుగో సీడ్ నవోమి ఒసాకా జయభేరి మోగించింది. పురుషుల సింగిల్స్‌లో టాప్ సీడ్ నొవాక్ జకోవిచ్, ఫ్రాన్స్ సంచలనం లుకాస్ పౌలీ సెమీ ఫైనల్‌కు చేరుకున్నారు. జపాన్ ఆటగాడు నిషికోరి గాయం వల్ల అర్ధాంతరంగా వైదొలగడంతో జకోవిచ్ పూర్తి మ్యాచ్ ఆడకుండానే సెమీస్ బెర్త్‌ను దక్కించుకున్నాడు.

ప్లిస్కోవా జోరు

సెరెనాతో జరిగిన పోరులో చెక్ స్టార్ ప్లిస్కోవా జోరును కొనసాగించింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్ హలెప్‌ను ఓడించి దూకుడు మీదున్న సెరెనాకు ప్లిస్కోవా చుక్కలు చూపించింది. నువ్వానేనా అన్నట్టు సాగిన పోరులో ప్లిస్కోవా 6–4, 4–6, 7–5తో విజయం సాధించింది. ప్రారంభ సెట్‌లో ప్లిస్కోవా ఆధిపత్యం చెలాయించింది. చూడచక్కని షాట్లతో సెరెనాను ఉక్కిరిబిక్కిరి చేసింది. సెరెనాను ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా ఆడిన ప్లిస్కోవా లక్ష్యం దిశగా అడుగులు వేసింది. ఇదే జోరుతో సెట్‌ను సొంతం చేసుకుంది. కానీ, రెండో సెట్‌లో పరిస్థితి తారుమారు అయ్యింది. ఈసారి సెరెనా హవా నడిపించింది. తన మార్క్ షాట్లతో విరుచుకు పడిన సెరెనా అలవోకగా సెట్‌ను సాధించింది. ఇక, ఫలితాన్ని తేల్చే మూడో సెట్‌లో ఇద్దరు నువ్వానేనా అన్నట్టు తలపడ్డారు. అయితే చివరి వరకు ఆధిక్యాన్ని నిలబెట్టుకోవడంలో సఫలమైన ప్లిస్కోవా మ్యాచ్‌ను సొంతం చేసుకుని సెమీస్‌కు చేరింది. మరో క్వార్టర్ ఫైనల్లో జపాన్ స్టార్ ఒసాకా విజయం సాధించింది. ఏకపక్షంగా సాగిన క్వార్టర్ ఫైనల్లో ఒసాకా 6–4, 6–1తో ఉక్రెయిన్ స్టార్, ఆరో సీడ్ ఎలినా స్వితోలినాను చిత్తు చేసింది.

నిషికోరి ఔట్

పురుషుల సింగిల్స్‌లో 8వ సీడ్ నిషికోరి గాయం వల్ల మ్యాచ్ మధ్యలోనే నిష్క్రమించాడు. ఆ సమయంలో టాప్ సీడ్ జకోవిచ్ 6–1, 4–1 ఆధిక్యంలో ఉన్నాడు. దీంతో జకోవిచ్‌కు సెమీస్ బెర్త్ లభించింది. మరో క్వార్టర్ ఫైనల్లో లుకాస్ పౌలీ విజయం సాధించాడు. కెనడా ఆటగాడు మిలోస్ రౌనిక్‌తో జరిగిన పోరులో లుకాస్ 7–6, 6–3, 6–7, 6–4తో జయకేతనం ఎగుర వేశాడు. ప్రారంభం నుంచే ఆధిపత్యం చెలాయించిన లుకాస్ అలవోకగా రెండు సెట్లు గెలుచుకున్నాడు. మూడో సెట్‌లో మాత్రం రౌనక్ విజయం సాధించాడు. కానీ మళ్లీ నాలుగో సెట్‌ను గెలిచిన లుకాస్ సెమీస్‌కు దూసుకెళ్లాడు.

సైనా శుభారంభం



జకార్తా: ఇండోనేషియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత స్టార్ సైనా నెహ్వాల్ శుభారంభం చేసింది. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో సాయి ప్రణీత్, శుభంకర్‌లు తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టారు. మహిళల డబుల్స్‌లో కూడా భారత్‌కు పరాజయం ఎదురైంది. సిక్కిరెడ్డి–అశ్విని పొన్నప్ప జోడీ మొదటి రౌండ్‌లో ఓటమి పాలైంది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్‌లో 8వ సీడ్ సైనా 7–21, 21–16, 21–11తో స్థానిక క్రీడాకారిణి డినర్ డియాను ఓడించింది. తొలి గేమ్‌లో సైనాకు చుక్కెదురైంది. డినర్ అద్భుత ఆటతో సైనాను హడలెత్తించింది. ఇదే క్రమంలో అలవోకగా సెట్‌ను గెలిచి ప్రకంపనలు సృష్టించింది. అయితే తర్వాతి రెండు గేమ్‌లలో సైనా పుంజుకుంది. ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ఆడిన సైనా వరుసగా రెండు సెట్లు గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఇక, పురుషుల సింగిల్స్‌లో సాయి ప్రణీత్ ఓటమి పాలయ్యాడు. ఒలింపిక్ చాంపియన్, చైనా స్టార్ చెన్ లాంగ్‌తో జరిగిన పోరులో ప్రణీత్‌కు ఓటమి ఎదురైంది. ఏకపక్షంగా సాగిన పోరులో చెన్ లాంగ్ 21–12, 21–16తో ప్రణీత్‌ను ఓడించాడు. మరో పోటీలో శుభంకర్ పోరాడి ఓడాడు. అగ్రశ్రేణి ఆటగాడు విక్టర్ అలెక్సన్ (డెన్మార్క్)తో జరిగిన పోరులో 14–21 21–19 15–21తో ఓటమి పాలయ్యాడు.

కోహ్లికి విశ్రాంతి



ముంబయి: న్యూజిలాండ్‌తో జరిగే చివరి రెండు వన్డేలు, ట్వంటీ–20 సిరీస్ నుంచి టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లికి విశ్రాంతి కల్పించారు. రానున్న ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని కోహ్లికి విశ్రాంతి ఇవ్వడమే మంచిదని భారత క్రికెట్ బోర్డు (బిసిసిఐ) భావించింది. ఇందులో భాగంగానే కివీస్‌తో జరిగే నాలుగో, ఐదు వన్డేకు కోహ్లి అందుబాటులో ఉండడు. అంతేగాక మూడు మ్యాచ్‌ల టి–20 సిరీస్‌లో కూడా కోహ్లి ఆడడు. దీంతో జట్టు సారథ్య బాధ్యతలను రోహిత్ శర్మ నిర్వర్తిస్తాడు. ఇంగ్లండ్ వేదికగా జరిగే ప్రపంచకప్‌కు మరి కొంత సమయం మాత్రమే మిగిలివున్న నేపథ్యంలో కోహ్లికి విశ్రాంతి ఇవ్వడమే మంచిదని బోర్డు భావించింది. కొంత కాలంగా కోహ్లి ఎడతెరిపి లేకుండా క్రికెట్ ఆడుతున్నాడు. దీంతో ఫిట్‌నెస్ సమస్యలు తలెత్తే అవకాశాలు అధికంగా ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో అతనికి విశ్రాంతి కల్పించడమే మంచిదని బిసిసిఐ నిర్ణయించింది.



ఎంతో బాధపడ్డా..

ముంబయి: హార్దిక్ పాండ్య, లోకేశ్ రాహుల్ వివాదంపై కాఫీ విత్ కరణ్‌షో వ్యాఖ్యాత కరణ్ జోహర్ తొలిసారిగా పెదవి విప్పారు. తన వల్లే హార్దిక్, రాహుల్‌లు ఇబ్బందులకు గురయ్యారని వాపోయారు. తాను వారిని షోకు పిలిచి ఉండక పోతే ఇలాంటి పరిస్థితి తలెత్తేది కాదని అభిప్రాయపడ్డారు. రాహుల్, పాండ్యల పరిస్థితి చూస్తే తనకు ఎంతో బాధగా ఉందన్నారు. సరదగా చేసిన వ్యాఖ్యలకు ఇంత భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని తాను ఊహించలేదన్నారు.. వీరి పరిస్థితిలో ఉన్నారంటే దానికి తానే పూర్తి బాధ్యుడినని కరణ్ స్పష్టం చేశారు. అయితే షో టెలికాస్ట్ అయిన తర్వాత చేసేదేమి ఉండదని, ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా చేయి దాటి పోయిందన్నారు. అయితే త్వరలోనే అంతా సర్దుకుంటుందనే నమ్మకాన్ని కరణ్ వ్యక్తం చేశారు. కాగా, ఈ వివాదం తర్వాత తాను ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపానని, దీని నుంచి బయట పడేందుకు చాలా సమయమే పట్టిందని పేర్కొన్నారు.

ఆరంభం అదిరింది..

చెలరేగిన షమీ, కుల్దీప్, రాణించిన ధావన్, కోహ్లి

తొలి వన్డేలో భారత్ ఘన విజయం





నేపియర్: న్యూజిలాండ్‌తో జరుగుతున్న వన్డే సిరీస్‌లో టీమిండియా బోణీ కొట్టింది. బుధవారం జరిగిన తొలి వన్డేలో భారత్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ గెలుపుతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 1–0 ఆధిక్యాన్ని అందుకుంది. మహ్మద్ షమీ (3/19), కుల్దీప్ యాదవ్ (4/39), చాహల్ (2/43) బంతితో చెలరేగడంతో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆతిథ్య న్యూజిలాండ్ జట్టు 38 ఓవర్లలో 157 పరుగులకే కుప్పకూలింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో విధించిన లక్ష్యాన్ని రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. సూర్య కిరణాల వల్ల మ్యాచ్‌కు అంతరాయం కలగడంతో భారత లక్ష్యాన్ని 49 ఓవర్లలో 156 పరుగులకు కుదించారు. ఈ లక్ష్యాన్ని టీమిండియా 34.5 ఓవర్లలోనే కేవలం రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి అందుకుంది. ఓపెనర్ శిఖర్ ధావన్ 75 (నాటౌట్), కెప్టెన్ విరాట్ కోహ్లి (45) జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. రాయుడు 13 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఓపెనర్ రోహిత్ శర్మ 11 పరుగులు చేసి ఔటయ్యాడు. అద్భుత బౌలింగ్‌తో కివీస్‌ను తక్కువ స్కోరుకే పరిమితం చేయడంలో కీలకపాత్ర పోషించిన షమీకి మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు లభించింది. ఇరు జట్ల మధ్య రెండో వన్డే శనివారం జరుగుతుంది.

షమీ మ్యాజిక్



టాస్ గెలిచి బ్యాటింగ్ చేపట్టిన ఆతిథ్య న్యూజిలాండ్‌కు ప్రారంభంలోనే షమీ కోలుకోలేని దెబ్బ తీశాడు. ప్రమాదకర ఆటగాడు మార్టిన్ గుప్టిల్ (5)ను షమీ అద్భుత బంతితో క్లీన్‌బౌల్డ్ చేశాడు. ఆ వెంటనే మరో ఓపెనర్ కొలిన్ మున్రో (8)ను కూడా షమీ పెవిలియన్ పంపించాడు. దీంతో కివీస్ 19 పరుగులకే ఓపెనర్ల వికెట్లను కోల్పోయింది. ఈ దశలో ఇన్నింగ్స్‌ను కుదుట పరిచే బాధ్యతను కెప్టెన్ కేన్ విలియమ్సన్ తనపై వేసుకున్నాడు. అతనికి సీనియర్ ఆటగాడు రాస్ టైలర్ అండగా నిలిచాడు. ఇద్దరు భారత బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ ముందుకు సాగారు. భారీ షాట్ల జోలికి వెళ్లకుండా సమన్వయంతో ఆడుతూ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించారు. అయితే మూడు ఫోర్లతో 24 పరుగులు చేసిన టైలర్‌ను చాహల్ అద్భుత బంతితో ఔట్ చేశాడు. దీంతో 52 పరుగుల వద్ద కివీస్ మూడో వికెట్‌ను కోల్పోయింది.

విలియమ్సన్ ఒంటరి పోరాటం

తర్వాత వచ్చిన బ్యాట్స్‌మెన్ ఒకరి వెంట ఒకరూ పెవిలియన్ బాట పట్టారు. జట్టును ఆదుకుంటాడని భావించిన వికెట్ కీపర్ టామ్ లాథమ్ నిరాశ పరిచాడు. ఒక ఫోర్‌తో పది పరుగులు చేసిన లాథమ్‌ను చాహల్ ఔట్ చేశాడు. ఆ వెంటనే హెన్రీ నికోలస్ కూడా ఔటయ్యాడు. 12 పరుగులు చేసిన నికోలస్‌ను కేదార్ జాదవ్ వెనక్కి పంపాడు. ఒక వైపు వికెట్లు పడుతున్నా కెప్టెన్ విలియమ్సన్ పోరాటం కొనసాగించాడు. కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన విలియమ్సన్ 81 బంతుల్లో ఏడు ఫోర్లతో 64 పరుగులు చేసి కుల్దీప్ బౌలింగ్‌లో పెవిలియన్ చేరాడు.

కుల్దీప్ మాయ

ఆ వెంటనే కుల్దీప్ అసాధారణ రీతిలో చెలరేగిపోయాడు. వరుస వికెట్లతో కివీస్ లోయర్ ఆర్డర్‌ను కుప్పకూల్చాడు. కుదురుగా ఆడుతున్న విలియమ్సన్‌ను ఔట్ చేయడం ద్వారా కుల్దీప్ ప్రత్యర్థి జట్టును కోలుకోలేని దెబ్బ తీశాడు. ఇక, సాంట్నర్ (14)ను షమీ వెనక్కి పంపాడు. బ్రేస్‌వెల్ (7), ఫెర్గ్యూసన్ (0), ట్రెంట్ బౌల్ట్ (1)లను కుల్దీప్ ఔట్ చేశాడు. దీంతో కివీస్ ఇన్నింగ్స్ 157 పరుగుల వద్దే ముగిసింది. కివీస్ చివరి ఐదు వికెట్లను 50 పరుగుల తేడాతో కోల్పోవడం గమనార్హం.

ధావన్, కోహ్లి జోరు

తర్వాత సునాయాస లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన భారత్‌కు ఓపెనర్లు రోహిత్ శర్మ, శిఖర్ ధావన్‌లు శుభారంభం అందించారు. కివీస్ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న ఇద్దరు స్కోరును పరిగెత్తించారు. విరామ సమయానికి జట్టు స్కోరు 9 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 41 పరుగులకు చేరింది. ఆట తిరిగి ప్రారంభమైన వెంటనే రోహిత్ పెవిలియన్ చేరాడు. 11 పరుగులు చేసిన రోహిత్‌ను బ్రేస్‌వెల్ వెనక్కి పంపాడు. తర్వాత వచ్చిన కెప్టెన్ కోహ్లి అండతో ధావన్ జోరును కొనసాగించాడు. మధ్యలో ప్రతికూల వాతావరణం వల్ల కొద్ది సేపు ఆటను నిలిపి వేశారు. ఆట తిరిగి ప్రారంభమైన తర్వాత కోహ్లి, ధావన్ మరింత దూకుడుగా ఆడారు. దీంతో స్కోరు వేగంగా పరిగెత్తింది. కీలక ఇన్నింగ్స్ ఆడిన కోహ్లి 59 బంతుల్లో మూడు ఫోర్లతో 45 పరుగులు చేశాడు. ఈ క్రమంలో రెండో వికెట్‌కు 91 పరుగులు జోడించాడు. మరోవైపు సమన్వయంతో బ్యాటింగ్ చేసిన ధావన్ 103 బంతుల్లో ఆరు ఫోర్లతో 75 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. అతనికి రాయుడు రెండు ఫోర్లతో 13 (నాటౌట్) సహకారం అందించాడు. దీంతో భారత్ సునాయాస విజయాన్ని అందుకుంది.

స్కోరుబోర్డు:

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: మార్టిన్ గుప్టిల్ (బి) షమీ 5, కొలిన్ మున్రో (బి) షమీ 8, కేన్ విలియమ్సన్ (సి) విజయ్ (బి) కుల్దీప్ 64, రాస్ టైలర్ (సి) అండ్ (బి) చాహల్ 24, టామ్ లాథమ్ (సి) అండ్ (బి) చాహల్ 11, హెన్రీ నికోలస్ (సి) కుల్దీప్ (బి) కేదార్ 12, సాంట్నర్ ఎల్బీ–బి షమీ 14, బ్రేస్‌వెల్ (బి) కుల్దీప్ 7, టిమ్ సౌథి నాటౌట్ 9, ఫెర్గ్యూసన్ (స్టంప్డ్) ధోని (బి) కుల్దీప్ 0, ట్రెంట్ బౌల్ట్ (సి) రోహిత్ (బి) కుల్దీప్ 1, ఎక్స్‌ట్రాలు 2, మొత్తం 38 ఓవర్లలో 157 ఆలౌట్.
బౌలింగ్: భువనేశ్వర్ కుమార్ 5–0–20–0, మహ్మద్ షమీ 6–2–19–2, విజయ్ శంకర్ 4–0–19–0, చాహల్ 10–0–43–2, కుల్దీప్ యాదవ్ 10–1–39–4, కేదార్ జాదవ్ 3–0–17–1.
భారత్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (సి) గుప్టిల్ (బి) బ్రేస్‌వెల్ 11, శిఖర్ ధావన్ నాటౌట్ 75, విరాట్ కోహ్లి (సి) లాథమ్ (బి) ఫెర్గ్యూసన్ 45, అంబటి రాయుడు నాటౌట్ 13, ఎక్స్‌ట్రాలు 12, మొత్తం 34.5 ఓవర్లలో 156/2.
బౌలింగ్: ట్రెంట్ బౌల్ట్ 6–1–19–0, టిమ్ సౌథి 6.5–0–36–0, ఫెర్గ్యూసన్ 8–0–41–1, బ్రేస్‌వెల్ 7–0–23–1, సాంట్నర్ 7–0–32–0.

ఆటను అడ్డుకున్న భానుడు



భోజన విరామం తర్వాత ఆట తిరిగి ప్రారంభమైంది. అయితే ఈ సమయంలో సూర్యుడి కిరణాలు పిచ్‌పై నేరుగా పడడంతో బ్యాట్స్‌మెన్ తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ విషయాన్ని ధావన్ అంపైర్ల దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో కొద్ది సేపు మ్యాచ్‌ను నిలిపి వేయాల్సి వచ్చింది. అనంతరం భారత జట్టు లక్ష్యాన్ని డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 49 ఓవర్లలో 156 పరుగులకు కుదించారు. తిరిగి ఆట ప్రారంభం కాగా భారత్ అలవోకగా మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. కాగా, సూర్యుడి వల్ల ఓ మ్యాచ్‌ను నిలిపి వేయడం క్రికెట్ చరిత్రలో ఇదే తొలిసారి కావడం విశేషం.

మన తెలంగాణ
హైదరాబాద్
గురువారం 24, జనవరి 2019
www.manatelangana.news

ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలని ప్రియాంక మంచి నిర్ణయం తీసుకున్నారని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి, తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ ఆర్‌సి కుంటియా అన్నారు. దేశంలో కాంగ్రెస్ కార్యకర్తలు కూడా ఇదే క్షణం కోసమే ఎదురుచూస్తున్నారని వ్యాఖ్యానించారు. పార్టీలో ఆమెకు ఎఐసిసి ప్రధాన కార్యదర్శి పదవిని అప్పగించడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ప్రియాంక రావడం ఒక్క ఉత్తర్‌ప్రదేశ్‌లోనే కాకుండా దేశం మొత్తం మీద ప్రభావం చూపుతుందన్నారు.

విశాల

ఇవిఎంలు భేష్: నితీష్‌కుమార్



పాట్నా: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఇవిఎంలు) పనితీరును బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ సమర్థించారు. అవి కచ్చితంగా పనిచేస్తున్నాయని కొనియాడారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్ వెరిఫికేషన్ పేపర్ ఆడిట్ ట్రయల్స్‌ను (వివిపిఎట్) లను ఏర్పాటు చేస్తే ఏ సమస్యా ఉండదని బీహార్ ముఖ్యమంత్రిసూచించారు. ఇవిఎంల తీరుపై వివాదాలు రేగి, ప్రతిపక్ష నాయకులు విమర్శిస్తున్న నేపథ్యంలో ... వారు చెప్పేదానితో తాను ఏకీభవించనన్నారు. ఇవిఎంలను విమర్శించే ప్రతిపక్షాల్లో కాంగ్రెస్ పార్టీ కూడా ఉంది. 'ఎవరి హయాంలో ఇవిఎంలు వచ్చాయి?' అని నితీష్ కాంగ్రెస్‌ను నిలదీశారు. 'ఇవిఎంలపై నా వైఖరి చాలా స్పష్టం. అవి కరెక్ట్‌గా ఉన్నాయి. ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవి బలాన్నిచ్చాయి' అని నితీష్ విలేకరులకు చెప్పారు. రాష్ట్ర రాజధానిలో జరిగిన నేతాజీ సుభాష్‌చంద్రబోస్ 122వ జయంతి సందర్భంగా నితీష్ ఆయనకు నివాళులర్పించిన తర్వాత మీడియాతో మాట్లాడారు. బ్యాలెట్ పత్రాలు వాడేటప్పుడు బోగస్ ఓటింగ్‌కు, బూత్ లను స్వాధీనం చేసుకోడానికి అవకాశం ఉండేదని, కానీ ఇవిఎంలతో ఆ అవకాశం లేదని ఆయన చెప్పారు.

గుజరాత్ అల్లర్ల కేసు : నలుగురికి బెయిల్

న్యూఢిల్లీ : గుజరాత్‌లో 2002లో జరిగిన అల్లర్లకు సంబంధించిన నరోడా పాటియా ఊచకోత కేసులోని నలుగురు దోషులకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. కోర్టు ఈ నలుగురి శిక్షలపై సందేహం వ్యక్తంచేసింది. తీర్పుపై చర్చించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. ఉమేశ్‌భాయ్ భర్వాద్, రాజ్‌కుమార్, హర్షద్, ప్రకాశ్‌భాయ్ రాథోడ్ అనే నలుగురికి గుజరాత్ హైకోర్టు పదేళ్ల జైలు శిక్షను విధించింది. కాగా తాజాగా జస్టిస్ ఏఎం ఖాన్‌విల్కర్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం వారికి బెయిల్‌మంజూరు చేసింది. శిక్షకు సంబంధించిన తీర్పును చర్చించాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించింది.

కమలా హ్యారిస్ ప్రచార బోణీ

24 గంటల్లో 10 లక్షల డాలర్లు విరాళాలు



వాషింగ్టన్ : భారతీయ సంతతి సెనేటర్ కమలా హ్యారిస్ అమెరికా అధ్యక్ష పదవికి తమ ప్రచారం ప్రారంభించారు. రికార్డు స్థాయిలో విరాళాలు పొందుతున్నారు. ప్రతిపక్ష డెమొక్రటిక్ పార్టీ తరపున పోటీకి దిగుతున్నట్లు ఆమె వెల్లడించారు. 24 గంటల వ్యవధిలోనే 10 లక్షల డాలర్ల విరాళాలను సేకరించారు. ట్రంప్‌తో పోటీకి తాను బరిలో ఉన్నట్లు ప్రకటించిన హ్యారిస్ ఎబిసి గుడ్ మార్నింగ్ అమెరికా కార్యక్రమం ద్వారా విరాళాలకు పిలుపు నిచ్చారు. 24 గంటలు గడిచేసరికి ఆమెకు భారీ స్థాయిలో నిధులు సమకూరాయని ఫ్యాక్స్ న్యూస్ తెలిపింది. తన విజ్ఞప్తిని మన్నించి స్వచ్ఛందంగా సత్వరంగా తనకు విరాళాలు ప్రకటిస్తున్న వారికి థ్యాంక్స్ అంటూ హ్యారిస్ ప్రకటన వెలువరించారు. నిజానికి 12 గంటలు దాటేలోపునే కమలా హ్యారిస్‌కు పది లక్షల ఫండ్ సమకూరింది. సగటున ఒక్కో అమెరికన్ నుంచి 37 డాలర్ల విరాళం అందినట్లు లెక్కకట్టారని వాల్ స్ట్రీట్ జర్నల్‌లో ఒక వార్తా కథనం వెలువడింది. అమెరికన్ల కోసం కమలా హ్యారిస్ అని ముద్రించి ఉన్న టీ షర్టులు, టోపీలు, ప్లకార్డులు వంటివి 11 లక్షల వరకూ ఒక్కరోజునే అందాయి. ట్రంప్‌తో తలపడేందుకు సిద్ధపడుతున్న డెమొక్రట్లలో కమలా హ్యారిస్ నాలుగో వ్యక్తిగా నిలిచారు.

సెక్స్ వద్దన్నందుకు హిజ్రాపై కాల్పులు

న్యూఢిల్లీ: తమతో శృంగారానికి ఒప్పుకోనందుకు ఒక హిజ్రాపై ఇద్దరు వ్యక్తులు తుపాకీతో కాల్పులు జరిపారు. దేశ రాజధాని ఢిల్లీలో ఈ దారుణ సంఘటన జరిగింది. ఆదివారం అర్ధరాత్రి ఒక 21ఏళ్ల ట్రాన్స్ జెండర్ త్రిలోక్‌పురి వద్ద ఒక కారును లిఫ్టు అడిగింది. అక్కడి నుంచి బారాపుల్లా రోడ్‌కు వెళుతుండగా కారులోని ఇద్దరు వ్యక్తులు ఆ వ్యక్తి మహిళ కాదు..ట్రాన్స్‌జెండర్ అని గుర్తించి తమతో శృంగారంలో పాల్గొనాలని ఒత్తిడి చేశారు. అందుకు ఆ హిజ్రా నిరాకరించడంతో ఆమెపై కాల్పులు జరిపి, ఆమెను కారులో నుంచి తోసేసి పరారయ్యారు. అర్ధరాత్రి 12.30 ప్రాంతంలో బారాపుల్లా ఫ్లైఓవర్‌పైన రక్తమోడుతూ పడి ఉన్న మహిళను చూసిన స్థానికులు వెంటనే హజ్రత్ నిజాముద్దీన్ పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించారు. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులకు స్థానికులే ఆమెను ఎయిమ్స్‌కు తరలించారు. అనంతరం పోలీసులు ఎయిమ్స్‌కు చేరుకోగా ఆమెకు ఆపరేషన్ చేసి కడుపులోనుంచి బుల్లెట్ తీసినట్లు డాక్టర్లు తెలిపారు. ప్రస్తుతం బాధితురాలి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు.

కనిపించిన ఆడపిల్లలందరినీ కాల్చేస్తా

సాల్ట్ లేక్ సిటీ(యుఎస్): కంటపడిన ఆడపిల్లలందరినీ చంపేస్తానంటూ ఫేస్‌బుక్‌లో బెదిరింపు పోస్ట్ పెట్టిన ఒక 27 ఏళ్ల యువకుడిని అమెరికా పోలీసులు ఉటాలో అరెస్టు చేశారు. శనివారం అమెరికా వ్యాప్తంగా మహిళా ప్రదర్శనలు జరగనున్న నేపథ్యంలో అతడు ఉగ్రవాద చర్యలకు పాల్పడతాడన్న అనుమానంతో పోలీసులు అరెస్టు చేశారు. డెన్వర్‌కు చెందిన క్రిస్టఫర్ డబ్ల్యూ క్లియరీ తన ఫేస్‌బుక్ పోస్ట్‌లో తనకు ఆడస్నేహితులే లేరని. తాను ఇప్పటికీ బ్రహ్మచారినేనని, అందుకే మూకుమ్మడి హత్యలు చేయాలనుకుంటున్నానని రాసుకున్నాడు. తనను తిరస్కరించిన మహిళలకు తగిన గుణపాఠం చెప్పాలన్నది అతని ఉద్దేశమని, చనిపోవడానికి సిద్ధపడిన వ్యక్తి అత్యంత ప్రమాదకరమని పోలీసులు తమ ఎఫ్‌ఐఆర్‌లో పేర్కొన్నారు. శనివారం సాల్ట్ లేక్ సిటీకి దక్షిణాన ఉన్న ప్రోవో నగరంలోని ఒక హోటల్‌లో గది అద్దెకు తీసుకున్న క్లియరీని పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించారు.

నైజీరియాలో మళ్లీ 'లాస్సా' ఫీవర్

ఇంతవరకూ 16 మంది మృతి

లాగోస్: తమ దేశంలో 'లాస్సా' అనే జ్వరం తిరిగి ప్రబలుతోందని, జనవరి ఆరంభం నుంచీ దానిబారిన పడి 16మంది మరణించారని నైజీరియా ఆరోగ్య అధికారులు వెల్లడించారు. గత ఏడాది ఈ జ్వరాన్ని విజయవంతంగా అరికట్టగలిగినా, తిరిగి ఈ ఏడాది ఆరంభంలో లాస్సా జ్వరం తిరిగి వ్యాపిస్తోందని నేషనల్ సెంటర్ ఫర్ కంట్రోల్ (ఎన్‌సిడిసి) విడుదల చేసిన నివేదిక పేర్కొంది. జనవరి ఒకటి నుంచి అనుమానంగా ఉన్న మొత్తం 172 కేసుల్ని గుర్తించారు. అందులో 60 కేసుల్లో పాజిటివ్ ఫలితం వచ్చింది. ధ్రువీకరించిన లాస్సా జ్వరాల కేసుల్లో 26.7 శాతం మరణాల రేటు ఉందని ఎన్‌సిడిసి నివేదిక తెలిపింది. 'లాస్సా జ్వరం కేసులు పెరుగుతుండడంవల్ల ఈ జ్వరం ప్రబలుతోందని ప్రకటించిన ఎన్‌సిడిసి సమన్వయ చర్యలు తీసుకునేందుకు ఎమర్జెన్సీ ఆపరేషన్స్ సెంటర్‌ను అప్రమత్తం చేసింది' అని ఆ నివేదిక పేర్కొంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ), వ్యాధిని అదుపుచేసే అమెరికా కేంద్రాలు, నైజీరియా ప్రభుత్వఆరోగ్యాధికారుల సమన్వయంతో లాస్సాను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. 2018లో 23 రాష్ట్రాల్లో ప్రబలిన ఈ జ్వరంవల్ల 171 మంది మరణించారు. ఈ ఏడాది 36 నైజీరియా రాష్ట్రాల్లో ఏడింటిలో ఈ వైరస్‌ను కనుగొన్నారు.

ముగ్గురు మిలిటెంట్లు హతం

శ్రీనగర్: జమ్ము కశ్మీర్‌లోని బారాముల్లా జిల్లాలో బుధవారంనాడు భద్రతా దళాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మిలిటెంట్లు మరణించారని పోలీసులు తెలిపారు. మిలిటెంట్లు సంచరిస్తున్నట్టు సమాచారం అందడంతో జిల్లాలోని బిన్నర్ ప్రాంతంలో భద్రతాదళాలు కార్డన్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టారని పోలీస్ అధికారి ఒకరు తెలిపారు. భద్రతా దళాలపై మిలిటెంట్లు కాల్పులు జరపడంతో సెర్చ్ ఆపరేషన్ ఎన్‌కౌంటర్‌కు దారితీసింది.సంఘటనా స్థలంలో మిలిటెంట్ల ఆయుధాలు, నేరప్రవృత్తిని తెలిపే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

తెర వెనుక నుంచి తెరపైకి..

న్యూఢిల్లీ: కాంగ్రెస్ తెరపైకి ప్రియాంక గాంధీ ఉరుములేని మెరుపులాగా దూసుకువచ్చారు. 28 సంవత్సరాల క్రితం తండ్రి రాజీవ్ గాంధీ అంతిమయాత్రలో జనంతో పాటు నడిచిన ప్రియాంక ఇప్పుడు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అయ్యారు. ప్రత్యక్ష రాజకీయాలలోకి అత్యంత కీలకమైన లోక్‌సభ ఎన్నికల సమయంలోనే ఆమె ప్రవేశం జరిగింది. నెహ్రూ గాంధీల వారసత్వ రాజకీయాలు కాంగ్రెస్‌కు కొత్తేం కాదు. ప్రియాంక గాంధీ వాద్రా రాకతో ఈ తరహాలో తరాల పరంపర కొనసాగింపు చోటుచేసుకుంది. దాదాపు రెండు దశాబ్దాలుగా ప్రియాంక ప్రత్యక్ష్య రాజకీయ రంగ ప్రవేశంపై పలు రకాలుగా ఊహాగానాలు చెలరేగుతూ వచ్చాయి. అయితే సోదరుడు రాహుల్ గాంధీనే అన్నీ తానై అయి సాగిపోతున్న కాంగ్రెస్‌కు ఇప్పుడు ప్రియాంక తోడు సారథ్యం వహిస్తారని భావిస్తున్నారు. అయితే ఆమెను పుట్టిల్లు ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ పటిష్టత బాధ్యతల సారధిగా తెరపైకి తీసుకువచ్చారు. కీలకమైన యుపిలో ప్రియాంక ప్రత్యక్ష రాజకీయ ప్రవేశంపై అనేక రకాలుగా చర్చ రగులుకుంది. ఆమె రాజకీయాలకు వస్తారు? రారు , ఇప్పుడు కాదు ...ఇక ముందు వంటి పలు చర్చలకు ఇప్పుడు తెరపడింది. కీలకమైన సార్వత్రిక ఎన్నికలకు ఆమె ఆకర్షణీయ ప్రచారకర్తగా ఉంటారని నిర్ధారణ అయింది. ప్రియాంకకు ఉత్తరప్రదేశ్‌లో పార్టీ పటిష్టత తరువాత ప్రచార బాధ్యతలను ఇవ్వడం తద్వారా రాహుల్ , సోనియాలు విస్తృతస్థాయిలో దేశవ్యాప్తంగా ప్రచారం సాగించడం, తాను కూడా ఇతర ప్రాంతాలలో సభలకు వెళ్లడం వంటి వ్యూహాలకు పదును పెట్టారు. ప్రియాంక సమర్థతతో ఉన్న నమ్మకాన్ని సోనియా, రాహుల్‌లు ఈ విధంగా చాటుకున్నారు. ఇద్దరు పిల్లల తల్లి అయిన 47 ఏండ్ల ప్రియాంక అచ్చం నానమ్మ ఇందిరను పోలి ఉంటుందని, ఆమె గ్లామర్ కోణంలో పార్టీకి బలం అని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇందిర చొరవ, ఆమె రూపం, అంతకు మించి యుపిలో స్థానికత ప్రభావం ప్రియాంకకు చాలా కలిసి వస్తుందని భావిస్తున్నారు. ఇప్పటివరకూ ప్రియాంక పార్టీలో అంతర్గతంగానే పరిమితం అయ్యారు. అమేథీ, రాయ్‌బరేలీలలో పార్టీ కంచుకోటలు దెబ్బతినకుండా ఎప్పటికప్పుడు ప్రజలను కలుస్తూ వస్తున్నారు. ఇక్కడి వారు పలు ప్రాంతాల యుపీవాలాలు ప్రియాంకకు పార్టీలో అత్యున్నత స్థానం కావాలని కోరుతూ వచ్చారు. ముందున్న శ్రేణులను కాకండా జనంలోతట్టు వరకూ దూసుకువెళ్లడంలో ఆమె ఇందిరను తలపిస్తారని, ఇప్పటికీ ఆమె కాంగ్రెస్‌లో కీలక పాత్రకు సమయం వచ్చిందని కొందరు నేతలు సంబరపడుతున్నారు.

1999లో రాజకీయ ప్రవేశం ... తల్లికి ప్రచారం



1999లో ప్రియాంక రాజకీయాలలోకి వచ్చారు. అప్పట్లో ఎన్నికలలో అమేథీ నుంచి తల్లి సోనియా విజయానికి కీలక పాత్ర పోషించారు. పార్టీ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారి ఎన్నికల్లో పోటీ చేసిన సోనియాకు ఆమె ప్రచార సారథిగా నిలిచారు. అమేథీతో పాటు రాయ్‌బరేలీలో కూడా విజయానికి తన పాత్ర పోషిస్తూ వచ్చారు. నానమ్మ ఇందిరలాగానే పదునైన రీతిలో ప్రసంగించడంలో, స్థానిక అంశాలను, ప్రత్యేకించి ప్రత్యర్థుల బలహీనతలను గతాన్ని గుర్తించి వాటితోనే వారిని దెబ్బతీయడంలో ప్రియాంక నేర్పరిగా పేరొందారు. 2004లో సోదరుడు రాహుల్ తొలిసారిగా అమేథీ నుంచి లోక్‌సభకు పోటీ చేసినప్పుడు కూడా ప్రియాంకనే ప్రచార బాధ్యతలు తీసుకున్నారు. ప్రస్తుతం యుపిలోని తూర్పు ప్రాంతం అత్యంత కీలకమైనది. ఇక్కడ మొత్తం 40 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి.

ఇక్కడి నుంచే పలువురు ప్రముఖులు లోక్‌సభ బరిలోకి దిగాల్సి ఉంది. ఈ ప్రాంతంలోని అత్యధిక స్థానాలపై తన ప్రభావం చూపె ట్టం తద్వారా, జాతీయస్థాయిలో కాంగ్రెస్‌కు ప్రియాంక తరహా రాజకీయాల ఘట్టాన్ని తీసుకురావడం, ఇప్పటివరకూ రాహుల్ పట్ల కొందరిలో ఉన్న నిరాశను, కాంగ్రెస్ పట్ల ఉన్న నైరాశ్యాన్ని దెబ్బతీసేందుకు ఇప్పుడు ప్రియాంక వచ్చినట్లు పార్టీ వర్గాలు విశ్లేషించాయి. చాలా కాలం గా ప్రియాంక లావో ...కాంగ్రెస్ బచావో నినాదాలు వెలవడుతూ వచ్చాయి. ఇవి ఇప్పుడు నిజం అయ్యాయి. 1972 జనవరి 12 వ తేదీన ప్రియాంక జన్మించారు. ఢిల్లీకి చెందిన వ్యా పారి రాబర్ట్ వాద్రాను ప్రేమించి పెళ్లి చేసుకున్నారు.

టి.కాంగ్రెస్ హర్షం

ఏఐసిసి ప్రధాన కార్యదర్శిగా ప్రియాంక గాంధీని నియమించడం తెలంగాణ కాంగ్రెస్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఆనందంతో నృత్యాలు చేశారు. పరస్పరం ఆలింగనం చేసుకుని స్వీట్లు తినిపించుకున్నారు. దీంతో గాంధీభవన్ ఒక్కసారిగా సందడిగా మారిపోయింది. టిపిసిసి అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సిఎల్పీ నాయకుడు భట్టి విక్రమార్క, ఏఐసిసి కార్యదర్శులు వి. హనుమంతరావు, మధుయాష్కి, మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి, ఏఐసిసి అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్, టిపిసిసి ఉపాధ్యక్షుడు మల్లురవి, కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి తదితరులు రాహుల్ నిర్ణయాన్ని స్వాగతించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రియాంక గాంధీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడం వల్ల కాంగ్రెస్‌కు మరింత మేలు జరుగుతుందన్నారు.



కొందరికి కుటుంబమే పార్టీ

ప్రియాంకపై ప్రధాని నరేంద్ర మోడీ పరోక్ష విసుర్లు

న్యూఢిల్లీ: ప్రియాంక గాంధీవాద్రా రాజకీయ రంగ ప్రవేశాన్ని ఉద్దేశించి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బుధవారం కాంగ్రెస్ పార్టీపైన, గాంధీ కుటుంబంపైన పరోక్షంగా విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ప్రియాంక గాంధీని తూర్పు ఉత్తర ప్రదేశ్‌కు పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమించింది. మహారాష్ట్ర నుంచి వచ్చిన భారతీయ జనతాపార్టీ కార్యకర్తలతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ మోడీ– కొందరికి కుటుంబమే పార్టీ అని, కానీ అధికారంలో ఉన్న కాషాయపార్టీ అందుకు పూర్తిగా వ్యతిరేకమని అన్నారు. 'ఫలానా కుటుంబానికి చెందిన వ్యక్తి లేదా ఫలానా కుటుంబం కోరినట్టు మన పార్టీ ఎప్పుడూ నిర్ణయం తీసుకోలేదు. చాలా చోట్ల ఒక కుటుంబమే పార్టీగా చెలామణి అవుతుంది. కానీ బిజెపి విషయంలో పార్టీనే కుటుంబం' అని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. 'బిజెపి కేడర్లున్న పార్టీ. పార్టీ కార్యకర్తలతోనే బిజెపి నిర్మాణమైంది. దేశానికి అంకితమైంది. ప్రజాస్వామ్యం మన సంస్కృతిలో భాగం' అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విఫలమైనందువల్లే ప్రియాంకగాంధీని రాజకీయాల్లోకి తీసుకొచ్చారని బిజెపి వ్యాఖ్యానించిన అనంతరం ప్రధానమంత్రి కాంగ్రెస్‌పై ఈ విమర్శ చేశారు.

రాహుల్ వైఫల్యాన్ని సూచిస్తోంది: బిజెపి

ప్రియాంక గాంధీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడం రాహుల్ వైఫల్యాన్ని సూచిస్తోందని బిజెపి విమర్శించింది. పార్టీకి రాహుల్ సరైన నాయకత్వం అందించలేకపొయ్యారు. అందుకే ఎన్నికల సమయంలో సోదరి ప్రియాంకను తెర పైకి తెచ్చారని, ఈ విధంగా కాంగ్రెస్ వర్గాలే స్వయంగా రాహుల్ వైఫల్యాన్ని అంగీకరించాయని బిజెపి ప్రతినిధి సంబిత్ పాత్ర చెప్పారు. ఏది ఏమైనా ఇదంతా కుటుంబ కూటమి వ్యవహారంగా అన్పిస్తోందని వ్యాఖ్యానించారు. వివిధ పార్టీలు తిరస్కరించడంతో ఇప్పుడు కాంగ్రెస్ అధ్యక్షులు కుటుంబ పొత్తుకు దిగినట్లుగా ఉందని విమర్శించారు. రాహుల్‌కు ఇప్పుడు కుటుంబం నుంచి ఊతకర్ర అందిందని, సరైన సమర్థత లేకపోవడంతోనే ప్రియాంకను తీసుకువచ్చినట్లుగా పార్టీ నాయకత్వమే బహిరంగంగా అంగీకరించినట్లు అయిందని పాత్ర చెప్పారు. యుపి తూర్పు ప్రాంత కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా ప్రియాంకను పార్టీ అధ్యక్షులు రాహుల్ గాంధీ బుధవారం నియమించారు. ఈ అంతర్గత పరిణామంపై బిజెపి ప్రతినిధి స్పందించారు. కుటుంబ సభ్యులలో వారు కాకపోతే వీరికి పట్టం కట్టడం అనేది కాంగ్రెస్ ఆనవాయితీ అని, అది ఇప్పుడు రుజువు అయిందని సంబిత్ విమర్శించారు. రాబోయే లోక్‌సభ ఎన్నికలు నాందార్, కాందార్‌ల మధ్యనే అని ప్రధాని మోడీ చెపుతూ వస్తున్నారని, ప్రియాంక ఆగమనంతో కాంగ్రెస్ పార్టీ కుటుంబ పాలన వ్యవహారం మరింత స్పష్టం అయిందని అన్నారు. కాంగ్రెస్‌లో కుటుంబమే పార్టీ అని, బిజెపిలో పార్టీనే కుటుంబం అన్నారు. ఇదే ఈ రెండు పార్టీల మధ్య మౌలిక భేదం అన్నారు.

సంతోషం.. నాకు సాయపడుతుంది

- ప్రియాంక రాకతో బిజెపిలో గుబులు
- ఎస్‌పి, బిఎస్‌పితో చర్చలకు రెడీ
- అమేథీ పర్యటనలో రాహుల్ వ్యాఖ్యలు



అమేథీ: తన సోదరి ప్రియాంక గాంధీ క్రియాశీల రాజకీయాల్లో ప్రవేశించడాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ స్వాగతించారు. తాజా పరిణామం తనకు చాలా ఆనందాన్నిస్తుందన్నారు. రాబోయే ఎన్నికల్లో తనకు ప్రియాంక సాయపడుతారని రాహుల్ విశ్వాసం వ్యక్తం చేశారు. బుధవారంనాడు తన నియోజకవర్గం అమేథీలో పర్యటిస్తున్న రాహుల్ మీడియాతో మాట్లాడారు. బిజెపిని ఓడించడానికి ఉత్తర్‌ప్రదేశ్‌లో జట్టుకట్టిన ఎస్‌పి, బిఎస్‌పిలకు సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు. ప్రియాంక రాజకీయ ప్రవేశంతో బిజెపికి 'భయం' పట్టుకుందని వ్యాఖ్యానించారు. ప్రియాంక తనతో కలసి పార్టీ లో పనిచేయనుండడం తనకు వ్యక్తిగతంగా ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రియాంక గాంధీ ముందుకు తీసుకెళ్లగలదన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. పశ్చిమ ఉత్తర్‌ప్రదేశ్ ఎఐసిసి ప్రధాన కార్యదర్శిగా నియమితులైన జ్యోతిరాదిత్య సింధియాను చురుకైన నాయకుడిగా రాహుల్ అభివర్ణించారు. ఆయన నియామకం చాలా ముఖ్యమైన చర్యగా రాహుల్ పేర్కొన్నారు. 'వాళ్లిద్దరిని ఏదో రెండు మాసాల కోసం పనిచేయాలని యుపికి పంపించడం లేదు. కాంగ్రెస్ సిద్ధాంతాలను పేదలు, అట్టడుగు వర్గాలకు చేరవేసే ఒక మిషన్‌ను వారికి అప్పగించాను' అని వ్యాఖ్యానించారు. అది యుపి కానీ, గుజరాత్ అయినా వెనకడుగు వేసే ప్రసక్తే లేదని, ముందడుగేనని అన్నారు. ఎస్‌పి, బిఎస్‌పి నేతలతో విభేదాలు లేవని, సిద్ధాంత పరంగా యుపిలో బిజెపికి వ్యతిరేకంగా పోరాడుతామని. ఒక వేళ తమతో చర్చలకు అఖిలేశ్, మాయావతి వస్తే స్వాగతిస్తామన్నారు. ఎస్‌పి, బిఎస్‌పి పార్టీలను గౌరవిస్తానని ఆయన చెప్పారు. 2019 లోక్‌సభ ఎన్నికలలో ప్రియాంక గాంధీ పోటీ చేస్తారా అన్న ప్రశ్నకు దీనిపై నిర్ణయం తర్వాత తీసుకుంటామని చెప్పారు. కాంగ్రెస్‌లోకి ప్రియాంక రాకను తాము ఆ కోణంలో చూడడం లేదని ఆయన అన్నారు. కాగా, ప్రత్యక్ష రాజకీయాల్లోకి ప్రియాంక గాంధీ ప్రవేశాన్ని దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు హర్షిస్తున్నారని రాజస్థాన్ ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలట్ తెలిపారు. రాహుల్, ప్రియాంక ఇక కలసి పనిచేయనున్నందున బిజెపి జాగ్రత్తగా ఉండాల్సి ఉంటుందని సచిన్ హెచ్చరించారు.

ఆ ఐదు రోజులు అడవిలో ఉంటా

- నన్ను నేను తెలుసుకునేందుకు ప్రయత్నిస్తా
- మీరూ ఆ పని చేయండి : ప్రధాని మోడీ

న్యూఢిల్లీ: ప్రతి ఏడాది దీపావళి పండుగ కాలంలో తాను ఐదు రోజులు అడవిలో ఒంటరి జీవితాన్ని గడుపుతానని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వెల్లడించారు. "ది హ్యూమన్స్ ఆఫ్ బాంబే" ఫేస్‌బుక్ పేజ్‌కి ఇచ్చిన మూడవ భాగం ఇంటర్వ్యూలో ఆయన తన జీవితంలో ఎవరికీ తెలియని కోణాలను ఆవిష్కరించారు. "ప్రతి సంవత్సరం దీపావళి సందర్భంగా ఐదు రోజులు ఏదో ఒక మారుమూల ఆడవిలోకేవలం మంచి నీరు, మనుషులెవరూ ఉండని ప్రదేశానికి వెళ్లిపోతాను. నన్ను నేను తెలుసుకోవడానికి ప్రయత్నిస్తాను" అని మోడీ చెప్పారు.

"పరుగులు తీసే జీవితం నుంచి, నిరంతరం తీరికలేని బతుకు పోరాటం నుంచి కొంతకాలం విశ్రాంతి తీసుకోండి..ఆత్మపరిశీలన చేసుకోండని అందుకే అందరికీ, ముఖ్యంగా నా యువజన మిత్రులకు చెబుతుంటాను.. అలా చేయడం వల్ల మీ ఆలోచనా ధోరణి మారుతుంది. మిమల్ని గురించి మీరు బాగా తెలుసుకుంటారు" అని మోడీ సలహా ఇచ్చారు. ఇదివరకు ఇచ్చిన రెండు ఇంటర్వ్యూలలో తన బాల్య జీవితం, ఆర్‌ఎస్‌ఎస్ తనను ఎందుకు ఆకర్షించింది, 17ఏళ్ల వయసు ఉన్నప్పుడు తాను హిమాలయాలలో రెండేళ్లు గడిపిన విషయాల గురించి మోడీ వివరించారు. అయితే, మంగళవారం ప్రచురించిన పోస్ట్‌లో ఆయన తాను హిమాలయాల నుంచి తిరిగి వచ్చిన తర్వాత తన జీవితం ఎలా మారిందన్న విషయాల గురించి వెల్లడించారు. "హిమాలయాల నుంచి తిరిగివచ్చిన తర్వాత ఇతరుల కోసమే నా ఈ జీవితం అన్న సత్యాన్ని గ్రహించాను. కొద్ది కాలానికే అహ్మదాబాద్ వెళ్లిపోయాను. ఒక పెద్ద నగరంలో కాలుపెట్టడం అదే నాకు మొదటిసారి..మా బంధువు క్యాంటీన్‌లో అప్పుడప్పుడు పనిచేస్తూ సాయపడేవాణ్ణి. కొద్దిరోజుల్లోనే ఆర్‌ఎస్‌ఎస్‌కు పూర్తి స్థాయి ప్రచారక్‌గా మారిపోయాను. విభిన్న రంగాలకు చెందిన వ్యక్తులను కలుసుకునే అవకాశం అక్కడే నాకు లభించింది. ఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయాన్ని శుభ్రం చేయడం, సహచరులకు టీ, ఆహారం తయారు చేయడం, వంట పాత్రలు కడగడం వంటి పనులను మేము చేస్తుండేవాళ్లం. క్షణం తీరికలేని పనులు ఉన్నప్పటికీ హిమాలయాలలో నేను సంపాదించిన "మానసిక శక్తి"ని వృథాగా పోనివ్వదలచుకోలేదు. అప్పటి నుంచి ప్రతి ఏటా కొన్ని రోజులు నాకోసం కేటాయించుకుని నన్ను నేను ఆత్మపరిశీలన చేసుకుని, సమతుల్య జీవితాన్ని కొనసాగించాలని నిర్ణయించుకున్నాను" అని మోడీ తెలిపారు.

"దీపావళి సమయంలో నేను ఐదు రోజులు ఎక్కడ ఉంటానో ఇప్పటి వరకు ఎవరికీ తెలియదు. ఏదో ఒక మారుమూల అడవిలో, కేవలం మంచి నీరు, మనుషులెవరూ ఉండని చోటికి వెళ్లిపోతాను. ఐదురోజులకు సరిపడ ఆహారాన్ని నా వెంట ఉంచుకుంటాను. రేడియోలు కాని వార్తాపత్రికలు కాని అక్కడ ఉండవు..ఆ రోజుల్లో టివి కాని ఇంటర్నెట్ సౌకర్యం కాని ఎటూ లేవు" అని ప్రధాని మోడీ అన్నారు. "అక్కడ గడిపే ఆ కాలమే జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి అవసరమైన మానసిక శక్తిని ప్రసాదిస్తోంది. ఎవరిని కలుసుకోబోతున్నావని కొందరు సన్నిహితులు నన్ను తరచూ అడుగుతుంటారు... "నన్ను నేను కలుసుకోవడానికి వెళుతున్నాను" అని చెబుతుంటాను" అని ప్రధాని మోడీ వెల్లడించారు.



నేతాజీకి ప్రధాని మోడీ నివాళి

న్యూఢిల్లీ: ఇండియన్ నేషనల్ ఆర్మీ(ఐఎన్‌ఏ) వ్యవస్థాపకులు నేతాజీ సుభాష్ చంద్ర బోస్ 122వ జయంతి సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ బుధవారం ఆయనకు ఘన నివాళులర్పరించారు. నేతాజీ జయంతిని పురస్కరించుకుని ఆయనకు ప్రణామాలు అర్పిస్తున్నానని ప్రధాని మోడీ ఒక వీడియోతోపాటు ఒక సందేశాన్ని ట్వీట్ చేశారు. భారతదేశ స్వాతంత్ర్యం కోసం, ఔన్నత్యంతో జీవించడం కోసం తన జీవితాన్నే అంకితం చేసిన మహాయోధునిగా ఆయన నేతాజీని తన సందేశంలో అభివర్ణించారు. నేతాజీ ఆశయాలను నెరవేర్చి, భారతదేశాన్ని శక్తివంతమైన దేశంగా తీర్చిదిద్దాలన్నదే తమ ధ్యేయమని ప్రధాని తెలిపారు. కాగా, న్యూఢిల్లీలోని ఎర్ర కోట వద్ద నేతాజీ, ఆయన స్థాపించిన ఐఎన్‌ఏకి సంబంధించిన మ్యూజియంలను ప్రధాని ప్రారంభించారు.

Printed and Published by **Tumu Mohan Rao** on behalf of Moveon Media Private Limited, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037 Medchel-Malkajgiri District, TELANGANA and Published from H.No.1-1-60/7A, 4th floor Beacon towers, street no.13, Jawaharnagar, near RTC X Roads Hyderabad-500020 Telangana state, Editor : **Anjaiah Polisetty**, RNI No. TELTEL/2012/42234. Email Id. editor@manatelangana.org. Phone No.040-27655666